ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
శ్రీకాకుళం
: fb.com/vaartha Digital
Published from Srikakulam ,Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem
21-7-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 170 పేజీలు: 12 వెల: 6.50

వర్షాకాల సమావేశాల్లోనే జస్టిస్ వర్మపై అభిశంసన!

హెచ్-1 బి వీసా జారీలో సవరణలు

5లో

# ఆగస్టు నుంచి కొత్త పట్టా పుస్తకాలు

## అభ్యంతరం లేని నివాసస్థలాలకు డిసెంబరులోగా క్రమబద్ధీకరణ

## 2027 డిసెంబరుకు రీ సర్వే 2.0

## అమరావతికి అంతర్జాతీయ గుర్తింపు: సిఎం చంద్రబాబు నాయుడు



**విజయవాడ,జూలై20,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో భూసమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిస్థాయిలో దృష్టిపెడతామని సిఎం చంద్రబాబు స్పష్టం చేసారు.ఆ దిశలో చంద్రబాబు కీలకంగా రెవెన్యూ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో సమన్వయంతో వ్యవహరించాలని కోరారు. ప్రభుత్వానికి ప్రజల నుంచి వచ్చే అభ్యర్ధన పత్రాల్లో భూసమస్యలు అధికారంగా ఉంటున్నాయని చంద్రబాబు వ్యాఖ్యానించారు.ఆ పరిస్థితి ఇకపై ఉండకూడదని సిఎం చంద్రబాబు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అధికార వర్గాల సమాచారాన్ని అనుసరించి రెవెన్యూ అంశాలపై సిఎం చంద్రబాబు కీలకంగా వర్చువల్ సమావేశాలు నిర్వహిస్తున్నారు. తాజాగా నిర్వహించిన సమావేశంలో ప్రజల సమస్యల పరిష్కారం ప్రధాన లక్ష్యంగా రెవెన్యూ శాఖ అనునిత్యం పనిచేయాలి, శాఖ పరిధిలో తెచ్చే ప్రతి కార్యక్రమం కూడా ఆ దిశగానే ఉండాలని సిఎం చంద్రబాబు నాయడు అన్నారు. రెవెన్యూ శాఖలో ప్రజల సమస్యలకు పరిష్కారం చూపితే ప్రభుత్వానికి కూడా మంచి పేరు వస్తుందన్నారు.గత ప్రభుత్వం కారణంగా తలెత్తిన సమస్యలను వేగంగా పరిష్కరించి ప్రజలకు స్వాంతన చేకూర్చాలని సిఎం అన్నారు. ఈ విషయంలో గ్రామ స్థాయి ఉద్యోగి నుంచి రాష్ట్ర స్థాయి అధికారి వరకు సాంకేతికతను ఉపయోగించుకుని క్షేత్ర స్థాయిలో ఫలితాలు వచ్చేలా చూడాలని సిఎం సూచించారు.

సమస్యలు, ప్రజలఅర్జీలు, రెవెన్యూ శాఖలో సేవలు సులభతరం చేసేందుకు తీసుకుంటున్న చర్యలతో పాటు వివిధ అంశాలపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ "అక్టోబర్ నాటికి ప్రతి ఒక్కరికీ శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు అందించాలి. ప్రభుత్వం వచ్చిన తరువాత 43.89 లక్షల మందికి కుల ధ్రువీకరణ ప్రతాల అందేజేశారు. మిగిలిన వారికి కూడా వీటిని అందించాలి. ఒకసారి ధృవీకరణ పత్రం పొందితే, వారి కుటుంబ సభ్యులకు ఆటోమేటిక్ గా ఆ డాటా ఆధారంగా కులధృవీకరణ పత్రం వచ్చేలా చూడాలి. ఎస్సీలకు స్మశాన వాటికల స్థలాల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేయాలి. 363 హేబిటేషన్స్‌కు స్మశాన వాటికలకు స్థలాలు ఇవ్వాలి. దీనికి భూసేకరణ కోసం రూ. 137 కోట్లు అవసరం. వచ్చే రెండు మూడేళ్లలో పూర్తి స్థాయిలో ఈ కార్యక్రమం పూర్తి చేయాలి" అన్నారు.. అక్టోబర్ నాటికి ఫ్రీ హోల్డ్ అంశానికి పూర్తి పరిష్కారం చూపాలని, అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సిఎం అధికారులకు స్పష్టం చేశారు

ముఖ్యమంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జగన్ సర్వే రాళ్లపై తన బొమ్మలు ముద్రించుకున్నాడు. వీటికి సంబంధించి 77.9 లక్షల సర్వే రాళ్లపై పేర్లు, బొమ్మల తొలగింపు పూర్తి చేశారు. అలాగే సర్వే పూర్తయిన భూ యజమానులకు కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను >>2



# నేటినుంచి వర్షాకాల పార్లమెంటు

## 8బిల్లులు ఆమోదించే అవకాశం

## సమావేశాలు సజావుగా సాగేందుకు సహకరించాలని కేంద్ర మంత్రుల విజ్ఞప్తి

**న్యూఢిల్లీ, జూలై 20:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందు కేంద్ర ప్రభుత్వం ఆదివారం ఏర్పాటు చేసిన అఖిల పక్ష సమావేశంలో ప్రతిపక్షం అధికారపక్షాలమధ్య తీవ్ర వాగ్యుద్ధం జరిగింది. ఇరువైపులా వాడివేడిగా విమర్శలుప్రతివిమర్శలతోనే సాగినక్రమంలో వర్షాకాల సమావేశాలకు ప్రతిపక్షాలు సహకరించాలని మంత్రి జెపినడ్డా కోరారు. అలాగే ఈపార్లమెంటు సమావేశాల్లోనే ఎనిమిది ప్రత్యేక బిల్లులను ఆమోదింపచేసుకునేందుకు ఎన్డీయే పక్షం కసరత్తులుచేస్తుంటే విపక్షాలు మాత్రం తమ >>2



# కృష్ణమ్మ పరవళ్లు

### శ్రీశైలం జలాశయానికి పెరిగిన వరద

### సాగర్ ఎడమ కాలువకు నీరు విడుదల


**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై20:** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. ఎగువన ఉన్న జలాశయాల నుంచి భారీగా వరద విడుదల చేస్తున్న నేపథ్యంలో మరో మూడు నాలుగు రోజుల్లో శ్రీశైలం జలాశయం నిండుతుందని అధికారవర్గాలు అంచనా వేసున్నాయి. జూరాల,సుంకేశుల బ్యారేజ్‌ల నుంచి శ్రీశైలం ప్రాజెక్టులోకి 1,38,841 క్యూసెక్కులు చేరుతుండగా.. విద్యుదుత్పత్తి ద్వారా ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు 67,488 క్యూసెక్కులను దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి పోతి రెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా 20వేల క్యూసెక్కులు, హంద్రీ నీవా కోసం 1,013 క్యూసెక్కులను ఏపీ తీసుకుంటుండగా, కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా 1,600 క్యూసెక్కులను తెలంగాణ తీసుకుంటోంది. మహారాష్ట్ర, కర్ణాటకల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కృష్ణా ప్రధాన పాయతోపాటు మలప్రభ, ఘటప్రభలు వరద పోటు త్తుతున్నాయి. దాంతో ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌లలోకి వరద ఉధృతి పెరిగింది. ఆల్మట్టి డ్యామ్‌లోకి 94వేల క్యూసెక్కులు చేరుతుండగా.. 90 వేల క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. నారాయణపూర్ డ్యామ్‌లోకి 1.15 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. 1.01 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల ప్రాజెక్టులోకి 1.15 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. 1.22 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. తుంగభద్ర డ్యామ్‌కు వస్తున్న 39,339 క్యూసెక్కుల వరదను వచ్చిందొచ్చినట్టుగా దిగువన శ్రీశైలంకు విడుదల చేస్తున్నారు. శ్రీశైల జలాశయం ఆదివారం సాయంత్రం 6 గంటల వరకు అధికారులు తెలిపిన లెక్కల వివరాల ప్రకారం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం జలాశయంలో 882.70 అడుగులు ఉన్నాయి. జలాశయంలో నీటి సామర్థం 215.8070 టీఎంసీలు కాగా ప్రస్తుతం జలాశయంలో >>2

# రాజమండ్రి జైలుకు మిధున్ రెడ్డి

## ఆగస్టు 1 దాకా రిమాండ్

## లిక్కర్ స్కాంలో ఎసిబి కోర్టు ఆదేశాలు

**విజయవాడ,జూలై20,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి మద్యం కుంభకోణం కేసులో వైఎస్సార్సీ ఎంపీ మిథున్‌రెడ్డికి విజయవాడ ఎసిబి కోర్టు రిమాండ్ విధించింది. ఆగస్టు 1 వరకు మిథున్‌రెడ్డికి రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మిథున్‌రెడ్డిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు అధికారులు తరలించనున్నారు. ఇప్పటివరకు అరెస్టయిన నిందితులను సిట్ ఆగస్టు 1న కోర్టులో ప్రవేశపెట్టనుంది. మద్యంకేసులో ఇరువైపు న్యాయవాదుల వాదనలు విన్న అనంతరం న్యాయమూర్తి మిధున్ రెడ్డికి రిమాండ్ విధించారు. సిట్ తరఫున న్యాయవాది కోటేశ్వరరావు వాదనలు వినిపించగా, మిథున్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది నాగార్జునరెడ్డి వాదనలు వినిపించారు. తొలుత వైద్యపరీక్షల అనంతరం విజయవాడ ఎసిబి కోర్టు జడ్జి ముందుకు వైఎస్సార్సీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని ప్రవేశపెట్టారు. మద్యం కేసులో మిథున్ రెడ్డిని సిట్ అధికారులు జడ్జి ముందు హాజరుపర్చారు. మిథున్‌రెడ్డి అరెస్టుకు 29 కారణాలను సిట్ అధికారులు కోర్టుకు నివేదించారు. సెక్షన్ 409, 420, 120 (బీ), రెడ్‌విత్ 34, 37, ప్రివెన్షన్ ఆఫ్ కరెప్షన్ యాక్ట్ కింద 7, 7ఏ, 8, 13(1)(బీ), 13(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. మిథున్‌రెడ్డికి రిమాండ్ విధించాలని సిట్ తరఫు న్యాయవాదులు కోరారు. మద్యం కేసు మనీ ట్రైల్‌లో మిథున్‌రెడ్డి పాత్రపై >>2





ఈ నెల 13న అన్నమయ్య ప్రాజెక్టును పరిశీలించిన నిపుణుల కమిటీ

# రాక్ ఫిల్! ఎర్త్‌డ్యామ్?

- అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణానికి జియోఫిజికల్ ఇన్వెస్టిగేషన్
- నిపుణుల కమిటీ సిఫారసు
- 30 యేళ్ల క్రితం నిర్మించిన డయాఫ్రంవాల్ భద్రమేనా?

**రాజంపేట, జూలై 20, ప్రభాతవార్త:** నదీ గర్భంలో ఏనుగులు దూరే అంతటి సొరంగాలు ప్రాజెక్టు నిర్మాణానికి ఇది పెద్ద అవరోధం. దేశ విదేశాల నుంచి ఎందరో నిపుణులు వచ్చారు. అమెరికా నుంచి ఓ ఇంజనీరింగ్ నిపుణుడు కూడ ఈ ప్రాజెక్టును సందర్శించారు. అందరూ నిపుణులు పరిశీలించిన తర్వాతే సుమారు 52ఏళ్ల క్రితం ప్రాణం పోసుకున్న కడప జిల్లా రాజంపేట మండలంలో చెయ్యేరు నదిపై నిర్మించిన అన్నమయ్య ప్రాజెక్టును ఎలాంటి సమస్య లేకుండా 1999నాటికి కేవలం 50కోట్ల వ్యయంతో అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో పూర్తి చేశారు. ఆసియా ఖండంలోనే ఎర్త్ డ్యాంలో గ్యాలరీ ఉన్న ఏకైక ప్రాజెక్ట్ ఇదే. అలాంటి ప్రాజెక్టు పునర్నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ జియో ఫిజికల్ ఇన్వెస్టిగేషన్ చేయాలని సిఫార్సు చేసినట్లు సమాచారం. గత వైఎస్సార్సీ సర్కార్ హయాంలో పోలవరం ప్రాజెక్టు డయా ఫ్రం వాల్ దెబ్బతినడంతో ఇదే విధంగా జియో ఫిజికల్ ఇన్వెస్టిగేషన్ చేసినట్లుగానే ఇక్కడ కూడ అదే విధానాన్ని అమలు చేయడానికి అక్కడి నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో నిపుణుల కమిటీలో సభ్యునిగా వచ్చిన పోలవరం ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ రమేష్‌కుమార్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణానికి నిపుణుల కమిటీ త్వరలో ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్న నేపథ్యంలో 'వార్త' అందిస్తున్న ప్రత్యేక కథనం ఇది.. ఉమ్మడి కడప జిల్లాలో చెయ్యేరు నదిపై అన్నమయ్య ప్రాజెక్టును 2.24 టిఎంసిల సామర్థ్యంతో నిర్మించారు. ఈ ప్రాజెక్టు నీటి విడుదల సామర్థ్యం నాటి డిజైన్ ప్రకారం 1.85లక్షలు. అయితే అన్నమయ్య ప్రాజెక్టు ఎర్త్ డ్యాం కొట్టుకుపోయినప్పుడు 2021 నవంబర్ 19న చెయ్యేరు నదికి భారీ వరదలు వచ్చినప్పుడు వచ్చిన ఇన్‌ఫ్లో 4 నుంచి 5లక్షలు అని అధికారులు చెబుతున్నారు. 2003లో కూడ ఒక ప్రాజెక్టు గేటు కొట్టుకుపోవడం, 2019లో కూడ ఇలాంటి ఘటనే చోటు చేసుకోవడం. 2021లో ఏకంగా అధికారుల నిర్లక్ష్యమో, ప్రకృతి వైపరిత్యమో తెలియదు కానీ ఏకంగా ఎర్త్ డ్యామే కొట్టుకుపోయింది. ఈ వరుస ఘటనల నేపథ్యంలో మరోసారి ఈ ప్రాజెక్టుకు ఇలాంటి ఉపద్రవం రాకూడదనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం నిపుణుల కమిటీని నియమించింది. నిపుణుల కమిటీలో పోలవరం చీఫ్ ఇంజనీర్ (కేంద్ర జలసంఘం నిపుణుడు) రమేష్ కుమార్, విశ్రాంత హైడ్రోమెకానికల్ ఎక్స్‌పర్ట్ కే.సత్యనారాయణ, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా విశ్రాంత డైరెక్టర్ జనరల్ >>2



# బంగాళాఖాతంలో అల్పపీడనం మరో ఐదు రోజులు భారీవర్షాలు

**విజయవాడ,జూలై20,ప్రభాతవార్తప్రతినిధి:** బంగాళాఖాతంలో ఈ నెల 24వ తేదీ నాటికి అల్పపీడనం ఏర్పడనున్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో రాబోయే ఐదు రోజులు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. గంటకు 40 నుంచి 50 కిలో మీటర్లవేగంతో ఈదురుగాలులు వీయొచ్చని పేర్కొంది. సముద్రం అలజడిగా మారుతుందనే అంచనాల నేపథ్యంలో సోమవారం నుంచి బుధవారం వరకు మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరించారు. పిడుగులతో కూడిన వర్షాల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్‌జైన్ సూచించారు. రాష్ట్రంలో ఆదివారం, సోమవారం పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న గోడలు, భవనాలు దగ్గర నిల్చోవద్దని హెచ్చరించారు. నేడు అల్లూరి సీతారామరాజు, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, బాపట్ల, గుంటూరు, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో >>2

# విజయవాడ ఎయిర్‌పోర్టువద్ద ఎయిర్ ఇండియా విమానం చక్కర్లు

**విజయవాడ, జూలై 20, ప్రభాతవార్తప్రతినిధి:** ఉమ్మడి కృష్ణాజిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గన్నవరంలో దాదాపు రెండు గంటలుగా ఎడతెరిపి లేకుండా కుండపోతగా వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో స్థానిక వాతావరణం పూర్తిగా మారిపోయింది. దాంతో గన్నవరం ఎయిర్‌పోర్ట్‌లో హైదరాబాద్‌నుంచివచ్చిన ఇండిగోవిమానం ల్యాండ్ కావాల్సి ఉంది. కానీ వాతావరణం అనుకూ లించకపోవడంతో.. సదరు విమానం గాలిలో చక్కర్లు కొట్టింది. ఢిల్లీ నుంచి గన్నవరంలో దిగాల్సిన ఎయిర్ ఇండియా విమానం సైతం తిరువూరు, విస్సన్నపేట పరిసర ప్రాంతాల్లో గాలిలో చక్కర్లు కొట్టింది. దీంతో విమానంలోని ప్రయాణికులు తీవ్ర భయాందోళన చెందారు. వాతావరణం అనుకూలించకుంటే.. సదరు విమానాలను విశాఖ లేదా రాజమండ్రిలో ల్యాండ్ అయ్యేలా పౌర విమానయాన సంస్థ అధికారులు చర్యలు చేపట్టారు. అక్కడి వాతావరణ పరిస్థితులు ఎలా ఉన్నాయనే అంశంపై వారు ఆరా తీశారు. ఈ రెండు ఎయిర్ పోర్టుల్లో ఎక్కడ వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నా.. అక్కడ వీటిని లాండింగ్ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టినట్లు తెలుస్తుంది. తిరుపతి సమీపంలోని రేణిగుంట విమానాశ్రయం నుంచి ఆదివారం ఉదయం హైదరాబాద్ బయలుదేరి వెళ్లాల్సిన ఇండిగో విమాన సర్వీసును సాంకేతిక కారణాలతో రద్దు చేసినట్లు ఆ సంస్థ ప్రకటించింది. ఈ సర్వీసు సాయంత్రం నడుపుతామని ప్రయాణికులకు హామీ ఇచ్చింది. ఆదివారం రాత్రి 7.40 గంటలకు ఇండిగో విమాన సర్వీసును సంస్థ ఏర్పాటు చేసింది. అయితే ఈ విమానం టేకాఫ్ అయిన వెంటనే వాతావరణ పరిస్థితులు ఏ మాత్రం అనుకూలించక పోవడంతో.. విమానాన్ని రేణిగుంట ఎయిర్ పోర్ట్‌లో ల్యాండ్ చేశారు. దీంతో ఇండిగో సంస్థపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# యాక్సిస్ బ్యాంక్‌లో భారీ స్కామ్

## 56 మంది పేర్లతో రూ. 10.6 కోట్లు దోపిడి

**ముత్తుకూరు (నెల్లూరు), జూలై 20, ప్రభాతవార్త:** ముత్తుకూరులో 10కోట్ల 60లక్షల రూపాయలు యాక్సిస్ బ్యాంకులో భారీ స్కామ్ వెలుగులోకి వచ్చింది. ఈ కుంభకోణంలో కేటుగాళ్లు కీలక పాత్ర వహించారు. అమాయక గిరిజనులకు లోన్లు ఇప్పిస్తామని సుమారుగా 56 మంది పేర్లతో రుణాలు తీసుకుని కాజేసారు. ఫేక్ కంపెనీ ఏర్పాటు చేసి అందులో గిరిజనులను ఉద్యోగులుగా చూపించి వారి పేరు మీద అప్లై చేయించి చేసినవ్యక్తులు ఫేక్ కంపెనీలో ఆరు నెలలు పాటు గిరిజనులకు >>2

# అన్యమత ఉద్యోగులపై ఏవీ చర్యలు?

## భగ్గుమంటున్న టిటిడి ఉద్యోగులు

## అన్యమతస్తులు వారి ప్రార్థనా మందిరాలకు టిటిడి వాహనాల వినియోగం



**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** నుదుటిన నామం పెట్టుకోరు...ఓమ్‌నమో వేంకటేశాయ అనే నామం పలకరు....దేవుని లడ్డూప్రసాదాన్ని కూడా తినరు.. ప్రసాదాలను తీసుకోరు.. నెలకు వేలల్లో, లక్షలాది రూపాయలు దేవుని సొమ్మును జీతంగా తీసుకుంటూ ఇతర మత సాంప్రదాయంతో దేవుని ప్రార్థనలు చేసుకొంటున్న అన్యమత ఉద్యోగులపై చర్యలు తీసుకోవడంలో తిరుమల తిరుపతి దేవస్థానం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అన్యమత ఉద్యోగులు పేరుకే హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంలో కొనసాగుతూ ఆ మత దేవుడిని కొలుస్తుండటం ఎంతవరకు మంచిదనే ప్రశ్నలు టిటిడి ఉద్యోగుల్లోనే వినిపిస్తున్నాయి.

గత రెండు దశాబ్దాల కాలంలో అన్యమత ఉద్యోగులు యధేచ్ఛగా ప్రతి ఆదివారం ఏకంగా టిటిడి వాహనాల్లోనే ఆ మతానికి సంబంధించిన ప్రార్థనా మందిరాలకు వెళ్లిన సందర్భాలు అనేకం ఉన్నాయనేది ఇప్పుడు గుప్పుమంటోంది. ఇప్పటికే టిటిడిలో 6,700మంది శాశ్వత ఉద్యోగుల్లో 300మంది వరకు అన్యమత ఉద్యోగులు ఉన్నారనేది టిటిడి వర్గాల సమాచారం. వారిలో ప్రాధాన్యత పోస్టుల్లో ఉన్న 30మంది వరకు గుర్తించినా కేవలం ఐదుగురిపైనే వేటువేయడం ఇప్పుడు కలవరపరుస్తోంది. ఇంకా టిటిడిలో వేంకటేశ్వరస్వామి చెంత కొలువుల్లో కొనసాగుతూ అన్యమత ఆచరిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటే తప్ప మతమార్పిడిలను అరికట్టలేరనే వాదనలు వినిపిస్తున్నాయి. రెండు వారాల క్రిందట టిటిడి మార్కెటింగ్ విభాగంలో వేలం సెక్టార్‌లో విధులు నిర్వహించిన అసిస్టెంట్ కార్యనిర్వహణాధికారి (ఎఇఒ) రాజశేఖర్‌బాబు అన్యమత ప్రార్థనలకు ఆ ప్రార్థనామందిరానికి వెళుతున్నాడనే ఆధారాలను ఫోటోలతో సహా టిటిడి విజిలెన్స్ సేకరించింది. దీంతో ఆయనపై సస్పెన్షన్ వేటువేశారు. తాజాగా శనివారం టిటిడిలో క్వాలిటీ కంట్రోల్ విభాగం డిప్యూటీ ఇఒ >>2

21-7pg2exHMNWJQE.qxd:21-7pg2exHMNWJQE.qxd 1/1/02 7:04 AM Page 1





ఆదివారం తరువనంతపురం రాజ్‌భవన్‌కు వచ్చిన సిఎం విజయ్‌ను సత్కరిస్తున్న గవర్నర్

# కేరళలో రోబో టీచర్

**తిరువనంతపురం,జూలై 20:** ఆధునిక టెక్నాలజీలో కేరళ మరింత ముందడుగేసింది. కేరళ విద్యాశాఖ ఈ విభాగంలో అగ్రగామిగా నిలిచింది. దేశంలో మొట్టమొదటి కృత్రిమ మేథ అంటే ఎఐ టీచర్ 'ఐరిస్'ను స్కూలు తరగతుల్లోప్రవేశపెట్టింది. ఎఐ తొలిటీచర్‌ను విజయవంతంగా ప్రవేశపెట్టిన తొలిరాష్ట్రంగా కేరళ రికార్డునమోదుచేసింది. మేకర్‌ల్యాబ్స్ ఎడ్యుటెక్‌ప్రైవేట్ లిమిటెడ్ ఈ ఎఐ రోబో ఐరిస్‌ను రూపొందించింది. విద్యారంగంలో కృత్రిమమేధస్సును ప్రవేశపెట్టడమే ఈ రోబో క్లాసుల లక్ష్యమని విద్యాశాఖప్రకటించింది. తిరువనంతపురంలోని కెటిసిటి మాధ్యమిక పాఠశాలలో ఈ ఐరిస్ రోబోను ఆవిష్కరించారు. విద్యార్థులకు అభ్యాసన శక్తి మరింత పెంపొందించేదిశగా ఈ ఎఐ రోబో పనిచేస్తుందని ఉపాధ్యాయులు చెప్పారు. ఐరిస్‌తో తాము విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు తెచ్చామని మేకర్స్ ల్యాబక్ విడియో విడుదలచేసింది. ఐరిస్ రోబో ప్రతి ఒక్క విద్యార్థితో కరచాలనం చేయడంనుంచి వారు అడిగిన సందేహాలను కూడా నివృత్తిచేసింది.

# ఆగస్టునుంచి కొత్త పట్టా పుస్తకాలు

>> ఆగస్టు నాటికి అందచేయండి. ముద్రణ పూర్తి చేసి 21.86 లక్షల మందికి తొలివిడతగా పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వండి. ప్రతి పట్టా దారు పాసు పుస్తకంపై క్యూఆర్ కోడ్ తో పాటు....ఆధార్ కార్డు ఆధారంగా ప్రతి భూ యజమాని తమ భూమి వివరాలు వ్యక్తి గతంగా తెలుసుకునే వెసులుబాటు కల్పించాలి. ఆధార్ కార్డుతో సమగ్ర భూ వివరాలు రావాలి. తమ భూములు ఎక్కడెక్కడ ఉన్నాయో తెలియాలి. అదే విధంగా ప్రభుత్వం తెచ్చిన కొత్త జీవోలు, పాలసీలకు అనుసరించి....అన్ని ఉత్తర్వులతో కలిపి కొత్త రెవెన్యూ మాన్యువల్ ఆగస్టు నాటికి తేవాలి. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ధరఖాస్తుల పరిష్కారంపై ప్రైవేటు టీంతో ఆడిటింగ్ చేయాలి. అప్పుడు సమస్యల పరిష్కారంపై ఒక అంచనా వస్తుంది. అలాగే ప్రజలు అనధికారికంగా ఉంటున్న అభ్యంతరం లేని ప్రాంతాల్లో రెగ్యులరైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలి. ప్రతి నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టాలి. డిసెంబర్ లోపు ఈ తరహా అన్ని ధరఖాస్తులు పరిశీలించి రెగ్యులరైజేషన్ పూర్తి చేయాలి. వాట్సాప్ గవర్నెన్స్‌లో 56 సర్వీసులు ఉన్నాయి. వాడుకలో లేని సర్వీసులను తొలగించాలి. మన మిత్రలో 9 లక్షల మంది సర్వీసులు కోసం రిక్వెస్టులు పెట్టారు. అయితే సర్వీసులు పొందిన వారు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారా లేదా అనేది కూడా చూడాలి. వారస త్వంగా వచ్చే భూములును పంచుకునే విషయంలో రూ.100 చెల్లించి సక్సెషన్ చేసుకోవచ్చు. ఆ భూమి విలువ రూ. 10 లక్షల విలువైన ల్యాండ్ అయితే రూ. 100...ఆ పైన విలువైన ల్యాండ్ అయితే రూ. 1000 చెల్లించి సక్సెషన్ చేసుకోవచ్చు. ఈ ప్రక్రియ పూర్తి చేయడానికి గ్రామ వార్డు సిబ్బందికి అవసరమైన అధికారాలు ఇవ్వాలి. అలాగే రీసర్వే 2.0కు ఆర్థిక సమస్య రాకుండా చూడండి. కేంద్రం ఇచ్చే నిధులను రీ సర్వేకే ఇవ్వండి. డిసెంబర్ 2027 రాష్ట్రంలో ప్రతి గ్రామంలో రీ సర్వే 100 శాతం పూర్తి చేయాలి. రీ సర్వే పూర్తి అయ్యేవరకు గ్రామ వార్డు సచివాలయాల్లో సర్వేయర్లను యథావిధిగా కొనసాగించాలి. ప్రతి మూడు నెలలకు దీనిపై సమీక్ష చేస్తాము. అదే విధంగా నాలా చట్టం రద్దుకు అవసరమైన కసరత్తు పూర్తి చేసి క్యాబినెట్ ముందుకు తీసుకురావాలి" అని సిఎం తెలిపారు.

**ప్రపంచం గుర్తించే స్థాయిలో రాజధాని అమరావతి నగరం**

అమరావతి నిర్మాణం జరగాలి, పోలవరం కట్టాలి. సూపర్6 కూడా అమలు చేయాలి. కష్టమైనా ఇష్టంగా పనిచేస్తున్నా అన్ని పరిష్కరిస్తాం. ఇక్కడ ఐదుగురు మార్గదర్శులు, 41 బంగారు కుటుంబాలు ఉన్నాయి. ఇంటికి కావాల్సిన అవసరాలు తీర్చే బాధ్యత నాది. గ్రామానికి కావాల్సిన అవసరాలు తీర్చే బాధ్యత నాది. అట్టడుగున ఉన్నవారికి చేయూత అందించే బాధ్యత మార్గదర్శులదే. ఒక నాయకుడు దూరదృష్టితో ఆలోచిస్తే మంచి జరుగుతుంది. ఒక నేత విధ్వంసం వైపు ఆలోచిస్తే చెడు జరుగుతుంది. మంచి చేసే నాయకుడు ఉంటే ఆ రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. డ్రెయినేజీ సమస్య తీర్చేందుకు ఎన్ని నిధులు కావాలన్నా ఇస్తా. భూగర్భ డ్రెయినేజీ నిర్మాణాలకు ఏర్పాట్లు చేస్తాం. అమరావతిని అద్భుతనగరం తీర్చిదిద్దుతున్నాం, ప్రపంచదృష్టి మన రాజధానిపైనే ఉంటుందన్నారు.



నిపుణుల కమిటీ సిఫార్సు చేసిన జియో ఫిజికల్ ఇన్వెస్టిగేషన్ విధానం ఇదే

# రాక్‌ఫిల్! ఎర్త్‌డ్యామ్?

>> ఎం.రాజుతో పాటు సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ చీఫ్ ఇంజనీర్ విజయభాస్కర్, కడప జిల్లా జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ శ్రీరామ చంద్రమూర్తి ఈనెల 13న అన్నమయ్య ప్రాజెక్టును క్షున్నంగా పరిశీలించారు. ఇకపోతే అన్నమయ్య ప్రాజెక్టు నిర్మాణం సంధర్బంగా నదీ గర్భంలో సొరంగాలు(క్యావిటీస్) బయటపడ్డాయి. చెయ్యేరు నదిలో ఎడమ వైపు కొండ ప్రక్కనే రెండు గేట్లను కుడివైపు కొండ ప్రక్కనే మూడు గేట్లను నిర్మించాలని అప్పటికే సిద్ధం అయిన డిజైన్లను పరిశీలించారు. అప్పుడే బయటపడిన సొరంగాలతో ఈ ప్రతిపాదనను ఉపసంహరించుకున్నారు. ఎడమవైపునే 5గేట్లను ఏర్పాటుచేసి స్పిల్‌వే నిర్మించారు. 476మీటర్ల పొడవునా కుడివైపు కొండ వరకు ఎర్త్ డ్యాం నిర్మించారు. ఎర్త్ డ్యాం నిర్మాణానికి ముందే నీరు లీకేజ్ కాకుండా సొరంగాలలోకి డ్రిల్లింగ్, గ్రౌటింగ్ పద్ధతిలో కొన్ని వందల టన్నుల లిక్విడ్ సీమెంట్‌ను చొప్పించారు. డయాఫ్రం వాల్‌ను నిర్మించారు. ఎర్త్ డ్యాంలో గ్యాలరీ నిర్మాణం తర్వాత కేంద్ర జలసంఘం ఆదేశించిన మేరకు అబ్జర్వేషన్ పీరియడ్‌లో ఎక్కడ నీరు లీకేజీ కాలేదు. దీంతో నదీ గర్భంలో చేసిన డ్రిల్లింగ్, గ్రౌటింగ్ సక్సెస్ అయినట్లు భావించి క్రమేణా నీటి నిల్వను చేపట్టారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం మేరకు పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేసిన తర్వాత కూడ ఎలాంటి లీకేజీ కనిపించలేదు. దీంతో ఇంజనీర్లు ఊపిరి పీల్చుకున్నారు. అలాంటి ప్రాజెక్టుకు ఎర్త్ డ్యాం కొట్టుకుపోయి గండం వచ్చి పడింది. అసలు ప్రాజెక్టు పునర్నిర్మించాలంటే మరళా ఎర్త్ డ్యాం(మట్టి కట్ట) నిర్మించాలా లేక రాక్‌ఫిల్ డ్యాం కట్టాలా అదీ కాదంటే పూర్తిగా కాంక్రీట్ డ్యాం కట్టాలా అన్నది ఇంజనీర్ల ముందున్న ప్రత్నామ్యాయాలు. కాంక్రీట్ డ్యాం నిర్మించేందుకే గత ఏడాది ఇంజనీర్లు అంచనాలు రూపొందించి 787కోట్ల వ్యయంతో టెండర్లు పూర్తి చేశారు. ప్రాజెక్టు ఇంజనీర్లు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టు పునర్నిర్మాణానికి 2డిజైన్లను సిద్ధం చేసి పంపింది. ఇక డిజైన్ ప్రకారం ప్రస్తుతం ఉన్న 5గేట్లకు తోడు మరో 16గేట్లు ఏర్పాటుచేసి కాంక్రీట్ డ్యాం నిర్మించాలని ప్రతిపాదనలు పంపారు. మరోక డిజైన్ ప్రకారం రాక్‌ఫిల్ డ్యాం నిర్మించి కుడివైపున ఉన్న కొండ ప్రక్కన అవసరం అయిన గేట్లను ఏర్పాటుచేయాలని డిజైన్ సిద్ధం చేశారు. తాజాగా నిపుణుల కమిటీ పరిశీలన తర్వాత ప్రాజెక్టు పునర్నిర్మాణానికి ఏ నిర్ణయం తీసుకోవాలన్నా నదీ గర్భంలో ఉన్న భౌతిక పరిస్థితిని తెలుసుకోవాల్సి ఉంది. నదీ గర్భంలో డయా ఫ్రం వాల్‌ను 45మీటర్ల ఎత్తున నిర్మించి ఉన్నారు. ఈ కట్టడాల భౌతిక పరిస్థితి తెలుసుకునేందుకే జియో ఫిజికల్ ఇన్వెస్టిగేషన్‌ను చేయనున్నారు. ఇకపోతే కాంక్రీట్ డ్యాం నిర్మాణం ఇసుక సుమారు 40మీటర్ల లోతు వరకు నదీ గర్భంలో ఉన్న నేపథ్యంలో నిపుణులు అంగీకరించే అవకాశాలు తక్కువే. ఇసుక ఎక్కువగా ఉన్న ఏ నదిలో అయినా ఎర్త్ డ్యాంను లేదా రాక్ ఫిల్ డ్యాంనే నిర్మించేందుకు సిఫార్స్ చేస్తారు. ఈ పరిస్థితిని పరిశీలిస్తే చెయ్యేరు నదిలో ఇసుక 40మీటర్ల లోతు వరకు నిక్షిప్తమై ఉండటం, సొరంగాలు కూడ ఉన్నందువల్ల కాంక్రీట్ డ్యాం నిర్మాణం అనుమానమే. ఎందుకంటే ఇప్పటికే ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభం సమయంలో కుడి వైపు 3గేట్లు నిర్మించి, ఎడమవైపు 2గేట్లు ఏర్పాటుచేసి మధ్యలో ఎర్త్ డ్యాం నిర్మించాలనే ప్రతిపాదన ఉపసంహరించుకున్న నేపథ్యంలో అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణం కోసం ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ ప్రభుత్వానికి ఎలాంటి సిఫార్సులు చేస్తుందో వేచి చూడాల్సిందే.

# రాజమండ్రి జైలుకు మిథున్ రెడ్డి

>> స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని కోర్టుకు నివేదించారు. ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్‌పై గ్రౌండ్ ఆఫ్ అరెస్ట్‌లో సిట్ కీలక అంశాలు పేర్కొంది. మద్యం కేసులో మిథున్‌రెడ్డి నేరం చేసినట్టు ప్రాథమికంగా గుర్తించామని, మద్యం కేసు మొదలు నుంచి అమలు వరకు మిథున్‌రెడ్డి ప్రధాన కుట్రదారు అని తెలిపింది. సత్యప్రసాద్‌కు నాన్ కేడర్ ఐఏఎస్‌గా పదోన్నతి ఇస్తామని కుట్ర అమలు చేయించారని, మద్యం కేసులో ప్రభుత్వ ఉద్యోగి సత్యప్రసాద్ ఏ3గా ఉన్నట్లు కోర్టు దృష్టికి తీసుకొచ్చిట్లు సిట్ వెల్లడించింది. మద్యం స్కామ్ అమలు కోసమే సత్యప్రసాద్‌ను ప్రత్యేక అధికారిగా నియమించారన్న సిట్, ఏ2 వాసు దేవరెడ్డి, ఏ3 సత్యప్రసాద్‌లను మిథున్‌రెడ్డి నేరుగా ప్రభావితం చేసినట్లు సిట్ పేర్కొంది. మిథున్‌రెడ్డి అరెస్టు విషయంలో స్పీకర్‌కు సమాచారం ఇవ్వలేదన్నారు. మిథున్ రెడ్డి వై కేటగిరీ భద్రత కలిగిన ఎంపీ అని, రిమాండ్ విధిస్తే భద్రత దృష్ట్యా నెల్లూరు జైలులో ప్రత్యేక బ్యారక్ కోరారు. గుంటూరు సబ్ జైలుకు రిమాండ్ ఇవ్వాలని సిట్ న్యాయవాదులు కోరారు. పోలీస్ కస్టడీకి తీసుకోవాల్సి ఉన్నందున సబ్ జైలులో రిమాండ్ ఇవ్వాలంటూ సిట్ లాయర్లు కోర్టుకు తెలిపారు.

**అంతకుముందు వైఎస్సార్సీ ఎంపీ మిథున్**

రెడ్డికి విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించారు. రక్తపోటు, షుగర్, ఇసిజి వంటి సాధారణ వైద్యపరీక్షలను చేపట్టారు. సుమారు అరగంటపాటు వైద్యపరీక్షలు నిర్వహించిన అనంతరం రిపోర్టులు వచ్చిన తర్వాత మిథున్ రెడ్డిని కోర్టుకు తరలించారు. మిథున్ రెడ్డిని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చే క్రమంలో పోలీసులు గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు. క్యాజువాల్టీ వార్డులోకి ఎవరినీ అనుమతించకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. వైద్యపరీక్షలు అనంతరం ఎంపీ మిథున్ రెడ్డిని న్యాయస్థానానికి తరలించారు.మద్యం ముడుపుల కేసులో ఏ4గా మిథున్ రెడ్డి అరెస్టు కాగా, ఈ కేసులో ఇప్పటివరకు అరెస్టయిన వారిలో 12వ నిందితుడు. మద్యం పాలసీ రూపకల్పన, మద్యం ముడుపుల నెట్ వర్క్‌ను అమలు చేయడంలో మిథున్ రెడ్డిది కీలకపాత్ర అని సిట్ భావిస్తోంది. పేరున్న కంపెనీల బ్రాండ్లను తరిమేసి సొంత డిస్టిలరీలతో నాసిరకం బ్రాండ్ల తయారీ ద్వారా మిథున్ రెడ్డి లబ్ధి పొందారనేది మరో ఆరోపణ. మొత్తం మీద ఈ కేసులో ఎంపీ స్థాయి వ్యక్తికి కోర్టు రిమాండ్ విధించడంతో, మద్యం ముడుపుల కేసు దర్యాప్తు మరింత ఊపందుకునే అవకాశం ఉంది. మద్యం కుంభకోణం ప్రధాన కుట్రదారుల్లో ఒకరు, ఈ కేసులో కీలక నిందితుడైన పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని సిట్ అధికారులు శనివారం రాత్రి 8.30 గంటల సమయంలో అరెస్టు చేసారు.మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 8 వరకు గంటల వరకూ సుదీర్ఘంగా ప్రశ్నించిన దర్యాప్తు అధికారులు, విచారణకు ఆయన ఏమాత్రం సహకరించకపోవటంతో నిర్బంధం లోకి తీసుకున్నారు. ఈ మేరకు మిథున్‌రెడ్డి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. జగన్ సర్కార్‌హయాంలో నూతన మద్యంవిధానం ముసుగులో దోపిడీకి కుట్ర, అమలుకు ఏర్పాట్లు, వైఎస్సార్సీ ముఖ్యనేతలకు దిశానిర్దేశం చేయటంలో పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిదే"మాస్టర్ మైండ్" అని సిట్ దర్యాప్తులో గుర్తించింది.

## ప్రపంచంలోనే అతిపెద్ద డ్యామ్‌చేపడుతున్న చైనా

### రూ.14 లక్షలకోట్లతో టిబెట్‌లోని బ్రహ్మపుత్రనదిపై నిర్మాణం

**నైంగ్చీ(టిబెట్),జూలై 20:** ప్రపంచంలోనే అత్యంత భారీ జలవిద్యుత్తు ప్రాజెక్టు నిర్మాణాన్ని చైనా ప్రారంభించింది. టిబెట్‌లోని బ్రహ్మపుత్ర నదిపై చేపడుతోన్న ఈ వివాదాస్పద ప్రాజెక్టు కోసం చైనా సుమారుగా 14 లక్షల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టనున్నట్లు అంచనా. ఈ ప్రాజెక్టుపై భారత్ బంగ్లాదేశ్‌లు ఆందోళన వ్యక్తం చేస్తున్నప్పటికీ చైనా మాత్రం మొండిగా ముందుకు పోతున్నట్లు తెలుస్తోంది. చైనా యాజియాంగ్ గ్రూపు పేరుతో కొత్తగా ఓ సంస్థను ఏర్పాటుచేసి ఈ జలవిద్యుత్ ప్రాజెక్టు బాధ్యతలు అప్పజెప్పినట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టులో మొత్తం ఐదు డ్యామ్‌లు ఉండనున్నాయి.

## భారీ స్కామ్

>> జీతాలు ఇస్తున్నట్లు స్టేట్మెంట్ క్రియేట్ చేసి లోన్లు తీసుకున్నారు. అయితే ఈ స్కామ్ 2022 - 24 మధ్య జరిగింది. గిరిజనులను యాక్సిస్ బ్యాక్ యాజమాన్యం లోను కట్టమని నోటీసులు జారీ చేసింది. 2024లో నలుగురి పేరు మీద యాక్సిస్ బ్యాంక్ మేనేజర్ ఫిర్యాదు చేసారు. ఈ స్కామ్‌లో బ్యాంకు ఉద్యోగుల పాత్ర ఉన్నట్లు వ్యక్తమౌతున్నాయి.

# కృష్ణమ్మ పరవళ్లు

>> నీటి సామర్థ్యం 202.9673 టీఎంసీలుగా నమోదయి ఉంది. విద్యుత్ ఉత్పత్తికి కుడి ఎడమల నుంచి 67,488 క్యూసెక్కుల నీటిని సాగరకు విడుదల చేస్తున్నారు. ఏపీ జల విద్యుత్ కోసం32,173 క్యూసెక్కుల నీటిని వాడుతుండగా, తెలంగాణ ప్రాంతం నుంచి 35,315 క్యూసెక్కుల నీటిని జల విద్యుత్ కోసం వినియోగిస్తున్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి కృష్ణానది వరద ఉద్ధృతి కొనసాగుతున్న నేపథ్యంలో ఎన్ఎస్‌పి అధికారులు ఆదివారం ఉదయం ఎడమ కాలువకు నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం సాగర్ జలాశయం నీటిమట్టం 565 అడుగులకు చేరుకోవడంతో అధికారులు తాగు నీటి అవసరాల కోసం 1,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. క్రమంగా 2 వేల క్యూసెక్కులకు పెంచుతూ నీటి విడుదల కొనసాగించనున్నారు. ఎడమ కాలువ కింద ఆయకట్టు రైతులు నీటి విడుదల కోసం చాలాకాలంగా ఎదురు చూస్తున్నారు. తాగునీటి కోసమే కాకుండా పంటలకు సాగు నీటిని విడుదల చేయాలని ఆయకట్టు రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# అన్యమత ఉద్యోగులపై ఏవీ చర్యలు?

>> బి.ఎలిజర్,బర్డ్ ఆస్పత్రి స్టాఫ్ నర్స్ ఎస్.రోషి,గ్రేడ్ 1 ఫార్మాసిస్ట్ ఎం.ప్రేమావతి, ఎస్వీ ఆయుర్వేద ఫార్మసీకి చెందిన డాక్టర్ జి. అసుంతలు అన్యమతం ఆచరించడం, ఆ ప్రార్థనామందిరాలకు వెళ్లడంతో టిటిడి సస్పెండ్ చేసింది. ఇలా ఇంకా కొనసాగుతున్న అన్యమత ఉద్యోగులను సాగనంపాలని గతంలోనే ప్రస్తుత టిటిడి బోర్డు నిర్ణయం తీసుకున్నా అమలుచేయడంలో వెనుకడుగువేస్తోందనేది ప్రధాన విమర్శ. గత రెండు దశాబ్ధాలుగా టిటిడిలో అన్యమత ఉద్యోగులు యధేచ్చగా వారివారి మతాలను ఆచరిస్తూ ప్రతి ఆదివారం ఆ ప్రార్థనామందిరాలకు వెళుతున్నారనేది ప్రస్ఫుటమైంది. కొందరు అధికారులు ఏకంగా టిటిడి వాహనాల్లోనే ప్రతి ఆదివారం ఆ ప్రార్థనామందిరానికి వెళ్లిన సందర్భాలు అనేకం ఉన్నాయి. దీనిపై అప్పట్లోనే ఉద్యోగులు పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తం చేసినా పట్టించుకున్న వారే లేకపోయారు. ఆ తరువాత అప్పటి బోర్డుకూడా అన్యమత ఉద్యోగులకు వంతపాడుతూ వారిపై చర్యలు తీసుకోలేకపోయింది. టిటిడిలో ప్రస్తుతం కొనసాగుతున్న పాలకమండలి తొలిరోజే తిరుమల పవిత్రతకు ప్రాధాన్యతనిచ్చి,శ్రీవారి ఆలయంలో హిందూ ఉద్యోగులే పనిచేయాలని కూడా స్పష్టం చేశారు. అయినా బోర్డు కొలువుదీరి ఏడాది కావస్తున్నా తీసుకున్న చర్యలు మాత్రం నామమాత్రమే. గత టిటిడి బోర్డు సమావేశాల్లోనూ అన్యమత ఉద్యోగులపై చర్యలుతీసుకునే దిశగా ప్రభుత్వ సలహాలు తీసుకున్నారు. అన్యమత ఉద్యోగులు స్వచ్ఛంద పదవీవిరమణ చేయడంగానీ, ఇతర ప్రభుత్వ శాఖలకు బదిలీపై వెళ్లడంగానీ నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. అయినా ఇప్పటివరకు టిటిడిలో కీలకపోస్టుల్లో ఉన్న అధికారులు కొందరు, ఉద్యోగులు సిబ్బంది కూడా టిటిడిని వదలివెళ్లడానికి విముఖత చూపుతున్నారనేది పలువురు ఉద్యోగులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో స్వచ్ఛందంగా కొందరు ప్రజలు, శ్రీవారిభక్తులు అన్యమత ఉద్యోగులపై ఆధారాలతో టిటిడికి ఉప్పందిస్తుండటంతో తప్పనిసరి పరిస్థితుల్లో చర్యలు తీసుకుంటున్నారు..

**అన్యమత ఉద్యోగుల సెర్చ్ ఏదీ!?:**

హిందూ ధార్మిక సంస్థ టిటిడిలో తిరుమల శ్రీవారి ఆలయంతోబాటు పలుచోట్ల హిందూ ఉద్యోగులు మాత్రమే ఉండాలని, ఇతర మతస్థులు ఉండటానికి వీలులేదని స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏడాది క్రిందటే గత బ్రహ్మోత్సవాల సమయంలో స్పష్టమైన ప్రకటన చేశారు. అయినా టిటిడి పాలకమండలిగానీ, అధికారులుగానీ ధైర్యంగా ఆ దిశగా తీసుకున్న చర్యలు మాత్రం లేవనేది ఉద్యోగవర్గాల్లో అసహనం. అన్యమతస్థులను గుర్తించి వారిని ఇతర శాఖలకు బదిలీ చేయడమో.లేక విఆర్ఎస్ ఇవ్వడమా అనేది చూడాలని సిఎం ఆదేశించినా టిటిడి అధికారులు ఆచరణలో పెట్టలేదు. ఇప్పటికీ అన్యమతస్థులుగా ముద్రపడిన అధికారులు, ఉద్యోగులు యధాతథంగా ఆయా కుర్చీల్లోనే కొనసాగుతున్నారని చెబుతున్నారు.ముఖ్యమంత్రి సైతం గతంలోనే స్పష్టమైన విషయాలు వెల్లడించారు. క్రైస్తవులు, ముస్లింలు ఆయా సంస్థల్లో,ఆయా మతాలకు సంబంధించిన కార్యాలయాల్లో వారే పనిచేస్తున్నారని, ఇతర మతస్థులను అనుమతించరనే విషయం తెలియజేశారు. అన్యమతస్థులు వివిధ కేడర్‌లలో ఇంకా పనిచేస్తుండటం, వారి సేవలను టిటిడి వినియోగించుకొంటుండటం కొసమెరుపు. దీనిపై గతంలోనే తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేసిన టిటిడి పాలకమండలి రాష్ట్ర దేవాదాయశాఖ చట్టం 1060, 24-10-1989 ప్రకారం హిందుమత సాంప్రదాయాన్ని అనుసరిస్తామని ప్రమాణం చేసి టిటిడిలో ఉద్యోగం పొందిన తరువాత కూడా నిబంధనలకు విరుద్ధంగా, దేవుని పవిత్రతను దెబ్బతీస్తున్న కొందరు ఉద్యోగులను సాగనంపడంలో మీనమేషాలు వేస్తోంది. టిటిడి పవిత్రతకు భంగం కలిగిస్తున్న వారిని గుర్తించి 69మందితో ఓ జాబితాను కూడా రూపొందించింది.

## వారం - వర్జ్యం

21-07-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం
ఏకాదశి ఉ.9.39
రోహిణి రా.9.07
వర్జ్యం : రా.2.19-3.49
దు.ము.12.40-1.32, 2)ము.3.16-4.08
శుభసమయం: ఉ.9.15-10.00, సా.6.45-7.30
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

- **మేషం :** సన్నిహితుల సాయంతో పనులు పూర్తి చేస్తారు. ఉద్యోగ, వివాహ యత్నాలు మందకొడిగా సాగుతాయి.
- **వృషభం :** వ్యవహారాలలో ఆటంకాలు చికాకు పరుస్తాయి. ఎంత కష్టించినా ఫలితం ఉండదు.
- **మిథునం:** సంతానం నుండి కీలక సమాచారం అందుకొంటారు. ఆర్థిక లావాదేవీలు సంతృప్తికరంగా వుంటుంది.
- **కర్కాటకం :** గృహనిర్మాణ ఆలోచనలు కలిసి రావు. తొందరపాటు నిర్ణయాలు వద్దు.
- **సింహం:** కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు అనుకోని సమస్యలు ఎదురైనా అధిగమించి ముందుకు సాగుతారు.
- **కన్య :** నిరుద్యోగులకు అనుకోని అవకాశాలు లభిస్తాయి. అనుకోని అతిథుల నుండి శుభవార్తలు అందుకొంటారు.
- **తుల :** ఇతరుల విషయాలలో జోక్యం తగదు. పనులలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి.
- **వృశ్చికం:** ప్రయాణాలలో నూతన మిత్రుల పరిచయాలు. సంతానం నాకు సాంకేతికావకాశాలు పొందుతారు.
- **ధనుస్సు:** ఆరోగ్యం పట్ల జాగ్రత్త అవసరం. కళా, రాజకీయరంగాలలో వారికి అనుకోని అవకాశాలు పొందుతారు.
- **మకరం:** స్థిరాస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. వృత్తి, వ్యాపారాలు విస్తరిస్తారు.
- **కుంభం:** ఇంటర్వ్యూలు, పోటీపరీక్షలలో పాల్గొంటారు. నూతన పెట్టుబడుల విషయంలో తొందరపాటు వద్దు.
- **మీనం :** వాహనాల విషయాలలో మెలకువ ఉండండి. ఇంటా బయటా ఒత్తిడులు ఎదురైనా చికాకులు పెడతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోటి, హైదరాబాద్

# మేటి ఐటి కేంద్రగా విశాఖ

## రాష్ట్రంలోని ద్వితీయశ్రేణి నగరాల్లోనూ ఐటి హాబ్‌లు

**గన్నవరం, జూలై 20, ప్రభాతవార్త :** ప్రపంచస్థాయి ఐటి కేంద్రంగా విశాఖపట్నంను అభివృద్ధి చేస్తామని ఈదిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర ఐటిశాఖా మంత్రి నారా లోకేష్ తెలిపారు. కృష్ణాజిల్లా గన్నవరం ఐటిపార్క్ మేధాటవర్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మెడికల్ కోడింగ్ కార్యకలాపాలు నిర్వహించే ఈక్లాట్ ఐటి సంస్థను ప్రభుత్వ విప్,గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్‌తో కలసి ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సభలో లోకేష్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో విశాఖపట్నం ఐటికి చిరునామాగా మారతుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేసారు. రాష్ట్రంలోని ప్రధాన నగరాలతోపాటు ద్వితీయశ్రేణి నగరాల్లోనూ ఐటి హబ్‌లు ఏర్పాటు కావాలని ఇందుకోసం ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందన్నారు. ఒకే రాజధాని అమరావతి అభివృద్ధి వికేంద్రీకరణ తమ కూటమి ప్రభుత్వ నినాదం అన్నారు. ఈదిశగా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందించినట్లు లోకేష్ చెప్పారు. ఇందులో భాగంగా అనంతపురంలో కియాను ఏర్పాటు చేయగా, కర్నూలులో రిన్యూవబుల్ ఎనర్జీసంస్థలు, కడప, చిత్తూరులో ఎలక్ట్రానిక్ తయరీ సంస్థలు వచ్చాయన్నారు.

నెల్లూరుకు ఎల్జీతో డైకిన్ సంస్థ ఏర్పాటు కానుందని తెలిపారు. ఆసియాలోనే మొదటి 156 క్యూబిట్ క్వాంటం కంప్యూటర్ అమరావతిలో ఏర్పాటు కానుందన్నారు. ఉత్తరాంధ్రలో దేశంలోనే అతిపెద్దదైన ఆర్సెల్ మిత్తల్ స్టీలు కంపెనీ ఏర్పాటు కానుందని, దీనికితోడు ఔషదపరిశ్రమలు వస్తాయని, గోదావరి జిల్లాల్లో ఆక్వాను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఇదీ రీతిలో రాష్ట్రం మొత్తం అభివృద్ధి వికేంద్రీకరణ జరుగుతుందన్నారు. తాను పాదయాత్ర చేస్తున్నప్పుడు మధ్యం కారణంగా భర్తను కోల్పోయి బడ్డీకొట్టు నడుపుతూ ఇద్దరు పిల్లలను చదివిస్తున్న మహిళను ప్రభుత్వం నుండి ఎమి కావాలని అడిగితే చదువుకున్న పిల్లలకు ఉద్యోగాలు కల్పించమని కోరిందని, దీంతో తాను ఐదేళ్లలో 20లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి ఆదిశగా ప్రయత్నాలు చేయటంతో ఇప్పటికే 10 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించేలా యంఒయులు కుదుర్చుకోవటం జరిగిందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందంటే ముందుచూపు ఉన్న చంద్రబాబు వల్లే సాధ్యమైందన్నారు. ఆయన 20 ముందు ఏంజరుగబోతుందో, అప్పటి అవసరాలు ఏమిటో ఇప్పుడే ఆలోచించి అడుగులు వేస్తారని ప్రశంసించారు.

# నేటినుంచి వర్షాకాల పార్లమెంటు

>> అస్త్ర శస్త్రాలను సిద్ధంచేస్తున్నాయి. ఆదివారం కేంద్ర మంత్రి బిజెపి రాజ్యసభా పక్ష నాయకుడు జెపినడ్డా అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష సమావేశంలో విపక్షాలు పలు అంశాలు లేవనెత్తాయి. బీహార్‌లో కొనసాగుతున్న ఓటర్ల ప్రత్యేక పునఃపరిశీలన ప్రక్రియ (ఎస్ఐఆర్), పహల్గాం ఉగ్రదాడి, భారత్ పాక్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ గురించి ట్రంప్ చేసిన వ్యాఖ్యలు సహా పలు అంశాలను ప్రస్తావించాయి. కాంగ్రెస్,బిజెపి, ఆప్, సహా పలు రాజకీయ పార్టీల నాయకులు హాజరయ్యారు. ఈ క్రమంలో సభ సజావుగా సాగడానికి సహకరించాలని విపక్ష పార్టీలను కేంద్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. బీహార్‌లో ఓటరు జాబితాల సవరణ (ఎస్ఐఆర్) తాలుకు పోల్ స్కామ్, భారత్ పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందానికి తానే మధ్యవర్తిత్వం వహించానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యల గురించి వివరణ వంటి అంశాలను అఖిలపక్ష సమావేశంలో లేవనెత్తినట్లు ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ తెలిపారు. ఇండియా కూటమి లోక్‌సభ ఎన్నికలకు మాత్రమేనని, ఆప్ సొంతంగా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. పహల్గాం ఉగ్రదాడి, బీహార్‌లో ఎస్ఐఆర్, భారత్ పాక్ మధ్య కుదిరిన కాల్పుల ఒప్పందంపై ట్రంప్ వ్యాఖ్యలు తదితర అంశాలను అఖిలపక్ష సమావేశంలో కాంగ్రెస్ లేవనెత్తిందని ఆ పార్టీ ఎంపీ గౌరవ్ గొగోయ్ తెలిపారు. కాంగ్రెస్ లేవనెత్తిన కీలక అంశాలపై ప్రధాని మోదీ పార్లమెంటులో ప్రకటన ఇవ్వాలని కోరామన్నారు. ఒడిశాలో శాంతిభద్రతలను కాపాడడంలో బిజెపి సర్కార్ పూర్తిగా విఫలమైందని బిజెడి ఎంపీ సస్మిత్ పాత్రా వ్యాఖ్యానించారు. ఒడిశాలో బిజెపి సర్కార్ శాంతిభద్రతలను పూర్తిగా దెబ్బతీస్తున్నట్లు కనిపిస్తోంది. రాష్ట్రంలో మహిళలు, బాలికలపై నేరాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. బాలేశ్వర్ జిల్లాలో ఇటీవల విద్యార్థిని ఆత్మాహుతి చేసుకున్న సంఘటన యావత్ దేశాన్ని కదిలించింది. బాధితురాలు బిజెపిని ఎంపీ, స్థానిక అధికారులను సంప్రదించింది. ఒడిశా ముఖ్యమంత్రి, ఉన్నత విద్యా మంత్రికి ట్వీట్ చేసింది. అందరూ ఆమెకు వెన్నుపోటు పొడిచారు. ఆమె ఒక స్టూడెంట్, ఏబీవీపీలో చురుకైన సభ్యురాలు. అలాగే పూరీ జిల్లాలో 15 ఏళ్ల బాలికకు దుండగులు నిప్పంటించారు. దాదాపు 20 రోజుల క్రితం భువనేశ్వర్ మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్‌ను ఐదుగురు కొట్టారు. ఈ ఘటనలను చూస్తే ఒడిశాలో బిజెపి ఆరాచక, చట్టవిరుద్ధ పాలన నడుస్తుందో తెలుస్తుంది. పూరి రథయాత్ర సమయంలో జరిగిన తొక్కిసలాట, అనేక అంశాలను పార్లమెంట్‌లో లేవనెత్తుతామని సస్మిత్ పాత్రా తెలిపారు. భారత విదేశాంగ విధానం విఫలమైందన్నారు ఎస్పీ నాయకుడు రామ్ గోపాల్ యాదవ్. అందుకే ఆపరేషన్ సిందూర్ విషయంలో భారత్‌కు ఏ దేశం మద్దతు ఇవ్వలేదని ఆరోపించారు. పహల్గాం ఉగ్ర దాడి, నిఘా వైఫల్యం. రెండోది ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ పాక్ యుద్ధాన్ని తానే ఆపినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పడం, భారతదేశ విదేశాంగ విధానం పూర్తిగా విఫలమైంది. మన స్నేహపూర్వక దేశాల సంఖ్య పెరిగి, శత్రు దేశాల సంఖ్య తగ్గినప్పుడు విదేశాంగ విధానం విజయవంతమవుతుంది. ఆపరేషన్ సిందూర్‌కు ప్రపంచంలో ఏ దేశం భారత్‌కు మద్దతు ఇవ్వలేదు. 1965లో పాక్‌తో యుద్ధం జరిగింది. కానీ ఏ ముస్లిందేశం ఇండియాకు వ్యతిరేకంగా లేదు. 1971లో జరిగిన ఇండోపాక్ యుద్ధం, కార్గిల్‌వార్ సమయంలోనూ ఏ ముస్లిం దేశం భారత్‌కు వ్యతిరేకంగా లేదు. బీహార్ లో కోట్లాది మంది ప్రజల ఓట్లను తొలగిస్తున్నారని రామ్ గోపాల్ యాదవ్ తెలిపారు.

పార్లమెంటు వర్షాకాల సమావేశాలు నేపథ్యంలో కేంద్రం ఏర్పాటు చేసిన అఖిల పక్ష సమావేశానికి కాంగ్రెస్ ఎంపీలు గౌరవ్ గోగోయ్, కె. సురేష్, జైరాం రమేష్, శివసేన ఎంపీ శ్రీకాంత్ శిందే, కేంద్రమంత్రి అనుప్రియ పటేల్, ఎన్‌సిపి (ఎస్‌పి) ఎంపీ సుప్రియా సూలే, బీజేపీ నేత రవి కిషన్ సహా మరికొందరు నాయకులు అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్నారు. అలాగే ఎస్పీ,వైసిపి జెడియూ, ఎఐఎడి ఎంకే, సిపిఎం, డిఎంకే ప్రతినిధులు కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. ఝార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) ఎంపీ మహువా మాఝీ అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్నారు.రాబోయే వర్షాకాల సమావేశాల్లో, మణిపుర్ జీఎస్టీ (సవరణ) బిల్లు 2025, జన్ విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లు 2025, ఐఐఎం (సవరణ) బిల్లు 2025, పన్ను చట్టాలు (సవరణ) బిల్లు, 2025, జియో హెరిటేజ్ సైట్స్ అండ్ జియో రెలిక్స్ (సంరక్షణ, నిర్వహణ) బిల్లు 2025, గనులు, ఖనిజాలు (అభివృద్ధి, నియంత్రణ) సవరణ బిల్లు 2025, జాతీయ క్రీడా పాలన బిల్లు 2025, జాతీయ డోపింగ్ నిరోధక (సవరణ) బిల్లు సహా పలు బిల్లులను సభలో ప్రవేశపెట్టాలని అధికార పక్షం యోచిస్తోంది.

# ఐదు రోజులు భారీవర్షాలు

>> పలుచోట్ల పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. మిగతా జిల్లాల్లో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ వెల్లడించారు.

**జలమయమైన రహదారులు:**

శనివారం విజయవాడ, అనంతపురం, కర్నూలు జిల్లాలో వర్షం కురిసింది. విజయవాడలో వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. దీంతో కొద్దిసేపు ట్రాఫిక్ జామ్ అయింది. అనంతపురంలో దాదాపు గంటపాటు మోస్తరు వర్షం కురిసింది. సాయంత్రం వేళ వర్షం పడటంతో ఆఫీసులు, పాఠశాలల నుంచి ఇంటికి వెళ్లే ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్డుపై మురుగునీరు నిలిచిపోయింది. కర్నూలు జిల్లా ఆదోనిలో భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు చేరింది. ప్రధాన రహదారులపైకి వర్షపు నీరు చేరడంతో ట్రాఫిక్ జామ్ అయింది. ఆదివారం అల్లూరి సీతారామరాజు, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, బాపట్ల, గుంటూరు, వైఎస్సార్ కడప, అన్నమయ్య, శ్రీసత్యసాయి, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు అంచనాలకు తగినట్లుగా ఈ ప్రాంతాల్లో వానలు పడ్డాయి.

సోమవారం అల్లూరి సీతారామరాజు, డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి, బాపట్ల, పల్నాడు, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో కొన్నిచోట్ల ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నారు.డా. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో అత్యధికంగా 95.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. శనివారం అల్లూరి సీతారామరాజు, ఏలూరు, డా. బీఆర్ అంబేద్కర్ కోనసీమ, అనకాపల్లి, తూర్పుగోదావరి, కర్నూలు, విజయనగరం, నంద్యాల తదితర జిల్లాల్లో వర్షాలు కురిశాయి.

21-7Pg3exHMNWJQE.qxd:21-7Pg3exHMNWJQE.qxd 1/1/02 6:08 AM Page 1



## అమరావతి రైల్వే లైన్ భూసేకరణ కోసం రైతులకు నోటీసులు

**విజయవాడ,జూలై20,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ రాజధాని అమరావతిలో రైల్వే లైన్ ఏర్పాటుకు పనులు వేగవంతమయ్యాయి.. తొలి దశలో 27 కిలో మీటర్ల మేరకు రైల్వేలైన్ పనులు చేపడుతున్నారు. ఇప్పటికే 12 గ్రామాల పరిధిలో రైల్వే లైన్ వెంబడి మార్కింగ్ కూడా వేశారు. ఈ మేరకు రైతుల నుంచి భూమి తీసుకునేందుకు అధికారులు కసరత్తులు చేపట్టారు. కొప్పరావూరులో 2.57 కిలో మీటర్ల మేర రైల్వేలైన్ ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం 27 ఎకరాల 43 సెంట్లు సేకరించాలని నిర్ణయించారు. ఈ మేరకు గ్రామంలో భూసేకరణ చేయనున్నారు. ఇందుకోసం రైతులకు నోటీసులు జారీ చేశారు. భూసేకరణపై అభ్యంతరాలుంటే తెలపాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ నెల 22న 3 గంటలకు ధ్రువపత్రాలు తీసుకురావాలని రైతులకు గుంటూరుజిల్లా సంయుక్త కలెక్టర్ భార్గవ్‌తేజ సూచించారు. అమరావతి మీదుగా ఎర్రుపాలెం-నంబూరు మధ్య చేపడుతున్న కొత్త రైల్వే లైన్ పనులు నాలుగేళ్లలో పూర్తి చేయనున్నట్లు రైల్వే అధికారులుచెబుతున్నారు. 56 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టుకు 2వేల 545 కోట్లు వ్యయమవుతుందని అంచనా. ఈ రైల్వే లైన్ కోసం 8 మండలాల్లోని 22 గ్రామాల్లో భూమిని సేకరిస్తున్నారు.ఇందుకోసం రైతులకు నోటీసులు జారీ అయ్యాయి.

## లిక్కర్ స్కాం సూత్రధారి జగన్

### రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణికం ఠాగూర్




**విజయవాడ,జూలై20,ప్రభాతవార్తప్రతినిధి:** లిక్కర్ స్కాం కుంభకోణానికి అసలు మాస్టర్ మైండ్ జగన్ ఆయన సతీమణి భారతీ అని ఎపి రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణికం ఠాగూర్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. జగన్ లిక్కర్ మాఫియా కోటి కుటుంబాలను నాశనం చేసిందని అన్నారు.నాసిరకం మద్యంతో రూ.3,200 కోట్లు కొల్లగొట్టారని చెప్పారు. లిక్కర్ స్కామ్‌లో మిథున్‌రెడ్డి కేవలం పావు మాత్రమేనన్నారు. ఈ కుంభకోణానికి అసలు మాస్టర్ మైండ్ జగన్, భారతిలేనన్నారు. లిక్కర్ స్కామ్ సొమ్మును ఎన్నికల్లో ఖర్చుచేశారనీ, దానితో ఓట్లు కొన్నారు అని మాణికం ఠాగూర్ ఆరోపించారు. ఈ వ్యవహారంలో ఇంకా లోతైన విచారణ జరగాల్సి ఉందన్నారు.రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వ పనితీరు బాగోలేదన్నారు.అన్ని రంగాల్లో చంద్రబాబు ప్రభుత్వం విఫలమైందన్నారు.

## యువతకు పోటీ పరీక్షల్లో ఉచిత శిక్షణ

### మంత్రి డా.డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి

**విజయవాడ, జూలై 20,ప్రభాతవార్తప్రతినిధి:** డా.బి.ఆర్.అంబేద్కర్ స్టడీ సర్కిల్ కేంద్రాల ద్వారా పోటీ పరీక్షల కోసం నిరుద్యోగ ఎస్సీ,ఎస్టీ యువతకు ఉచిత శిక్షణ కార్యక్రమం త్వరలో ప్రారంభిస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి ఆదివారం విడుదల చేసిన ఓ పత్రిక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి ఆ శాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని విజయవాడ, విశాఖపట్నం,తిరుపతి కేంద్రాలుగా బ్యాంక్ శివీ, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ రైల్వే రిక్రూట్మెంట్ పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తామన్నారు. ఈ శిక్షణ కోసం అభ్యర్థుల నుంచి త్వరలో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ ఎస్సీ,ఎస్టీ యువత వినియోగిం చుకోవాలని మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి సూచించారు.

## ఆర్టీసీ ప్రైవేటీకరణకు కుట్ర: సిహెచ్.బాబూరావు

**విజయవాడ,జూలై20,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలో రూ. 400 కోట్ల రూపాయల విలువైన, ఐదు ఎకరాల పాత బస్టాండ్ ఆర్టీసీ స్థలాన్ని బడా కంపెనీ లూలూ మాల్ కి కట్టబెట్టడానికి నిరసనగా విజయవాడలో ఆదివారం సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా, ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా బాబురావు, కాశీనాథ్ మాట్లాడుతూ ఆంధ్రులను దెబ్బతీసి విదేశీ సంస్థలకు భూములు, ప్రజల ఆస్తులు పందారం చేయటం నమ్మక ద్రోహమేనన్నారు. 25 దేశాలలో వేలకోట్ల రూపాయలు వ్యాపారం చేసే బడా సంస్థ లులుకి ప్రభుత్వం దాసోహం అనడం భారీ కుంభకోణానికి దారితీస్తుందన్నారు. ఆర్టీసీని కాపాడవలసిన పాలకులే, ఆర్టీసీ ఆస్తులను బడా సంస్థలకు రాసి ఇవ్వటం గర్హనీయమన్నారు. ఆర్టీసీ బస్సులు, డిపోలకు నిలువ నీడ లేకుండా చేస్తూ, విదేశీ సంస్థలకు ఊడిగం చేయటం చంద్రబాబు, పవన్‌కు తగునా? అని ప్రశ్నించారు. కాలవ కట్టలపై పేదలు నివసించడానికి వీలు లేకుండా తరిమేస్తూ, రైవాస్ కాలవ ఒడ్డున బడా కంపెనీల మాల్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వటం, భూములు కట్టబెట్టడం తగునా? అని అడిగారు. లులుమాల్ వలన వందలాది మందికి ఉపాధి వస్తుందని నమ్మిస్తూ, వేలాదిమంది చిరు వ్యాపారుల పొట్ట గొట్టడం అమానుషమన్నారు. విశాఖలో 13 ఎకరాలు, విజయవాడలో ఐదు ఎకరాలు లులు సంస్థకు ధారాదత్తం చేయడం అన్యాయమన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు ప్రజల ఆస్తులను విదేశీ బడా కంపెనీలకు కట్టబెట్టే నైతిక అధికారం పాలకులకు లేదు అని స్పష్టం చేశారు. పి ఫోర్ అంటే పేదరిక నిర్మూలన అంటే లులు సంస్థకు దాసోహం అనటమేనా? అని ప్రశ్నించారు. చిన్నా, మధ్యతరగతి వ్యాపారులపై పన్నుల భారాలు వేస్తూ, వారిని వేధిస్తూ, బడా సంస్థలకు మాత్రం రాయితీలు ఇవ్వడం శోచనీయమన్నారు. పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ నిర్మాణానికినాడు పేదలు తమ ఇళ్లను కోల్పోయి సహకరిస్తే, నేడు బస్సు డిపోలను ప్రభుత్వాలు విదేశీ సంస్థలకు అప్పగించడం దారుణమన్నారు. బృందావన్ కాలనీలోని 25 కోట్ల రూపాయల విలువైన మున్సిపల్ స్థలాన్ని రాఘవేంద్ర మఠానికి ఇస్తూ విజయవాడను క్రమంగా అమ్మకానికి పెడుతున్నారని అన్నారు. సంపద సృష్టి అంటే ప్రభుత్వ, ప్రజల సంపదను విదేశీ బడా కంపెనీలకు కట్టబెట్టటమేనా? అని అడిగారు. ఇప్పటికే లక్షలాదిమందికి ఉపాధి చూపుతున్న చిన్నా, మధ్యతరగతి వ్యాపారులు, పరిశ్రమల నుండి పన్నులు, విద్యుత్ చార్జీల రూపంలో పీక్కుతింటూ, బడా సంస్థలకు మాత్రం భూములు, రాయితీలు ఇస్తూ నెత్తిన పెట్టుకోవడం సమంజసమా? అని అడిగారు. ఆర్టీసీ బస్టాండ్ స్థలం పక్కనే ఉన్న పార్కును సైతం దాఖలు పరిచే ప్రయత్నాలు సరికాదు అని చెప్పారు. ఇప్పటికే లులు సంస్థపై కోర్టులలో అనేక కేసులు నడుస్తుండగా, పాలకులు నిసిగ్గుగా ఆ సంస్థకు దాసోహం అనటం బాధాకరమన్నారు.

## పేదరికంలేని సమాజ నిర్మాణానికే పి-4: కలెక్టర్ లక్ష్మీశ

### అమ్మ అసోసియేషన్ సహకారాన్ని సద్వినియోగం చేసుకోండి



విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

**విజయవాడ,జూలై20,ప్రభాతవార్తప్రతినిధి:** పేదరికంలేని సమాజ నిర్మాణానికే పీ4 విధానమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. వ్యాపారం, వాణిజ్యం, కళలు వంటి అన్ని రంగాల్లో ప్రత్యేక గుర్తింపు కలిగిన విజయవాడలో పేదకుటుంబాల పిల్లలు బాగా చదువుకొని, ఉన్నతంగా ఎదగడానికి ఆర్థిక సమస్యలు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో అమ్మ అసోసియేషన్ అందిస్తున్న ప్రోత్సాహం వెలకట్టలేనిదని జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశ అన్నారు. ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ) ఆధ్వర్యంలో ఆదివారం మొగల్రాజపురం అమ్మ కళ్యాణమండపంలో పేదకుటుంబాల విద్యార్థులకు ఉపకారవేతనాల పంపిణీ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ అసోసియేషన్ ఆటోమొబైల్ రంగంలో పనిచేసే కుటుంబాలను అమ్మలా ఆదరిస్తోందన్నారు. ఈ ఏడాది 408 మందికి రూ. 16.50 లక్షలు ఉపకారవేతనాలతోపాటు నోటు పుస్తకాలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. దాదాపు 300 బంగారు కుటుంబాలకు మార్గదర్శులుగా వ్యవహరించి, ఆ కుటుంబాలను అన్ని విధాలా పైకి తీసుకొచ్చేందుకు అమ్మ అసోసియేషన్ ముందు కురావడం అభినందనీయమని, జిల్లాలో 86వేల బంగారు కుటుంబాలు ఉన్నాయన్నారు. ఈ కుటుంబాలే భవిష్యత్తులో ఏదో ఒక రోజు మార్గదర్శులు స్థాయికి ఎదిగేలా చేయూతనివ్వాలన్నారు. ఈ నేపథ్యంలో అమ్మా అసోసియేషన్ ద్వారా మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, ప్లాస్టిక్ వస్తువుల వినియోగంపై పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు గారపాటి సతీష్‌బాబు మాట్లాడుతూ అమ్మ అసోసియేషన్ ద్వారా నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కానూరులో రూ.60లక్షలతో వృద్ధాశ్రమాన్ని నిర్మించి అనేకమంది వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తున్నామన్నారు. ఓ సాధారణ రైతు కుటుంబంలో పుట్టిన డా. జి.లక్ష్మీశ ఐఏఎస్ అధికారిగా ప్రజలకు సేవల చేసే స్థాయికి ఎదగడం మనందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గోనుగుంట వెంకట సుబ్బారావు, దోనేపూడి దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శి సుంకర చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శి కె.దుర్గామల్లికార్జునరావు, కార్యవర్గ సభ్యులతోపాటు అసోసియేషన్ మాజీ అధ్యక్షులు మిరియాల వెంకటేశ్వరరావు, జిల్లా రెడ్‌క్రాస్ వైస్ ఛైర్మన్ డా.వెలగా జోషి, విద్యార్థినీవిద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## 9, 10 తరగతులు, ఇంటర్ విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు

**విజయవాడ,జూలై20,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రం టీడీపీ నేతృత్వం కూటమి ప్రభుత్వం ఒక్కో పథకాన్ని అమలు చేసుకుంటూ ముందుకెళ్తోంది. ప్రభుత్వ, ప్రైవేట్‌తోపాటు ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న 9, 10 విద్యార్థులకు, అలాగే ఇంటర్మీడియట్ మొదటి, రెండో సంవత్సరం షెడ్యూల్డ్ క్యాస్ట్(ఎస్సీ) విద్యార్థులకు తల్లికి వందనం పథకం కింద ఏపీ ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఈ పథకం ద్వారా 3.93 లక్షల మంది విద్యార్థులకు ఆర్థిక సహాయంలో 40 శాతం వాటాగా.. రూ.382.66 కోట్లను తల్లుల ఖాతాలకు చంద్రబాబు సర్కార్ జమ చేసింది. 9, 10 తరగతుల ఎస్సీ డే స్కాలర్ విద్యార్థులకురూ.10,900 మొత్తాన్ని విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలో జమ చేసింది. ఇక 9, 10 తరగతుల ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు రూ.8,800, అదే విధంగా ఇంటర్మీడియట్ 1,2వసంవత్సరం చదువుతున్న ఎస్సీ విద్యార్థులకు మొత్తం ర్యాంకింగ్ ఆధారంగా రూ. 5,200నుంచి రూ.10,972 వరకూ పిల్లల తల్లుల ఖాతాలో నగదువేసింది. ఎన్నికల సమయంలో కూటమిపార్టీలు సూపర్ సిక్స్ హామీలు ఇచ్చాయి. ఆఎన్నికల్లో కూటమి ప్రభుత్వం కొలువు తీరింది. దీంతో ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదికి తల్లికి వందనం పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకానికి నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈపథకం ద్వారా 42,69,459 మంది తల్లులఖాతాల్లో 67,27,164 మంది విద్యార్థులకు రూ.15వేలు జమ చేస్తున్నారు.

## ప్రమాదవశాత్తు ఎల్‌ఎల్‌సి కాలువలో పడిపోయిన కారు

### ఒకరు మృతి, మరొకరు గల్లంతు, నలుగురు భక్తులు సురక్షితం




కాలువలో పడిపోయిన కారును తీస్తున్న దృశ్యం

**కౌతాళం, రూరల్/జూలై20, ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు ఒకారు ఎల్‌ఎల్‌సీ కాలువలో పడిపోయిన ఘటనలో ఒకరు మృతిచెందారు. మరొకరు గల్లంతు అయిన ఘటన కర్నూలు జిల్లాలోని కౌతాళం మండలంలో చోటు చేసుకుంది. కర్ణాటక రాష్ట్రం హుబ్లీ నుంచి దారువాడ జిల్లా హిడికట్టే గ్రామానికి చెందిన భక్తులు ఎర్టీగా కారు (కేఏ 63 ఎన్6642)లో హుబ్లీ నుంచి మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శన నిమిత్తం ఆదివారం వచ్చారు. దర్శనం ముగించుకుని తిరుగు ప్రయాణంలో ఊరికి బయలుదేరగా కర్నూలు జిల్లా కౌతాళం మండలం పెద్ద కాలువ (ఎల్‌ఎల్‌సీ)వద్ద కుక్క అడ్డు రావడంతో తప్పించే ప్రయత్నంలో కారు కాలువలో పడిపోయింది. ఇందులో డ్రైవర్‌తో సహా ఆరు మంది ప్రయాణిస్తున్నారు. నలుగురు క్షేమంగా బయటపడ్డారు. ఒకరు మాత్రం మరణించారు. ఇంకొకరు గల్లంతయ్యారు. సునీల్ అనే ప్రయాణికుడు మరణించాడు. మణికంఠ అనే ప్రయాణికుడు గల్లంతయ్యాడు. ఈ ప్రమాదం నుంచి కారులో ప్రయాణిస్తున్న భక్తులు అభిషేక్, అంపయ్య, హైదర్, మంజునాథ్‌లు క్షేమంగా బయటపడ్డారు. విషయం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది, కౌతాళం సీఐ అశోక్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని క్రేన్ సాయంతో కారును, కారులో ప్రయాణిస్తున్న వారిని క్షేమంగా బయటకు తీశారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరించారు. గల్లంతైన వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

## మిథున్‌రెడ్డి అరెస్ట్ రాజకీయ కక్ష సాధింపు చర్య: మేకపాటి విక్రమ్‌రెడ్డి



**ఆత్మకూరు (నెల్లూరు), జూలై 20, ప్రభాతవార్త :** రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అరెస్ట్ రాజకీయ కక్ష సాధింపు చర్య అని ఆత్మకూరు మాజీ శాసనసభ్యులు, వైఎస్ఆర్‌సిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. పెద్దిరెడ్డి కుటుంబాన్ని , వైఎస్ఆర్‌సిపిని ఇబ్బందిపెట్టడమే ప్రభుత్వ లక్ష్యంగా, రాజకీయ దురుద్దేశంతో తప్పుడు విచారణలు, అక్రమ అరెస్టులు, లేని లిక్కర్ స్కామ్‌ను సృష్టించి అరెస్టులు చేస్తున్నారన్నారు. ఇది ఇంకా కొనసాగితే ఏమాత్రం సహించమన్నారు. ప్రభుత్వ తీరును ప్రజల్లో ఎండగడతామన్నారు. కూటమి ప్రభుత్వ కక్షపూరిత రాజకీయాలు తారాస్థాయికి చేరుతున్నాయన్నారు. అవినీతి జరిగిందా లేదా అనేది ప్రజలకు తెలుసని ప్రభుత్వ ఆధ్వర్యంలో షాపులు నడిపిస్తే ఇక అవినీతి ఎక్కడ నుంచి వస్తుంది, ఏమీ లేని కేసులు ఇప్పుడు అందరిన్ని అరెస్టులు చేస్తూ ఇబ్బంది పెడుతున్నారన్నారు. వైఎస్ఆర్‌సిపి అధ్యక్షుడు వైఎస్‌జగన్మోహన్‌రెడ్డి చుట్టూ ఉన్నవారందరినీ అరెస్ట్ చేసి భయపెటాలని కూటమి ప్రభుత్వం చూస్తుందన్నారు. నిజాలు నిదానంగానైనా బయటకు రాకమానదన్నారు. త్వరలో ప్రజలు కూటమి ప్రభుత్వానికి బుద్ధిచెబుతారని మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు.

## అదృశ్యమైన ఎఇ కిషోర్ ఆచూకీ లభ్యం

**విజయవాడ,జూలై20,ప్రభాతవార్తప్రతినిధి:** మరో ప్రాంతానికి తనను బదిలీ చేసినా రిలీవ్ ఆర్డర్ ఇవ్వలేదని ఆత్మహత్య చేసుకుంటునట్లు లేఖ రాసి అదృశ్యమైన ఎన్టీఆర్‌జిల్లా తిరువూరు ఇరిగేషన్ ఎఇ కిషోర్ ఆచూకీ లభ్యమైంది. ఫోన్ సిగ్నల్ ఆధారంగా పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు.తన కార్యాలయంలో ఉన్నతాధికారులు, స్థానిక ఎంఎల్‌ఏలు ఉద్దేశపూర్వకంగా తాను రిలీవ్ కాకుండా అడ్డుకుంటున్నారని ఎఇ కిషోర్ ఆరోపణ,ఆయన లేఖ రాసి అదృశ్యం కావడంతో అతని కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.ఈ క్రమంలో పోలీసులు ఎఇ కదలికలను ఫోన్ ద్వారా ట్రాక్ చేసారు. మొదట తెలంగాణలో కిషోర్ ఆచూకీ లభ్యమైందని అక్కడ నుండి వైజాగ్, చివరకు రాజమండ్రిలో గోదావరి ఒడ్డున ఆత్మహత్యకు యత్నిస్తున్న క్రమంలో అతని బంధువులతో కలిసి పోలీసు సిబ్బంది పట్టుకున్నారు. ప్రస్తుతం రాజమహేంద్రవరం నుంచి తిరువూరుకు తీసుకొస్తున్నారు.


## తవణంపల్లె మాజీ వైస్ ఎంపిపి దారుణ హత్య

### కాళ్లు, చేతులు బంధించి ఉరివేసిన దుండగులు

**తవణంపల్లె, జూలై 20 ప్రభాతవార్త:** మండల మాజీ వైస్ ఎంపీపీ, టీడీపీ నాయకుడు తెల్లగుండ్లపల్లె రంగయ్యనాయుడు శనివారం రాత్రి దారుణ హత్యకు గురయ్యాడు. గుర్తు తెలియని వ్యక్తులు రంగయ్యనాయుడు కాళ్ళు చేతులను తాళ్ళతో బంధించి ఇంటి ముందు వున్న ట్రాక్టర్ షెడ్డు వద్ద తాడుతో ఉరివేసి హత్య చేశారు. ఈసంఘటన చిత్తూరు జిల్లా తవణంపల్లె మండలంలో సంచలనం రేపింది. స్థానిక పోలీసుల కథనం మేరకు గత 15 సంవత్సరాల క్రితం మండల వైస్ ఎంపీపీగా పనిచేసిన తెల్లగుండ్లపల్లె రంగయ్యనాయుడు ప్రస్తుతం స్వగ్రామం తెల్లగుండ్లపల్లెలో భార్యతో కలిసి నివాసముంటున్నారు. ఈనేపథ్య ంలో భార్యకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని కుమారుడు వద్దకు వెళ్ళింది. దీనితో కుమార్తె, అల్లుడు రంగయ్యనాయుడుకు తోడుగా ఇంటిలో వుంటున్నారు. శనివారం రాత్రి భోజనం అనంతరం కుమార్తె, అల్లుడుతో కలిసి రంగయ్యనాయుడు ఇంటిలో నిద్రించారు. అయితే ఆదివారం వేకువజామున సుమారు 5.45 గంటలకు ఇంటి ముందు ట్రాక్టర్ షెడ్డు వద్ద హత్యకు గురై వేలాడుతుండడాన్ని పక్క ఇంటివారు గమనించి రంగయ్యనాయుడు కుటుంబసభ్యులకు తెలపగా గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు చిత్తూరు డీఎస్పీ సాయినాథ్, రూరల్ వెస్ట్ సిఐ శ్రీధర్‌నాయుడులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అలాగే చిత్తూరు నుండి పోలీసు జాగిలాలు, క్లూస్ టీం సంఘటనా స్థలంలో వేలిముద్రలను, ఆధారాలను సేకరించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీధర్‌నాయుడు తెలిపారు. ఇదిలా వుండగా గ్రామంలో కొంత మంది యువకులతో జరిగిన చిన్నపాటి గొడవల వల్లే రంగయ్యనాయుడు హత్యకు గురై వుంటారనే కోణంలో పోలీసులు గ్రామానికి చెందిన కొంత మంది యువకులను అదుపులోకి తీసుకుని విచారి స్తున్నట్లు తెలుస్తోంది. వివాద రహితుడు అయిన రంగయ్యనాయుడును ఎవరు? ఎందుకు హత్య చేశారనే విషయం పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

## తిరుమల సమాచారం

## 29న మలివిడత గరుడసేవ



**తిరుమల,జూలై20 ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తి మలయప్పస్వామికి ఈ నెలలో రెండవసారి 29వతేదీ గరుడపంచమి సందర్భంగా గరుడసేవ జరగనుంది. సాధారణంగా ప్రతినెలాలో పౌర్ణమి రోజు గరుడసేవ నిర్వహించడం ఆనవాయితీ. ఈ నెలలో 10వతేదీ పౌర్ణమిరోజు గరుడసేవను భక్తులు వీక్షించారు. మళ్ళీ 29వతేదీ మంగళవారం గరుడపంచమి పురస్కరించుకుని ఆ రోజు సాయంత్రం 7గంటలకు మలయప్ప స్వామి విశేషఅలంకారభూషితుడైన తరువాత గరుడవాహనంపై కొలువుదీరి ఆలయ మాఢవీధుల్లో ఊరేగుతారు. ప్రతి ఏడాది తిరుమలలో గరుడపంచమిని వేడుకగా జరిపిస్తారు. నూతన దంపతులు తమ వైవాహిక జీవితం ఆనందాయకంగా ఉండాలని, తమకు పుట్టే సంతానం గరుడునిలాగా బలశాలిగా,మంచి వ్యక్తిత్వంతో ఉండాలని పూజ చేస్తారు.

## తిరుపతి మోడరన్ సిటీగా అభివృద్ధి



**తిరుమల,జూలై 20ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిని దేశానికి మోడరన్‌సిటీగా అభివృద్ధి చేస్తానని, ఇదీ నా బాధ్యత అని సిఎం చంద్రబాబునాయుడు ఉద్ఘాటించారు. 100 కోట్ల నుండి 150కోట్లరూపాయలు తిరుపతి అభివృద్ధికి ఖర్చు చేస్తామన్నారు. పారిశ్రామిక హబ్‌గా, విద్యాకేంద్రంగా, ఆధ్యాత్మికనగరంగా మారుస్తామన్నారు. డెస్టినేషన్ మ్యారేజీలన్నీ తిరుపతిలో జరిగేలా చూస్తా నా బాధ్యత అన్నారు. పలు పథకాల ద్వారా తిరుపతిని అభివృద్ధి చేస్తానన్నారు. సిఎం చంద్రబాబును టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి మర్యాదపూర్వకంగా కలిసి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## రూ.44లక్షలు విరాళమిస్తే దాతపేరున అన్నప్రసాదాలు వడ్డింపు




**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనార్థమ్ తిరుమలకు వస్తున్న లక్షలాదిమంది భక్తులకు రుచిగా, శుచిగా అన్నప్రసాదాలు వడ్డించేందుకు దాతలకు అవకాశం కల్పించారు. ఈ పథకం క్రింద దాత ఒకరోజుకు 44లక్షలు రూపాయలు విరాళాలిస్తే దాత స్వయంగా వచ్చి వడ్డించే అవకాశమేగాక దాత పేరు ప్రదర్శన చేస్తారు. తిరుమలకొండపై భక్తులు ఆకలి అనేది తెలియకుండా అక్షయపాత్రలా వచ్చిన ప్రతి ఒక్క భక్తుడికి రుచిగా అన్నప్రసాదాలు మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం భవనంలోనేగాక మరికొన్ని ప్రాంతాల్లో అన్నప్రసాదాలు అందిస్తున్నారు. ఇందుకుగాను ఒకరోజు విరాళ పథకం ప్రారంభించి, ఉదయం అల్పాహారం కోసం 10లక్షలు రూపాయలు, మధ్యాహ్నం భోజనం కోసం 17లక్షలు, రాత్రి భోజనం కోసం 17లక్షలు రూపాయలు అందించి దాతలు స్వయంగా భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించవచ్చు. అన్నప్రసాద భవనంలో ఉదయం 8.30గంటల నుండి 10.30గంటల వరకు చట్నీతో కలిపి ఉప్మా, పొంగళి, సేమ్యా ఉప్మా అందిస్తారు. ఉదయం 11గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు ,తిరిగి సాయంత్రం 5గంటల నుండి రాత్రి 11.30గంటల వరకు చక్కెరపొంగలి, చట్నీ,అన్నం, కూర,సాంబారు, రసం,మసాలవడ మజ్జిగతో భక్తులకు వడ్డి స్తున్నారు.

ఎస్వీఅన్నప్రసాదం ట్రస్ట్‌కు విరాళాలు కూడా 2,200కోట్ల రూపాయలకు చేరిన విషయం విదితమే. ఈ ఆదాయంపై వచ్చే వడ్డీతోనే ఇప్పుడుఎంతో నాణ్యతతో, రుచిగా అన్నప్రసాదాలు భక్తులకువడిస్తున్నారు. రోజుకు లక్షమందివరకు భక్తులు అన్నప్రసాదాలను భక్తితో స్వీకరిస్తున్నారు.



## వరుససెలవులతో తిరుమల కిటకిట: సర్వదర్శనానికి 20గంటలు

**తిరుమల,జూలై 20 ప్రభాతవార్తప్రతినిధి:**వరుస సెలవులు రావడంతో ఆదివారం ఉదయానికి తిరుమల భక్తజనసంద్రంగా మారింది. సాయంత్రానికి ఈ రద్దీ మరింతగా పెరిగింది. శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం లక్షమందికిపైగా భక్తులు తిరుమలకు చేరుకోవడంతో కొండ కిటకిటలాడుతోంది.వైకుంఠం-1,2 క్యూకాం ప్లెక్స్‌లు నిండిపోయి భక్తులక్యూలైన్లు నారాయణగిరి ఉద్యానవన షెడ్లువరకుచేరాయి. రద్దీని దృష్టిలో ఉంచుకుని టిటిడి అధికారులు ముందస్తుగా అన్నిఏర్పాట్లు సిద్ధంచేసి భక్తులకు అన్నప్రసాదాలు, పాలు, టీ శ్రీవారిసేవకులుపంపిణీ చేస్తున్నారు. సాయత్రం వరకు 45వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు.



## అందరికీ శుభాలు కలగాలి: పలువురు ప్రముఖులు

**తిరుమల,జూలై20ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలు ఆనందంగా ఉండాలని, అందరికీ మంచిజరగాలని స్వామివారిని ప్రార్థించినట్లు పలువురు ప్రముఖులు తెలిపారు. ఆదివారం ఉదయం రాష్ట్రహైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హారీ కుటుంబం, సుప్రీంకోర్టు బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు వికాస్‌సింగ్, ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ విఐపి బ్రేక్‌లో వేర్వేరుగా శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

వార్త


అందరికి కంటే ఆనందం పొందే వ్యక్తి ఎవరు? ఇతరుల సుగుణాల్ని మెచ్చుకోగలిగి, ఇతరుల సుఖం చూసి ఆనందించగల మనిషి.

-గెథే

# బదలీ వివాదాల్లో 'గ్రామాలు'

ప్రజామోద యోగ్య నిర్ణయాలు తీసుకోవడంలో ప్రభుత్వాలు ఎప్పుడూ ఆపసోపాలు పడుతుంటాయి. ఒక్కోసారి అనవసర బేషజాలకు పోయి ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలు ప్రజామోద యోగ్యం కాకపోవచ్చు. అయినా కొన్నిటిలో తలదూర్చి మంచి నిర్ణయాలు తీసుకునే విషయంలో 'తప్పు'లో కాలు వేస్తుంటాయి. వాటిని సరిచేయడంలో ఎటూ తెగక ప్రజలకు తామేం చేయాలో అర్థంకాని పరిస్థితి ఏర్పడ్తుంది. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వానికి తీరని కష్టం వచ్చింది. ఒకపక్క రాష్ట్రాల పునర్విభజనలో తెలంగాణ ప్రాంతంలోని కొన్ని గ్రామాలను ఆంధ్రప్రదేశ్‌కు కలిపారు. వాటిపై ఇరు రాష్ట్రాలూ తమకే కావాలని పట్టుపడుతున్నాయి. ఎవరివాదన వారికుంది. అలాగే భద్రాచల శ్రీ రామచంద్రుని ఆలయం, అక్కడి ప్రజలు ఖమ్మం జిల్లాలోనూ, వారి భూములు ఆంధ్రప్రదేశ్‌లోనూ ఉన్నాయి. రాముడు అందరివాడూ కనుక పెద్దగా ఇబ్బందులేమీ ఉండకపోవచ్చు. కానీ భద్రాచలం వాసుల భూములు 'సమీప ఆంధ్రప్రదేశ్‌కు మారిన గ్రామాల్లో ఉన్నప్పుడు భూములకు సంబంధించిన సాగు ప్రణాళికలు, వ్యవసాయ విధానం, సమగ్ర నిర్వహణలో కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటారు. గోదావరికి వరదలొచ్చినప్పుడు వాటి నిర్వహణలో కూడా ఇరు ప్రభుత్వాలలో ఆంధ్రప్రదేశ్ ఇటీవలి వరదల్లో తెలంగాణ నుంచి తీసుకున్న గ్రామాల అవసరాల నిర్వహణ, 'బాధితుల సంరక్షణ'లో విపరీతమైన ఇబ్బందులేర్పడిన విషయం తెలిసిందే. ప్రకృతి బీభత్సాలను ఆపడం, రాకుండా నిరోధించడం మానవుని చేతిలో లేని విషయం. కావున సమగ్ర యాజమాన్య నిర్వహణ ఒక్కటే మార్గం. ఈ పదేళ్లలోనూ ఆంధ్రప్రదేశ్‌లో చేరిన తెలంగాణ గ్రామాల సమస్యలు ఎటూ తీరలేదు. పోలవరం ముంపు గ్రామాలు వాటి బాధ్యతల రీత్యా ఆయా గ్రామాలు తమకే కావాలని పోరాడి మరీ ఆంధ్రప్రదేశ్ వాటిని 'ప్రత్యేక చట్టం' ద్వారా తనలో ఇముడ్చుకుంది. అంతా జరిగాక అక్కడి వారి భాష, యాస, జీవన విధానం మాది కనుక వారి పర్యవేక్షణ మాకే కావాలి ఆయా గ్రామాలను మాకే కలిపే యండని ఇప్పటికీ తెలంగాణ వాదిస్తోంది. అడపాదడపా ఈ అంశాలపై కేంద్ర ప్రభుత్వాన్ని కదిలించింది కూడా. మరో విషయంలో కూడా తెలంగాణ గ్రామవాసుల ఆవేదన పట్టించుకోకుండా చాపకింద నీరులా ఆదిలాబాద్ ప్రాంతంలోని 14 గ్రామాలను సొంతం చేసుకోవాలన్న పూనికతో మహారాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు మొదలుపెట్టింది. రేపోమాపో తెలంగాణలో స్థానిక ఎన్నికలు జరగనున్న తరుణంలో ఆదిలాబాద్ జిల్లాలోని 14 గ్రామాలు తమవేనంటూ మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్ ప్రకటనతో ఆయా గ్రామాల వారు ఆందోళన బాటపట్టారు. ఆదిలాబాద్ కలెక్టర్‌కు తమ గోడు విన్నవించుకున్నారు. తమ ప్రాంతంలో ఎన్నికలు జరుగుతాయా లేక 'జరుగుతున్న తంతు' రావణకాష్టంలా సాగుతుందా అనే మీమాంస వారిలో ఏర్పడింది. దశాబ్దాల క్రితం సమసిపోయి తెలంగాణ ప్రభుత్వంతో మమేకమై సజావుగా జీవనం సాగిస్తున్న గ్రామీణులకు నిద్రపట్టడంలేదు. భౌగోళికంగా కొన్ని సమస్యలుండొచ్చు. కానీ వాటి పరిష్కారం ప్రజలకు ఆమోదయోగ్యంగా జరగాలి, తప్ప ఆయా ప్రభుత్వాల సొంత నిర్ణయం కాకూడదు. సరిహద్దు రాష్ట్రాల మధ్య మిశ్రమ భాషల వాడకం ఉన్నట్లే, నీటి పంపిణీలు ఉంటాయి. వాటి వ్యత్యాసాల తీరుతెన్నులను క్రమబద్ధీకరించుకోకుండా భూభాగాలను ఇటూ అటూ కలుపుకోవాలనుకోవడం సరైన పద్ధతి కాదు. ఇదేదో రెండు రాష్ట్రాల వాదనతోనే కాదు అక్కడ ఉన్న ప్రజల ఆమోదంతో జరగాలి. ఇలాంటి సమస్యలను సున్నితంగా డీల్ చేయాలి. సంక్లిష్టం చేయరాదు. భారతదేశంలో ఏ భూభాగాన్ని ఎటు కలపాలన్నా, రాష్ట్ర సరిహద్దులు మార్చాలన్నా స్థానిక ప్రభుత్వాల అభిప్రాయంతోపాటు జనాభిప్రాయం సమగ్ర సర్వే నివేదికలతో పార్లమెంటులో చర్చ జరగాలి. ఏకాభిప్రాయం రావాలి. గతంలో రాష్ట్రాల విభజనలన్నీ ఆ మేరకే జరిగాయి. ఇప్పుడైతే స్థానిక పాలకులు అవేమీ లేకుండా తమ సొంత అభిప్రాయాలను ప్రజలపై రుద్ది తమ అనుచిత ప్రసంగాల ద్వారా సమస్యను సంక్లిష్టం చేసి ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారు. భౌగోళిక సరిహద్దులు మార్చాలనుకున్నప్పుడు తీసుకోదగిన చర్యలు తీసుకోవడంలో వైఫల్యం చెందితే మొత్తం పాలనలోనే ఏలికలు వైఫల్యం చెందినట్లు. ఈ విషయాన్ని తెలుసుకోలేక ప్రజాబాహుళ్యంలో ప్రభుత్వాలు చులకన అయిపోతున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలోని చంద్రపూర్ జీవతీ తహశీల్‌లోని గ్రామాల బదిలీ అంశం ఈనాటిది కాదు. 1987 నాటిది. ఆయా గ్రామాల్లో ఇరు రాష్ట్రాలు వారి వారి పథకాలను అమలు చేస్తున్నాయి. ఈ విషయం సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉంది. అంతకు ముందే కెకె నాయుడు కమిటీ వేసినా ఫలితం లేకపోయింది. తాజాగా మహారాష్ట్ర మంత్రి చంద్రశేఖర్ భవాంకులే ఆదిలాబాద్ జిల్లాలోని 14 గ్రామాలనూ తమ రాష్ట్రంలో కలుపుకునే విలీన ప్రక్రియను ప్రారంభించినట్లు ప్రకటించారు. చిత్రమేమిటంటే మహారాష్ట్ర రెవిన్యూ సరిహద్దుల్లో ఉందని ఆ రాష్ట్రం రోడ్లు, నీటి పథకాలు, పాఠశాలల నిర్వహణ చూస్తుంటే విద్యుత్ సరఫరా చేస్తున్న తెలంగాన పాలనా పెత్తనం చేస్తోంది. ఒకపక్క ఇరుగు పొరుగు రాష్ట్రాల మధ్య జలజగడాలతోనే సతమతమవుతున్న రాష్ట్రాలకు 'గ్రామాల బదిలీ' వివాదాలు కొత్త తలపోటు. వీటిని జనాంతికంగా కాకుండా జనాభిప్రాయ సేకరణతో సామరస్యంగా పరిష్కరించుకోవడం సర్వశుభప్రదం.

ధమనులు గట్టి పడటం ద్వారా కంటే గుండె రాయి అయినప్పుడే, మనిషి వయస్సు మళ్లిన వాడవుతాడు.



సెనెకా

సాహిత్యం అకస్మాత్తుగా లభించదు. తరగని విశ్వాసం, గట్టి ప్రయత్నం ద్వారానే మనం సాహిత్యాన్ని పొందగలం.



అబిగైల్ ఆడమ్స్

# స్థానిక ఎన్నికలు బిజెపి సారథికి అగ్నిపరీక్ష?

***ఏ పార్టీ లోనైనా 'కత్తి మీద సాము' లాంటి ఈ ప్రక్రియ దాదాపు అసాధ్యం అన్నట్లు రాజకీయ నాయకులు భావించినా, ఏ వర్గానికీ చెందని నాయకుడిగా ఎన్నికయిన కొత్త తెలంగాణ బిజెపి అధ్యక్షుడు అందరినీ కలుపుకొనిపోవటానికి కృషి చేస్తున్నట్లు ఒక నమ్మకాన్ని పార్టీలో కలిగిస్తే చాలు! పరిస్థి తులతోపాటు వర్గాలు కూడా సర్దుకుంటాయి. రాబోయే లోకల్ బాడీ ఎన్నికలు రాంచంద్రరావుకు మొదటి అగ్నిపరీక్ష అనుకోవాలి. ఆయన పనితీరు, కాండిడేట్ల ఎంపికలో ఆయన పాత్ర, శైలీ, అందరిని కలుపుకొని పోగలడు అన్న నమ్మకం ఈ మొదటి పరీక్షలో ప్రదర్శించగలుగుతే రాంచంద్రరావు పార్టీలో ఇన్నేళ్లు చేసిన కృషి ఫలించినట్లవుతుంది. ఆయన ఎంపిక సహేతుకమే అన్న పేరు కూడా హైకమాండ్‌కు వస్తుంది. ఎన్నో సలహాలూ, ఆలోచనలూ పార్టీలతో నిమిత్తం లేనివారు చెప్పటం సహజమే కానీ క్షేత్రస్థాయిలో పార్టీ అగ్రస్థాయిలో పనిచేసే నాయకుడు ఆచితూచి అడుగేసినప్పుడే అన్నిట్లోనూ విజయం పొందలేకపోయినా పార్టీ కోసం శ్రమించిన మంచి నాయకుడు అన్న పేరు తెచ్చుకుంటే చాలు! అదే పదికాలాలపాటు రాజకీయాల్లో సేవ కోసం ఉండేట్లు చేస్తుంది.***



రావులపాటి సీతారాం రావు

తెలంగాణ బిజెపి కొత్త సారథిగా నారపరాజు రాంచంద్రరావు నియామకం కొందరికి ఆశ్చర్యం కలిగించినా ఆయన గత చరిత్ర పార్టీలో ఒక్కొక్క మెట్టు నిదానంగా ఎక్కుతూ పైకి వచ్చిన తీరు బహుశా ఢిల్లీలోని బిజెపి నాయకత్వానికి నచ్చి ఉండొచ్చు. అందుకే కాబోలు చాలా సార్లు వాయిదాలు పడ్డా ఎంపిక చివరకు రామచంద్రరావును వరించింది. కొత్తగా బలం కోసం బిజెపి, తెలంగాణ ఇతర పార్టీల నుంచి పేరున్న నాయకులను చేర్చుకొని కొందర్ని ఎంపిలుగా గత సార్వత్రిక ఎన్నికలలో గెలిపించుకుంది. అందుకే ఈ పార్టీ పగ్గాలు తమకు దక్కుతాయని బిజెపి తీర్థం పుచ్చుకున్న కొందరు ఇతర పార్టీల ప్రముఖులు ఆశపడ్డారు కానీ రాంచంద్రరావును అధ్యక్షుడిగా ప్రజాస్వామ్య పద్ధతులతో ఎన్నిక అయినట్లు ప్రకటించినా హైకమాండ్ మాటే ఎంపిక రూపంలో జరిగినట్లు అందరికీ తెలిసిన విషయమే. ఆంధ్రలో మాధవ్ ఎన్నిక కూడా సాంప్రదాయ పద్ధతులలో, బిజెపి నమ్ముకున్న ఆశయాల మేరకు జరగడం అందరూ గమనించారు. రాంచంద్రరావుకు అనేక విషయాలు కలిసి వచ్చాయి. మొదటిది ఆయనఆర్.యస్.యస్ బాక్‌గ్రౌండ్, రెండవది విద్యార్థి దశ నుంచీ బిజెపిని నమ్ముకున్న తీరు, మూడవది వివాదరహితంగా ఉంటూ ఎవరినీ నొప్పించని మనస్తత్వం, నాలుగవది పేరున్న లాయర్‌గాఢిల్లీ వర్గాలలో కూడా తెలిసిన విషయం. రాంచంద్రరావులోని ప్రత్యేకత ఏమిటంటే తన పార్టీలో మొదటి నుంచీ తనతో పాటు ఉన్న వారిలో కొందరు అనేక కారణాల వల్ల ఏ అవకాశం వచ్చినా, అందిపుచ్చుకొని, రాంచంద్రరావు పేరు తెర మీదికి వచ్చినప్పుడు మాత్రం నాజుగ్గా పక్కకు నెట్టివేసేట్లు చేసినా, వీరితో విభేదించలేదు. ఆ కారణంతో వారితో వ్యక్తిగతంగా పార్టీలో శత్రుత్వం పెంచుకోలేదు. మరీ ముఖ్యంగా సమయం వచ్చినప్పుడు ఆలస్యమైనా తనకు రావాల్సిన పదవి వస్తుందన్న ప్రగాఢ నమ్మకం. అన్నిటినీ మించి తన కొక వర్గాన్ని ఏర్పరుచుకోకపోవటం. ఇవన్నీ ఆయనను అధ్యక్ష పదవికి అర్హుడిని చేశాయి. పదవుల దృష్ట్యా ప్రత్యక్ష ఎన్నికలలో ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పటికీని తక్కువ ఓట్లతో ఆయన గెలవకపోవడం, అటు తర్వాత ఒక దశలో ఎమ్మెల్సీగా గెలవడం కలిసి వచ్చాయి. అన్నిటిని మించి పార్టీ పట్ల ఆయనకున్న 'లాయల్టీ' రాష్ట్రంలోని ఏ వర్గానికి చెందని నాయకులతోపాటు ఢిల్లీలోని బిజెపి ప్రముఖులను కూడా ఆకర్షించటం వల్ల గట్టిపోటీ ఉన్నా రాంచంద్రరావుకు అరుదైన అధ్యక్ష పదవి లభించింది. తెలంగాణలో సోషియో ఎకనామిక్, ఎడ్యుకేషన్ ఎంప్లాయి మెంట్ పొలిటికల్ కాస్ట్ సర్వే ప్రకారం దాదాపు 3,54, 77,554 ప్రజలల్లో 1,12,15,134 కుటుంబాలలో వెనుక బడిన తరగతుల వారు 56.33శాతం తెలంగాణా జనాభాలో ఉంటే (10.08 శాత బి.సి ముస్లింలను కలుపుకొని) ఎస్సీలు 17.43 శాతం, ఎస్టీలు 10.45 శాతం, ముస్లిలు 12.56శాతం (అందులో 2.48శాతం ఓ.సి ముస్లింలు) అగ్రకులాల వారు 13.3 శాతం జనాభా లెక్కల ప్రకారం ఉన్నారు. రాంచంద్రరావు వెనుకబడిన తరగతుల వారిని ప్రోత్సహించే లక్ష్యంతో పనిచేస్తే మెరుగైన అధ్యక్షుడిగా గుర్తింపు తెచ్చుకోవచ్చు.



రాబోయే లోకల్ బాడీ ఎన్నికలలో ఆ లక్ష్యాన్ని ప్రధానంగా పెట్టుకోవల్సిన అవసరం ఈ కొత్త అధ్యక్షుడికి ఉంది. తెలంగాణ గ్రామ ప్రాంతాలలో ఇంత వరకూ బిజెపి చొచ్చుకొని పోయిన దాఖలాలు లేవు. గ్రామం నుంచి వచ్చినవాడిగా రూరల్ ప్రాంతాలలోని కష్టనష్టాలు తెలిసిన వ్యక్తిగా ఇప్పుడున్న పరిస్థితులలో బాగా తిరుగుతూ, ఆ టాస్క్‌ను గుర్తించటమేకాకుండా వారిని లోకల్ బాడీ ఎన్నికలలో పార్టీకి ఓట్లు ఆకర్షించుకొనే విధంగా కృషి చేస్తే అతని ఎంపికకు న్యాయం చేకూర్చినట్లవుతుంది. అగ్రవర్ణాలకు చెందిన వాడిగా, బిజెపికి సానుకూలంగా ఉన్న ఆ వర్గాల వారితో పాటు మరికొందరిని కూడా తన నాయకత్వంలో ఆకర్షించగలిగితే ఆ వర్గాలు కూడా ఆసరా దొరికిందని భావిస్తాయి. అధ్యక్షుడిగా ఎన్నికయిన తర్వాత రాంచంద్ర రావు మాట తీరు మార్చుకున్నట్లుంది. యుద్ధానికి 'సై' అన్న రీతిలో ప్రకటనలు చేయడం రాంచంద్రరావుకున్న పాత ఇమేజిని అంటే 'నిదానస్థుడు' అన్న పేరును పక్కకు తొలగించినట్లయింది. ప్రస్తుత రాజకీయాల్లో సాదాసీదాగా ఉంటే ప్రజలకు ముఖ్యంగా ఓటర్లకు నచ్చదు. ఢీ అంటే ఢీ అన్నట్లుగానే ఉండాలి. తెలంగాణలో ఉన్న ముఖ్యమైన పార్టీలను విమ ర్శించటంలో వెనుకడుగు వేయటం లేదు. అయితే హడా విడిలో 'రాజకీయ గ్రామర్'ను విస్మరించకూడదు. పరుష పదాలు వాడొచ్చు కానీ వ్యక్తిగతంగా, ప్రత్యర్థులను నొప్పించే విధంగా పరుషత్వం రాజకీయాల్లో పనికిరాదు. కొందరికి ఆ పోకడ 'భలే' అనిపించేట్లు ఉన్నా సామాన్య జనానికి అలాంటి తీరు నచ్చదు అని అనేక ఎన్నికలు నిరూపించాయి. ఆ సంగతి గమనంలోకి తీసుకొని పోకడలో 'ఎగ్రెసివ్'గా కనపడినా మాటలోని మంచితీరును ఆవేశంలో విస్మరించకూడదు. అధ్యక్షుడిగా ఎంపికకాగానే రాంచంద్రరావు మాట్లాడుతూ ప్రతి బిజెపి కార్యకర్తలను తనే అధ్యక్షుడిగా ఎన్నికయినట్లు భావించమని అడగడం, కార్యకర్తలను కలుపుకొనిపోయే మనస్తత్వాన్ని ప్రతిబింబించినట్లయింది. కార్యకర్తల బలమే నాయకుడి బలం. ఆ విధంగా అనటం వల్ల ఆయన కార్యకర్తలతో మమేకం అయినట్లుగా రాజకీయాలు తెలిసిన వారు భావిస్తున్నారు. తెలంగాణలో ఎన్నికలను ప్రభావితం చేసే అగ్రవర్ణాల వారిని ముఖ్యంగా రెడ్లనూ, వెలమలనూ, కమ్మవారిని రాంచంద్రరావు బిసిలకు మరింత దగ్గరకావటం కోసం వారిని దూరం పెట్టకపోయినా, ఎట్టి పరిస్థితులలో ఆ వర్గాలకు అలాంటి భావన కలిగించకుండా, చాకచక్యంగా అందరినీ కలుపుకొనిపోయే ఎజెండాను రూపొందించుకుంటే బిజెపి పెద్దలు ఆశించినట్లుగా ఆయన నాయకత్వం కొన్నాళ్లపాటు తెలంగాణ బిజెపిలో మనగలుగుతుంది, వర్ధిల్లుతుంది కూడా. ఆ ప్రయత్నం నిజాయితీగా చేయగలిగినప్పుడే కొత్త అధ్యక్షుడు అందరివాడే అన్న విశ్వాసం కార్యకర్తలకే కాకుండా తెలంగాణలోని బిజెపి నాయకులకు కూడా క్రమంగా ఏర్పడుతుంది. ఏ పార్టీ లోనైనా 'కత్తి మీద సాము' లాంటి ఈ ప్రక్రియ దాదాపు అసాధ్యం అన్నట్లు రాజకీయ నాయకులు భావించినా, ఏ వర్గానికి చెందని నాయకుడిగా ఎన్నికయిన కొత్త తెలంగాణ బిజెపి అధ్యక్షుడు అందరినీ కలుపుకొనిపోవటానికి కృషి చేస్తున్నట్లు ఒక నమ్మకాన్ని పార్టీలో కలిగిస్తే చాలు! పరిస్థితులతోపాటు వర్గాలు కూడా సర్దుకుంటాయి. రాబోయే లోకల్ బాడీ ఎన్నికలు రాంచంద్రరావుకు మొదటి అగ్ని పరీక్ష అనుకోవాలి. ఆయన పనితీరు, కాండిడేట్ల ఎంపికలో ఆయన పాత్ర, శైలీ, అందరిని కలుపుకొని పోగలడు అన్న నమ్మకం ఈ మొదటి పరీక్షలో ప్రదర్శించగలిగితే రాంచంద్రరావు పార్టీలో ఇన్నేళ్లు చేసిన కృషి ఫలించినట్లవుతుంది. ఆయన ఎంపిక సహేతుకమే అన్న పేరు కూడా హైకమాండ్‌కు వస్తుంది. ఎన్నో సలహాలూ, ఆలోచనలూ పార్టీలతో నిమిత్తం లేనివారు చెప్పటం సహజమే కానీ క్షేత్రస్థాయిలో పార్టీ అగ్రస్థాయిలో పనిచేసే నాయకుడు ఆచితూచి అడుగే సినప్పుడే అన్నిట్లోనూ విజయం పొందలేకపోయినా పార్టీ కోసం శ్రమించిన మంచి నాయకుడు అన్న పేరు తెచ్చుకుంటే చాలు! అదే పదికాలాలపాటు రాజకీయాల్లో సేవ కోసం ఉండేట్లు చేస్తుంది. ●

# భూభారతితో 'ధరణి' సమస్యల పరిష్కారం

అంబీర్ శ్రీకాంత్

గత ప్రభుత్వ పదేండ్ల పాలనలో ప్రజలు భూసంబంధిత సమస్యలతో సతమతమయిన సంగతి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ముఖ్యంగా ధరణి పోర్టల్ బాధితుల అవస్థలు అయితే వర్ణనాతీతమే. రకరకాల సమస్యలతో జనం ఇక్కట్లు పడ్డారు. ఇప్పటికీ పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు ధరణి స్థానంలోభూభారతి చట్టం తీసుకొచ్చింది. సుమారు 9వేల పైచిలుకు భూభారతి సదస్సులు నిర్వహించి జనం నుంచి సుమారు 3 లక్షలా 30 వేలకు పై చిలుకు దరఖాస్తులను స్వీకరించింది. అయితే, వీటి పరిష్కారానికి ప్రజాప్రభుత్వంలో ఆస్కారం ఉంటుందని జనం ఎంతో ఆశగా, ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ సర్కారు ఎంతో జాగ్రత్తగా ఆచితూచి భూసంబంధిత సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలి. రెవెన్యూ శాఖ మంత్రి ఆగస్టు 15 లోపు భూసమస్యలను పరిష్కరిస్తామని ప్రకటించారు. దాంతో రెవెన్యూ శాఖ వాళ్లకు పంద్రాగస్టు అనేది డెడ్‌లైన్‌గా మారింది. ఇక్కడే అసలు చిక్కులు వచ్చి పడ్డట్టయింది. ఆగస్టు 15 లోపు అప్లికేషన్లను ఏ మేరకు పరిష్కరిస్తారనేది కీలకం కానుంది. భూసంబంధిత సమస్యల పరిష్కారానికి రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది కీలకంగా పని చేయాలి. కాగా, క్షేత్రస్థాయిలో యంత్రాంగం కొరత కొట్టొచ్చినట్టు కనిపిస్తు



న్నది. ప్రజల సమస్యలను ప్రభుత్వం నిజంగా పరిష్కరించాలనుకుంటే రెవెన్యూ శాఖలో గ్రామాల్లో కీలకంగా వ్యవహరించాల్సిన గ్రామ పాలనా అధికారులను(వీఏవో) వెంటనే అధిక సంఖ్యలో నియమించాలి. తద్వారా గ్రామాల్లో రెవెన్యూ చిక్కులకు చెక్ పడే ఆస్కారం ఉంటుంది. అలా కాకుండా డెడ్‌లైన్ విధించి పనులు చేయాలని ఆదేశాలు జారీ చేస్తే మళ్లీ సేమ్ తప్పులు రిపీట్ అయ్యే చాన్సెస్ మెండుగా ఉంటాయి. ఈ విషయాలను గమనించి సర్కారు ఆ దిశగా ఆలోచన చేయాలి. గతంలో గ్రామస్థాయిలో కీలకంగా వ్యవహరించే వీఆర్వోలు ఉండేవారు. కానీ, వారిని తీసేశారు. ఇప్పుడు సరికొత్త పేరు(వీఏవో)తో మరొక పోస్టును క్రియేట్ చేస్తున్నారు. ఇకపోతే రాష్ట్రంలోని కొన్ని మండలాల్లో అయితే తహశీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఆయా చోట్ల సమస్యల పరిష్కారానికి సిబ్బంది అవసరముంటుంది. లైసెన్స్డ్ సర్వేయర్ల కొరత కూడా ఉంది. ఈ విషయాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని సర్కారు పకడ్బందీ చర్యలు తీసుకుంటేనే భూసంబంధిత సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. లేదంటే గతంలో ధరణి బాధితుల మాదిరిగానే భవిష్యత్తులో భూభారతి బాధితులు ఉండే ఆస్కారముంటుంది. అలాకాకుండా ఉండాలంటే ప్రభుత్వం మానవ వనరులను రెవెన్యూ శాఖలో పెంచేందుకు తగు చర్యలు తీసుకోవాలి. ●

# విదేశీ వైద్య విద్యార్థుల సమస్యలకు చికిత్స ఎప్పుడు?

డాక్టర్ టి.సేవకుమార్

విదేశాలకు వైద్య విద్యనభ్యసించాలన్నా భారత్‌లో 'నీట్' పరీక్షలో ఉత్తీర్ణత కావాల్సిందే. విదేశాల్లో వైద్య విద్య ఖర్చు కాస్త తక్కువగా ఉండటం వల్ల, నీట్‌లోక్వాలిఫై అయి, స్వదేశంలో సీట్లు పొందని కొంతమంది ,ఇతర దేశాలకు వెళ్లి డాక్టర్ కలను సాకారం చేసుకుంటున్నారు. ఇప్పుడు బ్యాంకులు కూడా అతి సులువుగా విద్య రుణాలు ఇవ్వడంతో, ఇతర దేశాలకు వెళ్లే వారి సంఖ్య పెరుగుతోంది. మరి కొంతమంది ఆస్తులు ప్రైవేటుగా తాకట్టుపెట్టి రుణాలు తీసుకొని ఆయా దేశాలకు వెళ్తున్నారు. అలా విదేశాలలో ఎంబిబిఎస్ పూర్తి చేసిన వారికి కేంద్ర ప్రభుత్వం, నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ద్వారా ఫారెన్ మెడికల్ గ్రాడ్యుయేట్ (ఎఫ్.ఎం.జి )పరీక్షను నిర్వహిస్తుంది. ఈ పరీక్ష చాలా కఠినంగా ఉంటుంది. ప్రతి సంవత్సరం రెండుసార్లు ఈ పరీక్ష నిర్వహిస్తోంది. అయితే ఈ పరీక్షలో 15 నుంచి 20కమించి విదేశీ వైద్య విద్యార్థులు ఉత్తీర్ణులైన సందర్భాలు లేవు. ఇదే పరీక్ష మన దేశపు వైద్య కళాశాలలో చదివిన విద్యార్థులకు పెట్టినా అంతకుమించి మంచి ఫలితాలు ఉంటాయని ఆశించలేము. కేంద్ర ప్రభుత్వం ఫైనల్ ఇయర్ పరీక్షకు బదులు స్వదేశీ ,విదేశీ విద్యార్థులకు ఒకే పరీక్ష 'ఎగ్జిట్ ఎగ్జామ్' పెట్టాలని నేషనల్ మెడికల్ కమిషన్' సూచించింది. అయినా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐ.ఎం.ఎ) వంటి వైద్య వృత్తి సంస్థలు, దాఖలైన కొన్ని వ్యాజ్యాల వల్ల కోర్టులు అడ్డుపడటంతో ఆ నిర్ణయం ఇంత వరకు అమలు కాలేదు. 'కరోనా' పేరిట ఆయా ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలో విదేశీ వైద్య విద్యార్థుల పాలిటశాపం అయినట్లు విదేశీ విద్యార్థుల్లో ఆందోళన వ్యక్తమౌవుతోంది. అప్పట్లో విదేశాల్లో చదువుకుంటున్న విద్యార్థులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారిని స్వదేశానికి రప్పించింది. ఆ తర్వాత కరోనా తగ్గినా వారి గురించి ఎవరూ పట్టించుకోలేదు. ఆయా దేశాల వైద్య కళాశాలలు వారిని తిరిగి కాలేజీకి రమ్మని పిలువలేదు. తిరిగి వెళ్ళమని మన దేశమూ ప్రకటించలేదు. అయితే కొందరు మళ్ళీ ఆయా దేశాలకు వెళ్లి మరో సంవత్సరం అదనంగా ఫీజులు చెల్లించి, ఫైనల్ ఇయర్, ఇంటర్న్‌షిప్ కూడా పూర్తి చేసి వచ్చారు. కొందరు మన దేశంలోనే వుండి, ఆయా కళాశాలకు మరో సంవత్సరం అదనంగా ఫీజులు చెల్లించి, ఆన్‌లైన్ మోడ్ ఫైనల్ ఇయర్, ఇంటర్న్‌షిప్ పూర్తిచేయగలిగారు. ఆయా దేశాలలో ఫైనల్ ఇయర్, ఇంటర్న్‌షిప్ ఆఫ్ లైన్ మోడ్ లేదా ఆన్ లైన్ మోడ్‌లలో పూర్తి చేసిన వారు ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్ (ఎఫ్.ఎం.జి) పరీక్ష రాశారు. ఆ పరీక్ష పాసైనవారికి కూడా ఇప్పుడు తిప్పలు తప్పడం లేదు. 2023లో నేషనల్ మెడికల్ కమిషన్' (ఎన్ఎంసి), రాష్ట్రాల కౌన్సిల్‌లకు కొన్ని ఆదేశాలు చేసింది. ఆతర్వాత కాలంలో మరికొన్ని ఆదేశాలను జారీ చేసింది. వీటిలో ఏ ఆదేశాలను అమలు చేయాలన్న గందరగోళంలో వైద్య విద్యార్థులు కొట్టుమిట్టాడుతున్నారు. ఇప్పటికే రాష్ట్రప్రభుత్వాల మెడికల్‌కౌన్సిల్స్ అమలు జరిపిన ఆదేశాల మాటఏమిటి? ఏ ఆదేశాలను అయినా తు.చా తప్పక పాటించాలా? ఏమైనా మార్పులు చేసుకోవచ్చునా? అన్నది స్పష్టం చేయలేదు. అందువల్ల



రాష్ట్రాల మెడికల్ కౌన్సిలల్లో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. కొన్ని రాష్ట్రాలు ఎఫ్.ఎం.జి పరీక్ష పాస్ అయిన వారందరికీ ఒకే సంవత్సరం ఇంటర్న్‌షిప్ కేటాయించాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మాత్రం ఎన్ఎంసి రూల్స్ తు.చ తప్పక పాటించాల్సిందేనని స్పష్టం చేసిది. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్‌లో గత ప్రభుత్వం నియమించిన కౌన్సిల్ సభ్యులందరు రాజీనామా చేశారు. కొత్త ప్రభుత్వం వచ్చిన ఎనిమిది నెలలకు అరుగురు నామినేటెడ్ సభ్యులతో కౌన్సిల్‌ఏర్పాటు చేసింది. అప్పటివరకు ఏపీఎంసీ రిజిష్టార్ కౌన్సిల్ కార్యకలాపాలను నిర్వహించారు. అయితే ఎఫ్ఎంజి విద్యార్థుల విషయంలో కౌన్సిల్ లేకుండా తాము ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేమని చేతులు దులుపుకున్నారు. ఆరుగురు నామినేటి సభ్యులతో చైర్మన్, వైస్‌చైర్మన్ ఎంపిక జరిగిన తర్వాత ఎఫ్ఎంజి విద్యార్థులపై దృష్టి సారించి ఒక ప్రత్యేక కమిటీని కూడా వేశారు. కమిటీ కూడా ఎన్ఎంసి నిబంధనలు అంటూ ఒక సంవత్సరం, రెండు సంవత్సరాలు, మూడు సంవత్సరాల క్లర్క్‌షిప్, ఇంటర్న్‌షిప్ అంటూ ప్రతిపాదించింది. తమకు అనుకూల నిర్ణయం వస్తుందని ఆశించిన విద్యార్థులకు తీవ్ర నిరాశ ఎదురయ్యింది. ఈపాటి నిర్ణయానికి 13 నెలల తర్వాత ఇలాంటి నిర్ణయం కాలం వృధా! వారెవరికీ ఏమాత్రం ప్రయోజనం లేకపోయింది. కరోనా సమయంలో విదేశీ విద్యార్థులకులానే, మన దేశంలోని వైద్య విద్యార్థులకు కొన్ని నెలల పాటు ఆన్‌లైన్ మోడ్‌లోనే క్లాసులు జరిగాయి. అయితే పరీక్షలు లేటుగా నిర్వహించినందున ఆ సమయం కంపన్సేట్ చేశారు. విదేశీ వైద్య విద్యార్థులు కొందరు ఆ దేశాల వైద్య కళాశాలల నుండి కంపన్సేట్ సర్టిఫికెట్లు తీసుకువచ్చినా వాటిపై ఎ.పి. మెడికల్ కౌన్సిల్ వివిధ రకాల అభ్యంతరాలను వ్యక్తపరుస్తూ ఆమోదించడం లేదు. విదేశీ వైద్య విద్యార్థుల సమస్యను వెంటనే పరిష్కరించి విలువైన సమయాన్ని కాపాడాలని, ఇప్పటికే ఐఎంఎ, ప్రైవేట్ నర్సింగ్ హోమ్ అసోసియేషన్, (అప్నా)రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. మన దేశంలో కరోనా సమయం రెండు సంవత్సరాలు మళ్లీ క్లర్క్‌షిప్ తర్వాత ఒక సంవత్సరం ఇంటర్న్‌షిప్ అంటే ఇప్పటికే ఆరున్నర ఏళ్లు చదివిన విద్యార్థులు మరో రెండు లేదా మూడేళ్లు చదవాల్సివస్తే 8 నుంచి 9 ఏళ్ల టైం పడుతుందని ఆందోళన వ్యక్తం అవుతుంది. క్లర్క్‌షిప్ చేసే విదేశీ వైద్యవిద్యార్థుల నుండి నెలకు 5 వేలు లేదా ఆలోపు ఫీజులు కూడా ఆ యా కళాశాలలు తీసుకోవచ్చు అని ఎన్ఎంసి ఆదేశాలలో పేర్కొంది. మూలిగే నక్క మీద తాటిపండు పడింది అన్న చందగా అసలే వారు ఆర్థిక సంక్షోభంలో వుంటే మళ్ళీ ఈ ఫీజులు ఏమిటో అని ఆవేదక వ్యక్తం చేస్తున్నారు. వీరి పరిస్థితి ఇలా ఉంటే ఇంకా ఎఫ్.ఎం.జి పరీక్ష రాసి పాస్‌గాని 80 నుంచి 85 విద్యార్థుల పరిస్థితిపై స్పష్టత లేదు. ఇక బ్యాంకుల్లో విద్యా రుణాలు తీసుకున్న వారికి గడువు ముగిసి రుణం రీపేమెంట్ చేయాల్సివస్తుంది. ప్రైవేట్‌గా అధిక వడ్డీకి తెచ్చి ఫీజులు కట్టిన వారి పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఈ నేపథ్యంలో ఎటు పాలుపోని స్థితిలో ఎఫ్ఎంజి విద్యార్థులు ధర్నాకు దిగారు. ఇప్పటికే మన ర్నాష్ట్రంలో ఎఫ్ఎంజిలు ఒక సంవత్సరం పైగా వృధాగా గడిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలం గడిచిపోతుందన్న ఆందోళనలో తాడో పేడో తేల్చే వరకు ఉద్యమం విరమించేది లేదని విద్యార్థులు పట్టుపట్టి కూర్చున్నారు. వారి ఆందోళనను, భవిష్యత్తును, ఆర్థిక, మానసిక పరిస్థితులను దృష్టిలో పెటుకొని కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించవలసిన అవసరం ఎంతో ఉంది. కేవలం ఎంబీబీఎస్‌తో మాత్రమే ప్రాక్టీస్ చేసే సాహసం నేడు ఎవరు చేయరు. చేయలేరు. అసంపూర్తి క్లినికల్ ట్రైనింగ్ పేరుతో ఒకటి, రెండు, సంవత్సరాలు క్లర్క్‌షిప్ చేయమనడం ఎంతవరకు సమంజసం కాదు. విదేశీ వైద్య విద్యార్థులు ఎఫ్ఎంజి లాంటి కఠినమైన పరీక్ష పాస్ అయి వస్తున్నారు. ఆ పరీక్షకు అర్హతను పొంది, ఉత్తీర్ణత సాధించిన వారందరికీ మనదేశంలో ఒకసంవత్సరం తప్పనిసరిగా ఇంటర్న్‌షిప్ చేయమనడం సమంజసం. ●

# ప్రజావాక్కు



## చిరు వ్యాపారులకు జి.ఎస్.టి నోటీసులా?

గత రెండు రోజులుగా కర్ణాటక రాజధాని బెంగళూరులోని కొన్ని ఏరియాల్లో చాలా మంది వీధి వ్యాపారులు, చిరువ్యాపారులు యుపిఐ క్యూఆర్ కోడ్ స్కానర్లు ప్రక్కన పడేసి నగదుఇవ్వాలని వినియోగదారులను కోరుతున్నారు. చాలాషాపుల ముందు నో యుపిఐ.. ఓన్లీక్యాష్ అనే బోర్డులుదర్శనమిస్తున్నాయి. రోజుకి సుమారు రూ.మూడు వేలు వ్యాపారంచేసి వచ్చే కొద్దిపాటి లాభంతో జీవిస్తున్న చిరు, చిన్న వ్యాపారులపై జి.ఎస్.టి అధికారులు తమ ప్రతాపం చూపిస్తున్నారు. జి.ఎస్.టి అధికారులు నుండి కొన్ని లక్షల రూపాయల పన్ను చెల్లింపు డిమాండ్‌తో చిన్న వ్యాపారుల్లో భయాందోళనలు తలెత్తుతున్నాయి. ఈ వ్యవహారం పై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వాణిజ్య పన్నుల శాఖకు దిశానిర్దేశం చేసి చిరు వ్యాపారులకు న్యాయం చేయాలి.

- దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

## ఆంధ్రప్రదేశ్ పత్రికను పునరుద్ధరించాలి

రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ ద్వారా కొన్ని దశాబ్దాలపాటు క్రమం తప్పకుండా ప్రచురితమైన ఆంధ్రప్రదేశ్‌మాసపత్రిక వైసీపీ హయాంనుండి నిలిచిపోయింది. ప్రభుత్వ పథకాల గురించిన పూర్తి సమాచారంతోపాటు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రసంస్కృతిని, సాహిత్యాన్ని, సమకాలీన పరిస్థితులను ప్రతిబింబించే కథనాలతో ఈ పత్రిక అతి తక్కువ ధరలో లభించేది. దీనిలో ప్రచురించబడేకథలు, కవితలు, సాహితీవ్యాసాలు పాఠకులనుఎంతగానో అలరించేవి. అలాంటిది రాష్ట్రం విడిపోయాక తొలి టీడీపీ పాలనలో ఈ పత్రికను పూర్తిగా ప్రభుత్వ సమాచారానికే పరిమితం చేసి కొనసాగించారు. తదనంతరం వైసీపీ ప్రభుత్వం దీన్ని పూర్తిగా ఆపేసింది.

- పి.వి.ప్రసాద్, విజయవాడ

## ఉద్యోగుల గ్రీవెన్స్ సెల్ నిర్వహించాలి

తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ప్రత్యేకంగా ఉద్యోగుల గ్రీవెన్స్ సెల్ నిర్వహించాలి. అటెండర్ నుండి ఐఏఎస్ అధికారి వరకు ఉద్యోగ సమస్యలు. ఉద్యోగ సంఘాల నాయకులు చెప్పే సమస్యల పరిష్కారం కోసం తప్పని సరిగా ఉద్యోగుల గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలి. ఇందులో ఉద్యోగ వికలాంగులకు సంబంధించిన సమస్యలు మహిళా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

## సేవల నుంచి తొలగించాలి

భారత వైమానిక దళంలో గత నాలుగు దశాబ్దాలుగా సేవలందిస్తున్న జగ్వార్ యుద్ధ విమానాలను క్రమంగా సేవల నుంచి తొలగించాల్సిన అవసరం కొనసాగుతోంది. 1980లలో ప్రవేశపెట్టిన ఈ విమానాలు అప్పట్లో విస్తృత స్థాయిలో ఉపయోగపడినప్పటికీ, ప్రస్తుతం మారుతున్న యుద్ధ పరిస్థితులకు ఇవి అనువుగా లేవని పలు వర్గాలు భావిస్తున్నాయి. ఈ విమానాల వేగం, రాడార్ వ్యవస్థలు, ఆధునిక దాడి సామర్థ్యాల్లో పరిమితులున్నాయి. ఆధునిక యుద్ధ విమానాలతో పోలిస్తే, ఇవి సామర్థ్యంలో వెనుకబడి ఉన్నట్లు తేలిపోతోంది. ప్రపంచ స్థాయిలో ఇతర దేశాలు తమ వైమానిక దళాలను ఆధునీకరిస్తున్న సమయంలో, పాతవైన వేదికలపై ఆధారపడటం సాంకేతికంగా వ్యూహాత్మకంగాఅనవసరం. ఇంకా, వీటినిర్వహణ ఖర్చులు అధికంగా మారాయి. విడిభాగాల కొరత, మరమ్మతుల ఆలస్యం, గడువు దాటి సేవలందిస్తున్న విమానాల వల్ల ఆపరేషనల్ సిద్ధతపై ప్రభావం పడే అవకాశం ఉంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## విద్యా వ్యవస్థకి పట్టుకొమ్మలు

ఏ రాష్ట్రంలో అయిన ప్రభుత్వ పాఠశాలల్లో అయిన ప్రైవేట్ స్కూల్స్‌లో అయిన ప్రాథమిక పాఠశాలలే మూలం. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య మరింత పెరగాలి అంటే సమాజంలో ప్రభుత్వ పాఠశాలల పట్ల నెలకొన్న అపోహలు తొలగించాలి. అందుకు ప్రధాన బాధ్యత ఉపాధ్యాయులదే. ఇందులో స్కూల్ అసిస్టెంట్ యస్.జి.టి ఇద్దరి భాగస్వామ్యం తప్పనిసరిగా ఉండాలి. బడిబాట కార్యక్రమంలో అందరు టీచర్లు కలిసి పాల్గొనాలి. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంటేనే ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుంది.

- రావుల రామ్మోహన్ రెడ్డి, హైద్రాబాద్

## పాచి పట్టిన నీరు పొలాలకా?

రైతుకు జీవనాధారం పంట అటువంటి పంటలను రైతులు వర్షాధారంగా నదులు, కాలువ నీటిని వినియోగించి పంటలు పండిస్తారు. ఐతే బేసిన్‌ల ద్వారా నిలువ ఉంచిన నీటిని ఎత్తిపోయడం ద్వారా వచ్చే నీరు నాచుతో పాచి నీరుగా మారుతుంది. పైపుల ద్వారా నీరు నిలువ ఉంటే పాచి పట్టిన నీరుగా మారుతుంది. కావున ప్రభుత్వాలు పాచి నీటిని శుద్ధి చేసి పొలాలకు అందిస్తే బాగుంటుంది.

-డి. చాంద్ బాషా, కర్నూలు

మన వి


ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# వర్షాకాల సమావేశాల్లోనే జస్టిస్ వర్మపై అభిశంసన!





## 100 మందికిపైగా ఎంపీల సంతకాలు

## కరెన్సీ నోట్ల గుట్టల కేసు

**న్యూఢిల్లీ,జూలై 20:** జడ్జిఇంట్లో నోట్లకట్టల వ్యవహారంలో అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మపై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టేందుకు కేంద్రం నిర్ణయించింది. ఇప్పటికే ఆయనపై ప్రవేశపెట్టిన తీర్మానానికి 100 మందికిపైగా ఎంపిలు సంతకాలుచేసారని కేంద్ర మంత్రి కిరెణ్ రిజిజు చెప్పారు. ఇప్పటికే కొల్లిజియం సిఫారసుచేయడం, మాజీ చీఫ్‌జస్టిస్ సంజీవ్‌ఖన్నా హయాంలో ప్రభుత్వానికి ఆయన్ను తొలగించాలని సిఫారసులుచేయడం జరిగాయి. దీనికి ముందు ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన కమిటీ జస్టిస్ వర్మ, అటు పోలీసులు మొత్తం అందరినుంచి వాంగ్మూలాలను సేకరించింది. త్రిసభ్య కమిటీ ఇచ్చిన నివేదిక మేరకు చీఫ్‌జస్టిస్ ఇచ్చి, సంజాయిషీ నోటీసులకు వర్మ జవాబులు ఇవ్వలేదు. పైగా ఇపుడు అభిశంసన తీర్మానంపై ఆయన సుప్రీం కోర్టు మెట్లెక్కారు. ఆయన పిటిషన్ విచారణకు రావాల్సి ఉంది. ఈతరుణంలో ఈసమావేశాల్లోనే జస్టిస్ వర్మపై అభిశంసన తీర్మానం ప్రవేశ పెట్టడం, ఆ తీర్మానంపై చర్చించడం ఆపై పార్లమెంటు నిర్ణయం వంటివి వెలువడనున్నాయి. మార్చి 14న జస్టిస్ వర్మ వెకేషన్‌కు వెళ్లగా ఆయన నివాసంలో అగ్ని ప్రమాదం జరిగింది. మంటలు ఆర్పేందుకు వచ్చిన ఫైర్ సిబ్బందికి ఆయన ఇంట్లో కాలిపోయిన నోట్ల కట్టలు దొరికాయి. ఈ విషయాన్ని ఎవరికి చెప్పవద్దని జస్టిస్ వర్మ కుమార్తె వారికి చెప్పారు.దీంతో ఈ విషయాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకుంది. వెంటనే సుప్రీంకోర్టు కొలీజియం ఆయన్ను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేసి ఎలాంటి న్యాయపరమైన బాధ్యతలు అప్పగించలేదు. త్రిసభ్య కమిటీ విచారణ జరిపింది. ఈ కమిటీలో పంజాబ్, హరియాణా హైకోర్టు దిరి జస్టిస్ షీల్ నాగు, హిమాచల్ ప్రదేశ్ జస్టిస్ జీఎస్ సంధవాలియా, కర్నాటక హైకోర్టు అనుశివరామన్‌తో ఈ కమిటీ ఏర్పాటైంది. పదిరోజుల తర్వాత జస్టిస్ వర్మపై వచ్చిన ఆరోపణలు నిజమేనని కమిటీ రిపోర్టు నిర్ధరించింది. ఆ రిపోర్టు ఆధారంగా జస్టిస్ సంజీవ్ ఖన్నా మే 8న ఆయనపై చర్యలు తీసుకోవాలని రాష్ట్రపతికి, ప్రధాన మంత్రికి లేఖ రాశారు. 25 పేజీల రిపోర్టు కాపీని దిల్లీ హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉపాధ్యాయ సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఈ నివేదిక ఆధారంగా ప్రస్తుతం పార్లమెంట్‌లో జస్టిస్ వర్మపై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టేందుకు రంగం సిద్ధమైంది. ఇందుకోసం ఎంపీల సంతకాల సేకరణ ప్రక్రియను ప్రారంభించారు. న్యాయమూర్తుల అభిశంసన ప్రక్రియ జడ్జెస్ ఎంక్వైరీ యాక్ట్ 1968 ప్రకారం జరుగుతుంది. ఈ ప్రక్రియ చాలా కఠినంగా, వివిధ దశల్లో ఉంటుంది. మొదటగా పార్లమెంటులో అభిశంసన తీర్మానం ప్రవేశపెడతారు. దీన్ని ఏ సభలోనైనా ప్రవేశపెట్టవచ్చు. లోక్‌సభలో కనీసం 100 మంది సభ్యులు సంతకం చేసిన నోటీసును స్పీకర్‌కుఇవ్వాలి. రాజ్యసభలో కనీసం 50 మంది సభ్యులు సంతకం చేసిన నోటీసును ఛైర్మన్‌కు ఇవ్వాలి.

తీర్మానాన్ని ఆమోదించాక స్పీకర్ లేదా ఛైర్మన్ ముగ్గురు సభ్యుల విచారణ కమిటీని ఏర్పాటు చేస్తారు. ఈ కమిటీలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి లేదా భారత ప్రధాన న్యాయమూర్తి, ఏదైనా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఒక సీనియర్ న్యాయ నిపుణుడు ఉంటారు. పార్లమెంటులో జరిగే ప్రక్రియలో ఈ కమిటీ సదరు న్యాయమూర్తిపై వచ్చిన ఆరోపణలపై విచారిస్తుంది. సాక్ష్యాలను సేకరిస్తుంది. అంతే కాకుండా ఆ న్యాయమూర్తికి తన వాదనను వినిపించేందుకు అవకాశం కల్పిస్తుంది. విచారణ పూర్తయిన తర్వాత, కమిటీ తన నివేదికను స్పీకర్ లేదా ఛైర్మన్‌కు సమర్పిస్తుంది. నివేదికలో న్యాయమూర్తిపై వచ్చిన ఆరోపణలు నిజమని తేలితే అభిశంసన తీర్మానాన్ని పార్లమెంటులో చర్చకు పెడతారు. చర్చ అనంతరం ఉభయ సభలు తీర్మానాన్ని ప్రత్యేక మెజారిటీతో ఆమోదించాలి. అంటే సభకు కనీసంగా 50 శాతం మంది హాజరవ్వాలి. అందులో మూడింట రెండొంతుల మెజారిటీ ఓట్లు పడితే ఆ సభలో తీర్మానం ఆమోదం పొందుతుంది. తర్వాత, తీర్మానాన్ని మరొక సభకు పంపుతారు. అక్కడా ప్రత్యేక మెజారిటీతో ఆమోదం పొందాల్సి ఉంటుంది. రెండు సభలు తీర్మానాన్ని ఆమోదించిన తర్వాత దాన్ని రాష్ట్రపతికి పంపిస్తారు. రాష్ట్రపతి అప్పుడు ఆ న్యాయమూర్తిని పదవి నుంచి తొలగించడానికి ఆదేశాలు జారీ చేస్తారు. ఈ అంశంలో ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం ఉండదు. ఇది పూర్తిగా పార్లమెంటులో జరిగే ప్రక్రియ. ఈ విషయంలో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు స్పష్టత నిచ్చారు.

# మానాన్నే మళ్లీ బీహార్ సీఎం

## సిఎం నితీష్ తనయుడు నిశాంత్



**పాట్నా,జూలై 20:** బీహార్ ఈ ఏడాది చివరిలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తుందని, తన తండ్రి నితీష్ కుమార్ తిరిగి ముఖ్యమంత్రి అవుతారని ఆయన కుమారుడు నిషాంత్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రానికి, ప్రజలకు నితీష్ ఎంతో చేశారని, ప్రజలు ఎన్డీయేను గెలిపించి మరోసారి ప్రజాసేవచేసే అవకాశం ఆయన కల్పిస్తారని పాట్నాలో ఆదివారంనాడు మీడియాతో మాట్లాడుతూ నిషాంత్ చెప్పారు. మళ్లీ మా నాన్నగారే సిఎం అవుతారు. ప్రభుత్వాన్ని ఎన్డీయే ఏర్పాటుచేస్తుంది. గత 20ఏళ్లుగా ఆయనచేసిన సేవలు, పనులకు గుర్తింపుగా మరోసారి నితీష్ కుమార్‌ను భారీ మెజారిటీతో ప్రజలు గెలిపిస్తా రనే నమ్మకం నాకుంది అని నిశాంత్ తెలిపారు.

రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా సుదీర్ఘ కాలంగా సేవలందించిన 75 ఏళ్ల నితీష్ కుమార్ మరో సారి అధికారాన్ని ఆశిస్తున్నారు. బిజెపి సారథ్యంలోని ఎన్డీయేలో జెడియూ, చిరాగ్ పాశ్వాన్ లోక్ జనశక్తి పార్టీ భాగస్వామిగా ఉన్నాయి. ఈసారి నితీష్ కుమార్ ఇండియా కూటమి నుంచి గట్టిపోటీని ఎదుర్కొనే అవకాశం ఉంది. తేజస్వి యాదవ్ రాష్ట్రీయ జనతాదళ్, కాంగ్రెస్, వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ, వామపక్షాలు ఇండియా కూటమిలో ఉన్నాయి. నితీష్ పాపురాలిటీ తగ్గుతోందని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయేకు ఆయన సారథ్యం వహించక పోవచ్చని ప్రచారం జరుగుతోంది. అయితే బీహార్‌లో ఎన్డీయేకు నితీష్ సారథ్యం వహిస్తారని బిజెపి స్పష్టత ఇచ్చింది. నితీష్ కుమార్ 2013లో ఎన్డీయేను విడిచిపెట్టి తన చిరకాల ప్రత్యర్థి లాలూ ప్రసాద్ యాదవ్‌తో చేతులు కలిపారు. 2017లో ఆర్జేడీని వీడి తిరిగి ఎన్డీయేలోకివచ్చారు. 2022లో తిరిగి ఎన్డీయేతో తెగతెంపులు చేసుకుని ఆర్జేడీతో కలిసారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు మరోసారి ఆయన పీఎం మోడీక్యాంపులోకి వచ్చిచేరారు.

# వర్షాకాల సమావేశాల్లో ఎన్డీయేను ఇరుకునపెట్టే వ్యూహం


## విపక్ష కూటమి వర్చువల్ భేటీ

**న్యూఢిల్లీ,జూలై 20:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభం కానున్న నేపథ్యంలో బిజెపినేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టడానికి ఇండియా కూటమి సన్నద్ధమైంది. ఈ మేరకు ప్రత్యేక వ్యూహాన్ని రూపొందించింది. ఇండియా కూటమి కూటమికి చెందిన 24 రాజకీయ పార్టీల నేతలు వర్చువల్‌గా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ నిలిపివేత, ట్రంప్ మధ్యవర్తిత్వం, బీహార్‌లో కొనసాగుతున్న ఓటర్ల ప్రత్యేక పునర్విశ్లేషణ ప్రక్రియ తదితర అంశాలపై పార్లమెంట్‌లో కేంద్రాన్ని నిలదీయాలని నిర్ణయించారు. మీటింగ్ తర్వాత సమావేశానికి సంబంధించిన వివరాలను కాంగ్రెస్‌నేత ప్రమోద్ తివారీ మీడియాకు వెల్లడించారు. మోడీ ప్రభుత్వం దేశ ప్రయోజనాలను విస్మరిస్తున్న తీరుకు వ్యతిరేకంగా తాము ఐక్యంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో సమస్యలను లేవనెత్తుతామని తివారి స్పష్టంచేసారు. పార్లమెంట్ సజావుగా జరగాలని, తమ ప్రశ్నలకు మోడీ ప్రభుత్వం సమాధానం చెప్పాలని తాము కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సమావేశాల్లో లేవనెత్తాల్సిన 8 ప్రధాన అంశాలపై తీర్మానం చేశారు. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి సంబంధించి ప్రభుత్వ వైఫల్యంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించడం. ఆపరేషన్ సింధూర్‌ను ఆకస్మికంగా నిలిపివేయడం వెనుక గల కారణాలు ఏంటి?కాల్పుల విరమణ, వాణిజ్యంపై డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై వివరణ కోరడం. బిహార్‌లో ఎస్ఐఆర్ పేరుతో జరుగుతున్న ఓటుబ్యాంకు రాజకీయాలపై నిలదీయడం పాకిస్థాన్, చైనా, గాజా వంటి అంశాలపై ప్రభుత్వ విదేశాంగ విధానాన్ని ప్రశ్నించడం. డీలిమిటేషన్ ప్రక్రియ, దాని ప్రభావాలపై చర్చ. దేశంలో దళితులు, వెనుకబడిన తరగతులు, గిరిజనులు, మహిళలు, మైనారిటీ వర్గాలపై జరుగుతున్న అణచివేత సమస్యలను లేవనెత్తడం. అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై ప్రభుత్వం నుంచి సమాధానం కోరడం. అలాగే, న్యాయమూర్తులు యశ్వంత్ వర్మ, శేఖర్ యాదవ్ కేసులను కూడా లేవనెత్తాలని కాంగ్రెస్, ఇతర విపక్ష పార్టీల నాయకులు ఈ సమావేశంలో తీర్మానించారు. బీహార్‌లో ఎస్ఐఆర్ పేరిట లక్షలాదిగా ఓటర్ల పేర్లు తొలగించడం కేంద్రం దుశ్చర్యగా విమర్శలు గుప్పించారు. ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసే కుట్రగా దీన్ని పేర్కొన్నారు. ఇదొక అప్రకటిత ఎమర్జెన్సీగా అభివర్ణించారు. చైనా, పాకిస్థాన్, గాజా వంటి కీలక అంతర్జాతీయ అంశాల్లో భారత ప్రభుత్వం మోనంగా ఉండటం విదేశాంగ పరంగా పరాజయమేనని కూటమి అభిప్రాయపడింది.

ఈ అంశాలపై పార్లమెంట్‌లో చర్చలు జరిగితే ప్రధాని నేరుగా హాజరై సమాధానం చెప్పాలని ఇండియా కూటమి నేతలు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఇటీవల కేరళలో చేసిన వ్యాఖ్యలపై లెఫ్ట్ పార్టీలు అసహనం వ్యక్తం చేశాయి. ఆర్ఎస్ఎస్, లెఫ్ట్‌ను ఒకే గాటిన కట్టి రాహుల్ గాంధీ విమర్శించడంతో ఈ సమావేశంలో కమ్యూనిస్టు నేత డి.రాజా అభ్యంతరంచెప్పారు.

నిఘా వైఫల్యం ఉన్నప్పటికీ ఐబీచీఫ్‌కు ఎందుకు పదవీకాల పొడిగింపు ఇచ్చారనిప్రశ్నించారు. చోటుచేసుకుంది. కొంతకాలంగా ఇండియా కూటమికి దూరంగా ఉన్న టిఎంసి ఈ మీటింగ్‌కు హాజరైంది. వాస్తవానికి ఈ సమావేశం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో జరగాల్సి ఉంది, అయితే కొంతమంది ముఖ్య నాయకులు దిల్లీలో అందుబాటులో లేకపోవడం వల్ల వర్చువల్‌గా నిర్వహించారు.

# మహారాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో ఫోన్‌లో 'రమ్మీ' ఆడిన మంత్రి!



**ముంబై, జూలై 20:** ఒకపక్క అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండగా.. మరోవైపు ఆ రాష్ట్ర మంత్రి తన సెల్‌ఫోన్‌లో ఆన్‌లైన్ గేమ్‌లు ఆడారు. దీనిని సంబంధించిన విడియో నెట్టింట వైరల్‌గా మారింది. మహారాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి మాణిక్‌రావు కోకాటె.. అసెంబ్లీ సమావేశాల సమయంలో ఫోన్‌లో రమ్మీ ఆడుతున్నారని ఎన్సీపి (శరద్‌పవార్‌వర్గం) ఎమ్మెల్యే రోహిత్ పవార్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా దీనికి సంబంధించిన విడియోలను పంచుకున్నారు.రైతులు, వ్యవసాయ సమస్యల గురించి సభలో చర్చలు జరుగుతున్న సమయంలో రాష్ట్ర మంత్రి ఇలా వ్యవహరించారని మండిపడ్డారు. రాష్ట్రంలో రోజుకు 8 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. అయినప్పటికీ వ్యవసాయ మంత్రి వీటన్నింటినీ పట్టించుకోకుండా ఆటలాడాతున్నారని ధ్వజమెత్తారు. ఇలాంటి మంత్రులున్న ప్రభుత్వం.. పంట బీమా, రుణ మాఫీ, మద్దతు ధరల కోసం రైతులుచేసే డిమాండ్లను ఏం వింటుందని విమర్శించారు. అప్పుడప్పుడు పేద రైతుల పొలాలను సందర్శించండి మహారాజా అంటూ కోకాటెపై.. రోహిత్ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. దీనికిసంబంధించిన విడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి.

ఇక, ఈ సంఘటనపై ప్రతిపక్షాలు భగ్గుమంటున్నాయి. ప్రభుత్వానికి రైతుల సమస్యలు పట్టడం లేదని ఆరోపిస్తున్నాయి. దీనిపై శివసేన (యుబిటి) ప్రతినిధి ఆనంద్ దూబే స్పందిస్తూ.. మంత్రి కోకాటె రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌కు విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి ఇప్పటివరకూ స్పందించలేదు.



## 20యేళ్లుగా కోమాలో ఉన్న యువరాజు కన్నుమూత


**దుబాయి,జూలై 20:** కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి గడిచిన 20 ఏళ్లుగా కోమాలో ఉన్న సౌదీ యువరాజు అల్ వలీద్ బిన్ ఖాలీద్ బిన్ తలాల్ అల్ సౌద్ మృతిచెందారు. ఆయన వయసు ప్రస్తుతం 36 సంవత్సరాలు. శనివారం అల్ వలీద్ కన్నుమూశాడని 'గ్లోబల్ ఇమామ్స్ కౌన్సిల్ తెలిపింది. సుదీర్ఘ కాలం కోమాలో ఉండటంవల్ల అల్ వలీద్ 'స్లీపింగ్ ప్రిన్స్'గా వార్తల్లో నిలిచారు. దాదాపు ఇరవై ఏళ్లుగా కోమాలో ఉన్న ఆయన సుదీర్ఘ పోరాటం తర్వాత కన్నుమూశారని గ్లోబల్ ఇమామ్స్ కౌన్సిల్ పేర్కొంది. ఈ విషాదం నుంచి ఆ కుటుంబం త్వరగా కోలుకునే ధైర్యం భగవంతుడు ఇవ్వాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపింది. సౌదీ యువరాజు అల్ వలీద్ 1990 ఏప్రిల్‌లో సౌదీ రాజు ఖాలీద్ బిన్ తలాల్ అల్ సౌద్ దంప తులకు జన్మించారు. ఆయన బ్రిటన్‌లోని మిలి టరీ కాలేజీలో చదువుతుండగా 2005లో ఓ కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. అప్పటి నుంచి కోమాలో ఉన్న యువరాజుకు రియాద్ లోని ఓఆస్పత్రిలో చికిత్స అందించారు. ట్యూబ్ ద్వారా ఆహారం అందించేవారు. వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నప్పటికీ కోలుకునే అవకాశం లేదని భావించి 2015లో దాన్ని తొలగించాలని వైద్యులు సిఫార్సు చేశారు. ఆయన తండ్రి అందుకు నిరాకరించారు. అయితే 2019 లో వలీద్ ఒసారి కోలుకున్నట్లు కనిపించారు. కానీ ఆ తర్వాత ఆయన స్థితిలో ఎలాంటి పురోగతి కనిపించలేదు.

## నాలుగేళ్లుగా సహజీవనం పెళ్లిదాకా వచ్చేసరికి హత్య

**అహ్మదాబాద్,జూలై 20:** ఆమె అసిస్టెంట్ సబ్ ఇన్ స్పెక్టర్, అతడేమో సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్.. నాలుగు సంవత్సరాలుగా సహజీవనం చేస్తున్నారు. కొంతకా లంగా ఇద్దరి మధ్య గొడవలు జరుగుతుండగా శుక్రవారం రాత్రి ఆగ్రహం పట్టలేక ప్రియుడు ఆమె గొంతుకోసి చంపేసి ఆమె పనిచేస్తున్న పోలీస్ స్టేషన్‌కే వెళ్లి లొంగిపోయాడు. పోలీసుల వివరాల ప్రకారం అంజార్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న అరుణాబెన్ సతుభాయ్ జాదవ్‌కు దిలీప్ డాంగ్చియాతో ఇన్ స్టాలో పరిచయం ఏర్పడింది. అదికాస్తా ప్రేమగా మారడంతో ఇద్దరూ సహజీవనం చేస్తున్నారు. వివాహం చేసుకునే విషయంపైనే రెండురోజులక్రితం ఇరువురి మధ్య గొడవ జరిగింది. దీంతో దిలీప్ ఆగ్రహం పట్టలేక అరుణా బెన్ గొంతుకోశాడు.

# రష్యాతో శాంతిచర్చలకు సిద్ధమే!

## ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లదీమిర్ జెలెన్‌స్కీ



**క్యీవ్, జూలై 20:** రష్యాతో గత నెలలో నిలిచిపోయిన శాంతి చర్చలను తిరిగి ప్రారంభించేందుకు తాము ఉన్నామని ఉక్రెయిన్ ప్రకటించింది. రష్యాతో వచ్చే వారం చర్చలు జరిపేందుకు అధికారిక ప్రతిపాదనను పంపినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లదిమిర్ జెలెన్ స్కీ ధృవీకరించారు. దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ చర్చల ప్రతిపాదనను జాతీయ భద్రతా మండలి కార్యదర్శి రుస్తెమ్ ఉమెరోవ్ రష్యా ప్రతినిధులకు అందించారని జెలెన్ స్కీ తన ప్రసంగంలో తెలిపారు. యుద్ధాన్ని ఆపేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయని పేర్కొన్నారు. అయితే ఈ విషయంలో రష్యా వెనుకడుగు వేస్తోందని విమర్శించారు. రష్యా ఇలా చేయడం ఒత్తిడిపెంచి ఆపాలని స్పష్టం చేశారు. పుతిన్‌తో ముఖాముఖి సమావేశానికి తాను సిద్ధంగా ఉన్నానని జెలెన్ స్కీ పునరుద్ఘాటించారు. ఇరు దేశాల మధ్య శాశ్వత శాంతి కోసం నాయకత్వ స్థాయిలో ఒక సమావేశం అవసరమని ఆయన నొక్కి చెప్పారు. అయితే అమెరికా ఒత్తిడితోనే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ ఈ చర్చల ప్రతిపాదనను తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. ఈ ప్రతిపాదనపై రష్యా ఇప్పటివరకు ఎటువంటి స్పందన ఇవ్వలేదు. అయితే క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ ఇటీవల మాట్లాడుతూ, శాంతి చర్చలకు మరింత ఇరు దేశాల నాయకుల మధ్య మరింత చొరవ అవసరమన్న జెలెన్ స్కీ వ్యాఖ్యలతో తాము ఏకీభవిస్తున్నామన్నారు. ఉక్రెయిన్ మాజీ రక్షణ మంత్రి అయిన రుస్టెమ్ ఉమెరోవ్ గతవారం నేషనల్ సెక్యూరిటీ అండ్ డిఫెన్స్ కౌన్సిల్ అధిపతిగా నియమితులయ్యారు. ఈ క్రమంలో చర్చలకు సంబంధించిన బాధ్యతలను ఆయనకు అప్పగించారు. ఈ ఏడాది ప్రారంభంలో టర్కీలో జరిగిన రెండు రౌండ్ల చర్చల్లోనూ ఆయన తన దేశ ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించారు. అయితే ఆ చర్చలు పెద్దగా సత్ఫలితాలను ఇవ్వలేదు.

# హెచ్1బి వీసా జారీలో సవరణలు

## శ్వేతసౌధం పరిశీలనలో ప్రతిపాదనలు




**వాషింగ్టన్,జూలై 20:** హెచ్1బీ వీసాల ప్రక్రియలో మరో కొత్త అంశం తెర ముందుకు వచ్చింది. వీసా జారీ ప్రక్రియలో ట్రంప్ కార్యవర్గం కీలక మార్పులు చేసేందుకు నిర్ణయించింది. హెచ్1బీ వీసాలు జారీ పరిమితిని ఏటా కాంగ్రెస్ నిర్ణయిస్తుంది. ప్రస్తుతం అది 85,000గా ఉన్నాయి. వీటిలో 20,000 వీసాలు మాస్టర్స్ డిగ్రీ చేసిన వర్కర్ల కోసం రిజర్వు చేశారు. ఎలాంటి పరిమితిలేని వీసాలను విశ్వవిద్యాలయాల్లోని పరిశోధన విభాగాల కోసం జారీ చేస్తారు. ప్రస్తుతం ప్రాసెస్‌ను నిలిపివేసినట్లు యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ ప్రకటించింది. అందుకు కారణం 2026 వార్షిక పరిమితికి తగినన్ని దరఖాస్తులు రావడం. దీంతో 2026 ఏడాదికి లాటరీ విధానం బహుశా ఉండకపోవచ్చు. లాటరీ విధానంలో వీసా దారులను ఎంపిక చేస్తారు. ఈ ప్రక్రియ తర్వాత ఆయా కంపెనీలు తమకు వచ్చిన వీసాల్లో, అక్టోబర్ నాటికి విధుల్లో చేరాల్సిన కార్మికుల దరఖాస్తులను సమర్పిస్తాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చాక సదరు పోస్టుకు ఆఫర్ చేస్తున్న వేతనం ఆధారంగా వీసాలు జారీ చేశారు. కంపెనీలు మరింత మంది ఉన్నత స్థాయి నిపుణులను నియమించుకొనేలా ప్రోత్సహించేందుకు ఈ విధానం అమలు చేసినట్లు తెలుస్తోంది. నాడు బై అమెరికన్, హైర్ అమెరికన్ అనే కార్యక్రమం కింద దీన్ని నిర్వహించారు. 2021లో జో బైడెన్ అధికారంలోకి వచ్చాక దీన్ని పక్కనపెట్టారు. ఇక తాజాగా డీహెచ్ఎస్ పంపిన ప్రతిపాదనపై దాదాపు వెయ్యి వరకు పబ్లిక్ కామెంట్లు వచ్చినట్లు సర్వేలు పేర్కొంటున్నాయి. దీని వల్ల హెచ్1బీ ఉద్యోగులు తక్కువగా అందుబాటులో ఉంటారని తెలిపింది. వాస్తవానికి ఏ కంపెనీకి అనుకూలంగా నిర్ణయాలు తీసుకోకుండా ఈ లాటరీ విధానాన్ని తీసుకొచ్చారు. కానీ పెద్ద పెద్ద కంపెనీలు అధిక దరఖాస్తులు చేసి ఎక్కువ వీసాలను దక్కించుకొంటున్నాయి. ఈ లాటరీ విధానాన్ని తొలగించాలని ఈ ఏడాది జనవరిలో ఇన్‌స్టిట్యూట్ ఫర్ ప్రోగ్రెస్ అనే మేధోమథన సంస్థ సూచించింది. జీతం, సీనియార్టీ ఆధా రంగా వీసాలు జారీ చేస్తే వాటి ఆర్థిక విలువ 88 శాతం పెరుగుతుందని తెలిపింది.

# మూడుదేశాల్లో తీవ్రస్థాయి భూకంపాలు!

**మాస్కో, జూలై 20:** రష్యాలో భారీ భూకంపం సంభవించింది. రష్యా తీరంలో సంభవించిన ఈ భూకంపం తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 7.4గా నమోదైనట్లు అధికారులు తెలిపారు. పెట్రోపవ్‌లావ్‌స్కీ కామ్చాట్కా నగరానికి 144 కిలోమీటర్ల దూరంలో పసిఫిక్ మహాసముద్రంలో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అంతకుముందు దాదాపు గంట వ్యవధిలోనే ఈ ప్రాంతంలో ఐదు భూకంపాలు నమోదైనట్లు యూఎస్‌జియోలాజికల్‌సర్వే తెలిపింది. వీటిలో 7.4 తీవ్రతతో కూడిన భూకంపం వల్ల సునామీ వచ్చే అవకాశం ఉన్నట్లు హెచ్చరించింది. దీంతో కమ్చట్కా ద్వీపకల్పానికి పసిఫిక్ సునామీ హెచ్చరికల కేంద్రం సునామీ హెచ్చరికలు జారీ చేసింది. ముందు జాగ్రత్తగా పౌరులు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాల్సిందిగా అధికారులు సూచించారు. ఇరాన్‌లో కూడా మరోసారి భూమి కంపించింది. ఆదివారం తెల్లవారుజామున ఉత్తర ఇరాన్‌లో భూకంపం వచ్చింది. దీని తీవ్రత 5.2గా నమోదయింది. మరోవైపు తజికిస్తాన్‌లో కూడా భూకంపం వచ్చింది. తెల్లవారుజామున 1 గంటలకు భూమి కంపించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 4గా నమోదైంది. ఈ భూకంప కేంద్రం 160 కిలోమీటర్ల లోతులో ఉంది. భారత్‌లోని అస్సాంలోనూ భూ ప్రకంపణలు చోటుచేసుకున్నాయి. నాగావ్ జిల్లాలో2.9 తీవ్రతతో భూకంపం వచ్చింది.

# సంక్షిప్తంగా..

## మలేరియాపై పోరుకు ఐసిఎంఆర్ కొత్త టీకా



**న్యూఢిల్లీ, జూలై 20:** మలేరియాను నివారించడంలో భారత్ మరో ముందడుగు వేసింది. దేశంలో మలేరియాను రూపుమాపడానికి ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎంఆర్) అడ్‌ఫాల్సీవాక్స్ అనే బహుళ-దశల స్వదేశీ రీకాంబినెంట్ చిమెరిక్ మలేరియా వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేస్తోంది. ఐసిఎంఆర్ దాని ప్రాంతీయ వైద్య పరిశోధనా కేంద్రం, భువనేశ్వర్ (ఆర్ఎంఆర్‌సిబిబి), నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మలేరియా రీసెర్చ్ (ఎన్ఐఎంఆర్) ద్వారా బయో టెక్నాలజీ విభాగం-నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇమ్యునాలజీ (డిబిటి-ఎన్ఐఐ) భాగస్వామ్యంతో అడ్‌ఫాల్సీ వాక్స్ అనే రీకాంబినెంట్ చిమెరిక్ మలేరియా వ్యాక్సిన్‌ను అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేస్తోంది. అడ్‌ఫాల్సీవాక్స్ అనేది మలేరియాను కలిగించే ప్లాస్మోడియం పరాన్నజీవి రక్తంలో ఉన్న రెండు క్లిష్టమైన దశలను లక్ష్యంగా చేసుకోవడానికి రూపొందించిన మొట్టమొదటి చిమెరిక మలేరియా వ్యాక్సిన్.

## విమానం గాల్లో ఉండగానే ఇంజిన్‌లో మంటలు..

**వాషింగ్టన్, జూలై 20:** విమానం గాల్లో ఉండగానే ఇంజిన్‌లో మంటలు చెలరేగిన ఘటన అమెరికాలో చోటుచేసుకుంది. లాస్‌ఏంజెలెస్ నుంచి అట్లాంటాకు వెళ్తున్న డెల్టా ఎయిర్‌లైన్స్ విమానంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పైలట్లు అప్రమత్తమవడంతో విమానం వెనక్కి మళ్లించి సురక్షితంగా ల్యాండ్ చేశారు. డెల్టా ఎయిర్‌లైన్‌కు చెందిన బోయింగ్ 767-400 విమానం లాస్‌ఏంజెలెస్ నుంచి అట్లాంటాకు బయలుదేరింది. విమానం టేకాఫ్ అయిన కొద్ది సేపటికే సమస్య ఎదురైంది. ఎడమవైపు ఇంజిన్‌లో మంటలు చెలరేగాయి. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన పైలట్లు ఎయిర్‌పోర్టు సిబ్బందికి సమాచారం ఇచ్చి.. విమానాన్ని వెనక్కి మళ్లించారు. లాస్‌ఏంజెలెస్ ఎయిర్‌పోర్టులో సురక్షితంగా దిగింది. అగ్నిమాపక సిబ్బంది వెంటనే రన్‌వేపైకి వచ్చి మంటలను అదుపు చేశారు.

## పాకిస్థాన్‌లో వర్ష బీభత్సం..200 మంది మృతి



**ఇస్లామాబాద్, జూలై 20:** పొరుగు దేశం పాకిస్థాన్‌లో వర్ష బీభత్సం కొనసాగుతోంది. వర్షకాలంలో ముఖ్యంగా జూన్ నుంచి సెప్టెంబరు మధ్యకాలంలో పాక్‌లో భారీ వరదలు సంభవిస్తాయి. ఫలితంగా కొండచరియలు విరిగిపడుతూ, అపారనష్టం వాటిల్లుతుంటుంది. ఇటువంటి విపత్తుల కారణంగా ఇటీవలి కాలంలో 100 మంది పిల్లలతోసహా 200 మందికిపైగా జనం ప్రాణాలను కోల్పోయారని, 500 మందికిపైగా జనం గాయపడ్డారని పాకిస్థాన్ జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ (ఎన్ఎండిఎ) తెలిపింది. అధికారిక డేటా ప్రకారం.. పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో అత్యధికంగా 123 మంది మృత్యువాత పడ్డారు. అలాగే ఖైబర్ పఖ్తుంఖ్వాలో 40, సింధ్‌లో 21, బలూచిస్తాన్‌లో 16, ఇస్లామాబాద్, పాకిస్థాన్ ఆక్రమిత జమ్మూకాశ్మీర్‌లో ఒక్కొక్కరు చొప్పున మృతి చెందారు.

## పెట్రోలింగ్ చేస్తున్న ఏడుగురు పోలీసులు అదృశ్యం..

**పెషావర్, జూలై 20:** పెట్రోలింగ్ విధుల్లో ఉన్న ఏడుగురు పోలీసు సిబ్బంది అదృశ్యమైన ఘటన పాక్‌లో కలకలం రేపుతోంది. పాకిస్థాన్‌లోని వాయువ్య ఖైబర్ పఖ్తుంఖ్వాలో ఈ ఘటన చోటుచేసుకుంది. అఫ్ఘానిస్థాన్ సరిహద్దులోని సౌత్ వాజిరిస్థాన్ జిల్లాలో రెండు వేర్వేరు ప్రదేశాల్లో ఏడుగురు పోలీసులు అదృశ్యమైనట్లు పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. వీరిలో ముగ్గురు లద్దా పోలీసుస్టేషన్‌కు చెందినవారు కాగా.. మిగతా నలుగురు సర్వాకై పోలీస్ స్టేషన్ పరిధిలోని టాంగా-చాగ్మాలి ప్రాంతంలో అదృశ్యమైనట్లు పేర్కొన్నారు. వీరిలో ఒక సబ్‌ఇన్‌స్పెక్టర్ కూడా ఉన్నట్లు తెలిపారు. పెట్రోలింగ్ చేస్తున్న సమయంలోనే వీరంతా అదృశ్యమయ్యారన్నారు. వారి ఆచూకీకి సంబంధించి తమకు ఇంకా ఎలాంటి అందలేదని పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు.



ఆదివారం కుమారస్వామి దర్శనం కోసం నిరీక్షిస్తున్న భక్తులు

# ఆడికృత్తికకు పోటెత్తిన భక్తులు

**శ్రీకాళహస్తి,జూలై 20 ప్రభాతవార్త:**శ్రీకాళహస్తీశ్వ రాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న కుమారస్వామి కొండపై వెలసిన సుబ్రమణ్యం స్వామి కొండపై ఆడికృత్తిక సందర్బంగా ఐదు రోజుల పాటు మహోత్సవాలు నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో ఆదివారం ఆడికృత్తిక రావటంతో పట్టణంలోని భక్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాలనుంచి భక్తులు కదలి వచ్చారు. తలనీలాలు సమర్పించుకోవటానికి ఆదివారం వేకువ జాము 3గంటల నుంచే భక్తులు నారదపుష్కరిణి వద్ద నిరీక్షించారు. ఇక్కడ తలనీలాలు సమర్పించి కొండపైకి కదిలారు. మధ్యాహ్ననానికి సుమారు 50వేల మందికి పైగా దర్శనం చేసుకొని ఉంటారని ఇఓ బాపిరెడ్డి వివరించారు. ఇక్కడి ఉత్సవాలకు సంబందించి తాను ముందుగానే ఏర్పాట్లు చేపట్టామన్నారు. క్యూలైన్లు,సుదర్శనంకు స ంబంధించి సిబ్బంది చక్కటి ప్రణాళికను రూపొందించారన్నారు. తన శాఖకు చెందిన ఇంజనీరింగ్ విభాగం పోలీసుల సహాకారం ఎంతో అభినందనీయం అని బాపిరెడ్డి వివరించారు. ఉదయం అభిషేకాల్లో ఇఓ డి.బాపిరెడ్డి దంపతులతో పాటు ఉభయదారులు పద్మాక్షి మునిరత్నం,తీగల కోటేశ్వరరావు కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

# ఇంద్రవిమానంపై దర్శనమిచ్చిన స్కందుడు

**శ్రీకాళహస్తి,జూలై 20 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వ రాలయంలోని చెంగల్వరాయస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు, అనుబంధంగా నిర్వహిస్తున్న విజ్ఞాన గిరిపై వెలసిన కుమారస్వామి ఆల యంలో జరుగుతున్న మహోతనసవాల్లో భాగం గా ఆదివారం వల్లి దేవసేన సమేత సుబ్రమణ్యం స్వామి ఇంద్రవిమానంలో భక్తులకు దర్శనమి చ్చారు. ఆడికృత్తిక సందర్భంగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల సందర్బంగా ఆదివారం భక్తులు పోటేత్తరు. ఆదివారం ఉదయం నుంచి శ్రీకాళహ స్తీశ్వరాలయంలో విపరీతమైన రద్దీ ఏర్పడింది. సాధారణంగానే ఆదివారం భక్తు తాకిడి అధికంగా ఉంటుంది. ఆదివారం కావటంతో మరీ అధికంగా కనబడింది. ఉదయం అలంకార మండపంలో వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యం స్వామిని చక్కగా అలంకరించి గ్రామోత్సవానికి తరలిం చారు. ఇంద్ర విమానాన్ని చక్కగా పూలతో ముస్తాబు చేసారు. భక్తులు వవెంటరాగా గ్రామో



త్సవం కన్నుల పండువగా సాగింది. ఉత్సవాన్ని ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి పూజలతో ప్రారంభిం చారు. ఉత్సవంతో పాటు టెంపుల్ ఇన్సెపెక్టర్ వెంకటస్వామి, సిఎస్ఓ నాగభూషణం, దఫేదార్ రాజా సిబ్బంది వెంట రాగా ఉత్సవం నాలుగుమాడావీధుల్లో సాగింది.



తిరుపతి ఐఐటి స్నాతకోత్సవంలో పాల్గొన్న అతిధులు

# టెక్నాలజీ, సైన్స్ రంగాలపై దృష్టి సారించాలి

## జేయస్‌డబ్ల్యు గ్రూప్ చైర్మెన్ సజ్జన్ జిందాల్

**శ్రీకాళహస్తి. జూలై 20 ప్రభాతవార్త:** టెక్నాలజీ సైన్స్ రంగాలలో భారత ప్రభుత్వం చేపట్టిన కీలక కార్యక్రమాలపై దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జేయస్‌డబ్ల్యు గ్రూప్ చైర్మెన్ సజ్జన్ జిందాల్ అన్నారు. ఆదివారం రాత్రి తిరుపతి ఐఐటి ఏడవ స్నాతకోత్సవం సొంత భవనాల్లో మొదటిసారి నిర్వహించారు. సమా వేశం డైరెక్టర్ ప్రొ.సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిధులుగా క్రియా విశ్వవిద్యాలయం సహా వ్యవస్థాపకుడు కాగ్నిజెంట్, వైస్ ఛాన్సలర్ లక్ష్మీనారాయణన్ హాజరయ్యారు. జిందాల్ గ్రూప్ చైర్మెన్ తిరుపతి ఐఐటిబోర్డు ఆఫ్ గవర్నర్స్ చైర్‌పర్సన్ సజ్జన్ జిందాల్ అధ్యక్షత వహించారు. తిరుపతి ఐఐటి 7వ స్నాతకోత్స వంలో 212 బిటెక్,91 మందికి ఎంటెక్, 53 మందికి ఎంఎస్‌సి,16 మందికి ఎంపిపి డిగ్రీలు 13 మందికి పరిశోధన మరియు పిహెచ్‌టి డ్యూయల్ డిగ్రీలు ఒకరికి డిప్లొమా సర్టిఫికేట్లు అందించారు 18మంది విద్యార్థులకు పతకాలుఅందాయి. ఈ సమావేశంలో ముఖ్యఅతి ధిగా హాజరైన కాగ్నిజెంట్ టెక్నాలజీస్ సహ వ్య వస్థాపకుడు కేరియా విశ్వవిద్యాలయం చాన్సలర్ లక్ష్మీనారాయణన్ మాట్లాడుతూ గ్రాడ్యూయేట్లు ఎప్పుడూ విభిన్నధృక్పథాలపై శ్రద్ద వహించాల న్నారు. బిఓజి చైర్మెన్ స్నాతకోత్సవ సభ ముగింపు సందర్బంగా ధన్యవాదాలు తెలిపారు.

# కక్షసాధింపు రాజకీయాలకు తెరలేపిన ఎన్డీఏ ప్రభుత్వం

## ఎంపి మిథున్‌రెడ్డి అరెస్టు ప్రజాస్వామ్య వ్యవస్థకు విఘాతం

## వైఎస్సార్సీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ చుక్కలూరు దిలీప్ రెడ్డి



**పామిడి, జులై 20 ప్రభాతవార్త:** రాష్ట్రంలో కక్షసాధింపు రాజకీ యాలకు ఎన్డీఏ ప్రభుత్వం తెరలేపిందని వైసీపీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ చుక్కలూరు దిలీప్‌రెడ్డి ధ్వజమెత్తారు. రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థకు విఘాతం కలిగించే విధంగా ఎన్డీఏ ప్రభుత్వం ఎంపీ మిథున్‌రెడ్డిపై అక్రమ కేసులను బనా యించి అరెస్టు చేయటం దుర్మార్గపు చర్యగా ఆది వారం జరిగిన విలేకరుల సమావేశంలో దిలీఫ్ం రెడ్డి అభివర్ణించారు. పారదర్శకమైన పాలనను అందిస్తున్నామని ప్రగల్భాలు పలుకు తున్న పాలకులు రాష్ట్రంలో ఎక్కడచూసినా ఎన్డీఏ కూటమి శ్రేణులతో బెల్టుషాపులు, ఇసుక అక్రమ రవాణా, దౌర్జన్యాలు, షటిల్‌మెంట్లు చేయిస్తూ ప్రజాధనాన్ని దండుకుంటున్నారని విమర్శిం చారు. చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్, లోకేష్ పాలనంతా కుట్రలు కుతంత్రాలతో సాగు తోందని ఉద్యోగులను బెదిరించి బ్లాక్‌మెయిల్ చేసి స్టేట్‌మెంట్లు తీసుకుని అక్రమ కేసులో ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్టు చేయటమే అందుకు నిదర్శ నం అన్నారు. రాష్ట్రాభివృద్ది ప్రజాసంక్షేమాన్ని గాలి కొదిలిన చంద్రబాబు నాయుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులను రాజకీయం గా ఎదుర్కొనే ధైర్యం లేకనే అక్రమ కేసులను బనాయిస్తూ అరెస్టులతో వేధిస్తుండటం ఎంతవ రకూ సమంజసమని ప్రశ్నించారు. అక్రమ కేసు లతో అరెస్టుచేసిన పాలకులు ప్రజాక్షేత్రంలో తగి నమూల్యంచెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

# అక్షర శక్తి ముందు తూటా నిలవలేదు: ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

**విజయవాడ,జూలై20,ప్రభాతవార్తప్రతినిధి:** నేటి తరంలోని రచనా ప్రతిభను వెలికితీసేందుకు సమష్టి కృషి అవసరమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. మేధో వికాసం మానవ ఉనికికి అంతిమ లక్ష్యం కావాలన్న డా. బీఆర్ అంబేద్కర్ సూక్తి భావితరానికి వెలుగుబాట అన్నారు., మంచి ఆలోచనలకు సలక్షణంగా అక్షర రూపమి వ్వడం ఓ కళ అన్నారు.అయితే నేటి తరంలో ఆ రచనా శక్తి, ఆసక్తి తగ్గుతోందన్నారు.విద్యార్థి దశ నుంచే సృజనాత్మక రచనా నైపుణ్యాలను పెంచేందుకు సమష్టి కృషి అవసరమని జిల్లా కలెక్టర్ అన్నారు.విజయవాడ మహాత్మాగాంధీ రోడ్డులో ఉన్న డా. బీఆర్ అంబేద్కర్ స్మృతివనం ఆవరణలో ఆదివారం మల్లెతీగ సాహిత్యసేవా సంస్థ ఆధ్వర్యంలో 'ప్రణామం' కవి సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ లక్ష్మీశ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవులు, రచయితలకున్నశక్తి అసామాన్యమైనదని, వారి కలం నుంచి జాలువారిన అక్షర శక్తి ముందు తూటా శక్తి కూడా నిలవలేదని పేర్కొన్నారు. సమాజంలోని వివిధ సమస్యలపై రచయితల నుండి రచనలు ఆహ్వానించి ఉత్తమ రచనల్ని ఎంపిక చేసి వాటిని ఒక పుస్తకంగా ముద్రించాల్సిన అవసరం ఉందన్నారు. ఆ బాధ్యతను మల్లెతీగ సాహిత్యసేవాసంస్థ తీసుకోవాలన్నారు. ఘంటా విజయకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్ర మంలో సుప్రసిద్ధ కవులు శ్రీరామకవచం సాగర్, డా. ఎం.ప్రభాకర్, వ్యాఖ్యాన శిరోమణి వేముల హాజరత్తయ్య గుప్తా, మల్లెతీగ కలిమిశ్రీ, బుక్



సభలో ప్రసంగిస్తున్న జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

ఆఫ్ భారత్ రికార్డ్స్ డా. ఎస్ దుర్గాకుమార్ పాల్గొ న్నారు. ఈ కార్యక్రమాన్ని చొప్పా రాఘ వేంద్రశేఖర్ పర్యవేక్షించగా రెండు తెలుగు రాష్ట్రాల నుండి వచ్చిన 80 మంది కవులు తెలుగు భాష, ప్రపంచశాంతి, పర్యావరణం, దేశభక్తి, సామాజిక చైతన్యం అంశాలపై కవితాగానం చేశారు. ఈ కవి సమ్మేళనాన్ని సుప్రసిద్ధ రచయిత,సామాజిక వేత్త ఎం,ప్రభాకర్ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు.

# కొడికొండ చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేసిన మంత్రి కొల్లు

**చిలమత్తూరు, జూలై 20 ప్రభాతవార్త:** చిలమత్తూరు మండలంలోని కొడికొండ చెక్‌పోస్ట్‌ను ఎక్సైజ్, భూగర్భగనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆది వారం అకస్మిక తనిఖీచేశారు. చెక్‌పోస్టులో ఏర్పా టు చేసిన సిసి కెమెరాల పనితీరును పరిశీలించిన మంత్రి,దాని పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. వాహనాల తనిఖీల్లో మానవీయ తప్పిదాలు తగ్గిం చేందుకు ఆధునిక యంత్ర పరికరాల వాడకాన్ని పరిశీలించాల్సిందిగా ఎక్సైజ్ సిబ్బందికి సూచిం చారు. తనిఖీ ప్రక్రియ మరింత సమర్ధవంతంగా వుండాలన్నారు. సిబ్బందితో మాట్లాడిన మంత్రి, వారి విధుల పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ తనిఖీలో ఓఎస్‌డి కె.ఎల్. గోపాల్, అనంతపురం మద్యనిషేధం ఎక్సైజ్ ఉప కమీషనర్ పి.నాగమ ద్దయ్య, శ్రీసత్యసాయి జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.నరసింహులు,చెక్‌పోస్ట్ సిఐశ్రీధర్,ఎస్ఐవిజయ్ తదితరులు పాల్గొన్నారు.



సిసి కెమెరాలు పనితీరు అడిగి తెలుసుకుంటున్న మంత్రి కొల్లు రవీంద్ర

# నాయకులందరి కృషితో ఇంటింటికి టిడిపి విజయవంతం

## ఎంపి వేమిరెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

**బుచ్చి (నెల్లూరు), జూలై 20, ప్రభాతవార్త :** ఎన్నికలలో ఇచ్చిన హామీలు అమలు చేస్తు పాలన సాగిస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. జులై 2 న ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంబించిన సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి టిడిపికార్యక్రమంలో భాగంగా కోవూరు నియోజకవర్గంలో గడపలన్ని పూర్తి అయిన సం దర్బంగా ఆదివారం బుచ్చిరెడ్డి పాళెంలో ఎస్ఎస్ కళ్యాణ మండపంలో నిర్వహించిన ఈకార్యక్రమం లో పాల్గొన్నారు. లక్ష గడపలు కావడంపై సంతోషం వ్యక్తం చేశారు. నాయకులు కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయడంతో డోర్‌టు డోర్ కార్యక్రమం విజయవంతం అయిందని అన్నారు. బుచ్చిరెడ్డిపాలెం మండలంలో 36 వేల ఇండ్లు పూర్తి చేయడం అభినందనీయమని అన్నారు.



ఆదివారం బుచ్చిరెడ్డిపాళెంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపి మేమిరెడ్డి

పార్టీ నాయకుల మధ్య సయోధ్యకు కార్యకర్తల సమస్యలు పరిష్కరించేందుకు కో ఆర్డినేటర్లు పనిచేస్తున్నారని అన్నారు. కేడర్ నిత్యం ప్రజలలో ఉండాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో బుచ్చిరెడ్డిపాళెం మున్సిఫల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ,కోడూరు కమలాకర్‌రెడ్డి, ఏటూరు శివరామకృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ యరటపల్లి శివకుమార్‌రెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు, బత్తల హరికృష్ణా, ఎంవి శేషయ్య, సీనియర్ నాయకులు పుట్టా సుబ్రమణ్యంనాయుడు , వింజం రామానా యుడు, మైనార్టీ నాయకులు షేక్ షబ్బీర్,షేక్ ఫర్వీనా, కౌన్సిలర్ అందె ప్రత్యూషా,తాళ్ళ వైష్ణవి, చిలకా బాలకుమార్, కావలి వెంకటేశ్వర్లు, రఘురామిరెడ్డి,దశరద్, శంకర్, మైనార్టీనాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# కాపు సమస్యలపై దశలవారీ ఉద్యమం

## మూడుప్రాంతాలలో బహిరంగసభలు

## రాష్ట్ర కాపు జెఎసి అధ్యక్షులు చందు జనార్ధన్

**విజయవాడ,జూలై20,ప్రభాతవార్తప్రతినిధి:** బీసీ రిజర్వేషన్ కోసం పోరాడాలని రాష్ట్ర కాపు జె.ఎ.సి.సమావేశం తీర్మానించిది. కాపు, బలిజ, తెలగ,ఒంటరి,తూర్పుకాపు, మున్నూరు కాపు సమస్యలపై దశలవారి ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తున్నట్లు రాష్ట్ర కాపు జెఎసి అధ్యక్షులు చందు జనార్దన్ తెలిపారు. ఆదివారం విజయ వాడలో సంఘాల నాయకులు, ప్రతిని ధులు, యూనియన్,ఉద్యోగసంఘులు, రాధరం గామిత్రమండలి, వ్యాపారదిగ్గజాలు 325మంది నాయకత్వం పాల్గొన్నగా,12 తీర్మానాలను



ఆదివారం విజయవాడలో కాపు జెఎసీ సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షులు చందు జనార్ధన్

సమావేశం ఆమోదించింది. కాపు తెలగ బలిజ ఒంటరి కులాలకు ప్రత్యేక బీసీ రిజర్వేషన్ కల్పించాలని సమస్యల పరిష్కారంకోసం దశల వారి ఉద్యమం జిల్లా,డివిజన్,మండల స్థాయి సమావేశాలు అనంతరం విజయవాడ, రాయల సీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలలో బహిరంగ సభలు. రాష్ట్రంలో కాపు వర్గాలపై జరిగే దాడులను అరికట్టాలని కృష్ణా జిల్లాకు,ఐకాన్ బ్రిడ్జ్‌కు స్వర్గీ య వంగవీటి మోహనరంగా పేరు , కృష్ణదేవ రాయలు జయంతిని ప్రభుత్వం ఆదికారికంగా నిర్వహించాలన్నారు.

కాపు కార్పొరేషన్ కు ప్రతి సంవత్సరం 3000కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయాలి, రాజధాని ఆమరావతిలో కాపు భవనానికి 5 ఎకారాలు కేటాయించాలి. స్వా తంత్ర సమరయోధుడు కన్నెగంటి హనుమంతు, కృష్ణదేవరాయలు భారీవిగ్రహలను అమరావతి రాజధానిలో ఏర్పాటు చేయాలి కోరారు.



# దుర్గమ్మవారి దర్శనానికి వెల్లువెత్తిన భక్తజనం

## 65వేలమందికి ఉచిత దర్శనం

**ఇంద్రకీలాద్రి, జూలై 20, ప్రభాతవార్త:** దుర్గమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. క్యూలైన్లన్నీ ఉచితంగా ఉదయం 10నుండి మధ్యాహ్నం 3వరకు ఈఓ నిర్ణయిం చడంతో సుమారు 65వేలమంది భక్తులు ఉచి తంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా క్యూలై న్లను ఇఓ పరిశీలిస్తూ త్వరగా క్యూలైన్లు కదిలేలా చర్యలు తీసుకున్నారు.

**పెద్దఎత్తున ఆషాడం సారె:** ఆషాడమాసంలో చివరి శెలవు దినం కావడంతో ఆదివారం ఆషాడం సారెను తీసుకుని పలు ప్రాంతాలకు చెందిన భక్తబృందాలు దుర్గమ్మవారికి సమర్పించారు.

**దాతల విరాళాలు:** దుర్గమ్మవారి ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి రు.1,01.116ల విరాళాన్ని ఆదివారం సుబ్బారెడ్డి, రాజేశ్వరి పేరిట కేసరి శ్రీనివాసరెడ్డి, బార్య విజయలక్ష్మి, కూతురు నివిధ లు అందించారు. అలాగే గుంటూరుకు చెందిన మోహన్ సాయి, లక్ష్మీనారాయణ, రజిని డాక్టర్ అను కుటుంబీ కులు పేరున శివశంకర్, పద్మ దంపతులు రు.1లక్షను ఉచిత ప్రసాదం స్కీం కోసం విరాళంగా ఆదివారం అందించారు. గో సంరక్షణ నిధికి తాడేపల్లికి చెందిన సూర్యనా రాయణ ప్రసాద్ దంపతులు రు.1,01,116ల విరాళాన్ని ఇఓ వికె శీనా నాయక్‌కు అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం



దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# మిథున్ రెడ్డి అరెస్ట్‌పై పుత్తూరు బైపాస్ వద్ద నిరసన

**పుత్తూరు, జూలై 20 ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి రాష్ట్రంలో అక్రమ అరెస్ట్‌లు జరుగుతున్నాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ మంత్రి ఆర్.కె.రోజా, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ఆరోపించారు. మద్యం కేసులో ఎంపి మిథున్‌రె ఒడ్డిని అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ ఆదివారం పుత్తూరు బైపాస్ వద్ద పార్టీ శ్రేణులతో కలిసి వీరు నిరసన వ్యక్తం చేశారు. తొలుత వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనం తరం మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాం గం నడుస్తోందని దాని ప్రకారం ఎటువంటి ఆధా రాలు లేకుండా తమ పార్టీ నాయకులను అక్ర మంగా అరెస్ట్ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న రోజా, వరుదు కల్యాణి

# మొదటిఘాట్‌లో ఎలుగుబంటి హాల్‌చల్

**తిరుమల,జూలై 20ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల నుండి తిరుపతికి దిగే మొదటిఘాట్‌లో ఆదివారం రాత్రి 7గంటల ప్రాంతంలో ఎలుగు బంటి సంచారంతో భక్తులు భయపడ్డారు. వినాయకుని గుడి దాటిన తరువాత అటవీప్రాం తంలోనుండి ఎలుగేబంటి ఘాట్‌రోడ్డుపైకి చేరింది. ఆ సమయంలో తిరుపతికి దిగుతున్న వాహనదారులు గమనించారు. వాహనాల లైటింగ్‌కు, శబ్దాలకు ఎలుగుబంటి మళ్ళీ అడవిలోకి వెళ్ళింది. అయితే ఘాట్‌లో ఎలుగు బంటి సంచారంతో ఇప్పుడు భక్తులు కూడా భయపడే పరిస్థితి నెలకొంది. మూడేళ్ళక్రిందట తిరుమలలోనే ఎలుగుబంటి సంచారం ఉం డేది. అంతేగాక శ్రీవారిమెట్టు మార్గంలోనూ ఎలుగుబంటి భక్తులకు కనిపించింది. అప్పట్లోనే పట్టివేతకు బోన్లు ఏర్పాటుచేశారు. రెండేళ్ళుగా ఎలుగుబంట్ల సంచారం లేదు. ఆదివారం రాత్రి మళ్ళీ మొదటిఘాట్‌లో ఎలుగుబంటి సంచరిం చడంతో భక్తుల్లో భయం పట్టుకుంది.

# ప్రపంచంలోనే అతిపెద్ద డ్యామ్ చేపడుతున్న చైనా

## రూ.14 లక్షల కోట్లతో టిబెట్‌లోని బ్రహ్మపుత్రనదిపై నిర్మాణం

## అరుణాచల్, అసోం రాష్ట్రాలకు వరద ముంపు ప్రమాదం

**నైంగ్చీ(టిబెట్),జూలై 20:** ప్రపంచంలోనే అత్యంత భారీ జలవిద్యుత్తు ప్రాజెక్టు నిర్మాణాన్ని చైనా ప్రారంభించింది. ఈ ప్రాజెక్టు పనుల కార్యక్రమంలో చైనా ప్రధాని లీ కియాంగ్ పాల్గొన్నారు. టిబెట్‌లోని బ్రహ్మపుత్ర నదిపై చేపడుతోన్న ఈ వివాదాస్పద ప్రాజెక్టు కోసం చైనా సుమారుగా 14లక్షల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టనున్నట్లు అంచనా. ఈ ప్రాజెక్టుపై భారత్ బంగ్లాదేశ్‌లు ఆందోళన వ్యక్తం చేస్తున్నప్పటికీ చైనా మాత్రం మొండిగా ముందుకు పోతున్నట్లు తెలుస్తోంది. చైనా యాజియాంగ్ గ్రూపు పేరుతో కొత్తగా ఓ సంస్థను ఏర్పాటుచేసి ఈ జలవిద్యుత్ ప్రాజెక్టు బాధ్యతలు అప్పజెప్పినట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టులో మొత్తం ఐదు డ్యామ్‌లు ఉండనున్నాయి. టిబెట్‌లోని నైంగ్చీ నగరంలో భారీ స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా ఈ ప్రాజెక్టును చైనా చేపడుతోంది. ఈ విద్యుత్‌ను బయటకే సరఫరా చేయనున్నప్పటికీ స్థానిక అవసరాలకు కూడా కొంతమేర వినియోగించ నున్నట్లు సమాచారం. భారీ ఖర్చుతో చేపడు తున్న ఈ జలవిద్యుత్ ప్రాజెక్టు ప్రపంచంలోనే అత్యంత ఖరీదైనదిగా నిలువనుంది. దీనిద్వారా ఏటా 300 బిలియన్ కిలోవాట్ అవర్స్ విద్యుత్తు ఉత్పత్తి చేయాలన్నది లక్ష్యం. ఇది చైనా గతంలో నిర్మించిన ప్రపంచంలో అతిపెద్దదైన త్రీగోర్జెస్ డ్యామ్‌కన్నా 3 రెట్లు పెద్దది. టిబెట్ నుంచి అరుణాచల్‌ప్రదేశ్‌కు వచ్చే నదీగమనంలో వంపు తిరిగే చోట ఈ డ్యామ్‌ను నిర్మిస్తున్నారు. భారీ డ్యామ్ నిర్మాణం వల్ల ఇక్కడి భౌగోళిక ప్రదేశానికి, పర్యావరణానికి నష్టం కలగవచ్చనే అభిప్రాయాలున్నాయి. అరుణాచల్ ప్రదేశ్, అస్సాం రాష్ట్రాలపై ప్రతికూల ప్రభావం పడుతుందనే ఆందోళనలు పెరిగాయి. ఒకవేళ 2 దేశాల మధ్య సంఘర్షణ సంభవిస్తే చైనా ఈ డ్యామ్ నుంచి ఒక్కసారిగా భారీ పరిమాణంలో నీటిని విడుదల చేస్తే భారత్‌లోని అరుణాచల్ ప్రదేశ్, అస్సాంలోని భూభాగాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. ఈ ప్రాజెక్టుపై పర్యవేక్షణ కొనసాగిస్తా మని, తమ దేశ ప్రయోజనాలు కాపాడుకునేందుకు చర్యలు తీసుకుం టామని ఇటీవల భారత విదేశాంగశాఖ వెల్లడించింది.

# జూరాల 19 గేట్లు ఎత్తివేత

## జలాశయానికి 1,15,000 ఇన్‌ఫ్లో

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 20, ప్రభాతవార్త:** జూరాల డ్యామ్‌కు వరద ప్రవాహం పెరుగు తున్నది. కర్ణాటక నుంచి భారీగా వరద ప్రవా హం నమోదు కావడంతో జూరాలకు జలకళను సంతరించుకున్నది. జలాశయానికి 1,15,000 క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదైంది. జూరాల పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జూరాలలో 3.682 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. పవర్ హౌస్ కు 29,464 క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 74,081 క్యూసెక్కుల నీటిని విడుదలచేశారు. అదేవి ధంగా బీమా లిఫ్టు-1కు 650 క్యూసెక్కులు, కోయిల్ సాగర్ లిఫ్ట్ కు 315 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 750, ఆర్డీఎస్ కెనాల్ కు 150 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 1030 క్యూసె క్కులు, కుడి కాలువకు 600 క్యూసెక్కులు, సమాంతర కాలువకు 700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

Main tab page 7_Main tab page 7.qxd 7/21/2025 12:29 AM Page 1



# పాడి రైతులు, ఉద్యోగుల సంక్షేమమే నా బాధ్యత



**విశాఖపట్నం ప్రతినిధి, జూలై 20, ప్రభాతవార్త**

పాడి రైతులు, డెయిరీ ఉద్యోగుల సంక్షేమం నా బాధ్యత అని విశాఖ డెయిరీ ఛైర్మన్ ఆడారి ఆనందకుమార్ అన్నారు. ఆదివారం ఉదయం విశాఖ డైరీ ఉద్యోగులు తమ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్‌కి నిర్వహించిన సన్మాన సభ షీలానగర్, విశాఖ డైరీ ట్రస్ట్ కమ్యూనిటీ హాల్ లో అత్యంత ఘనంగా జరిగింది, ఆనంద్ కుమార్ డైరీ చైర్మన్ గా ఉద్యోగులకు అమలు చేసిన వేతన సవరణ, పదోన్నతులు, పర్మినెంట్ విధానం పట్ల కృతజ్ఞతా భావం తో డైరీ ఉద్యోగులు చైర్మన్ ని ఘనంగా సత్కరించారు, ఈ కార్యక్రమం లో చైర్మన్ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ, పాడి రైతులు విశాఖ డైరీ ఉద్యోగుల సంక్షేమం, భద్రత తన తండ్రి స్వర్గీయ ఆడారి తులసి రావు అప్పగించిన బాధ్యత అని అన్నారు. అందరు కలిసి విశాఖ డైరీ ని ప్రగతి ఫదం లో ముందుకు నడపాలి అని, నేడు ఎంతో మంది ఉద్యోగులు రైతులు క్యాన్సర్ తో చనిపోతున్నారని,

మిగతా 8లో..






విశాఖపట్నం
అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు
26
వార్త

# విశాఖలో రూ.100 కోట్ల మోసం

- బోర్డు తిప్పేసిన మ్యాక్స్ సంస్థ ఆరుగురు అరెస్టు..
- 14 రోజుల రిమాండ్ పరారీలో ప్రధాన నిందితుడు - 12మంది కోసం గాలింపు చర్యలు




**విశాఖ క్రైమ్, ప్రభాతవార్త**

విశాఖలో భారీ డిపాజిట్ మోసం కలకలం రేపుతోంది. అంబేద్కర్ ఆశయసాధన పేరుతో స్థాపించబడిన "మ్యాక్స్ కోఆపరేటివ్ సొసైటీ" రూ.100 కోట్లకు పైగా డిపాజిట్లు సేకరించి బోర్డు తిప్పేసింది. ఈ మోసానికి సంబంధించి సంస్థడైరెక్టర్లు, కొంతమంది ఉద్యోగులు పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులను 14 రోజుల రిమాండ్ కు తరలించారు. అయితే ఇందులో ప్రధాన నిందితుడిగా ఉన్న విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి శివభాగ్యారావు పరారీలో ఉన్నారు. అతని కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.కాగా, విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి కటిక లశివభాగ్యారావు 2008లో స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ(స్నేహ మ్యాక్స్)ని విశాఖపట్నంలో స్థాపించారు.12 శాతం వడ్డీ ఇస్తామని చెప్పి ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఉద్యోగులు, విశ్రాంతులు, ఇతరులను నమ్మించి సుమారు 2,500 మంది నుంచి రూ.100 కోట్లు సేకరించారు. కొన్నాళ్ల పాటు సక్రమంగా వడ్డీ చెల్లించి ఆ తర్వాత క్రమంగా కార్యకలాపాలు తగ్గించుకుంటూ రావడంతో ప్రజలకు అనుమానం వచ్చింది. డబ్బులు తిరిగి ఇవ్వాలంటూ ఖాతాదారులు డిమాండ్ చేసినా ఫలితం లేకపోవడంతో మోసపోయామని తెలుసుకు న్నబాధితులు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు రంగంలోకి దిగి సంస్థ ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావుతో పాటు డైరెక్టర్లు గూడూరు

మిగతా 8లో..

# సీపీ ఆదేశాలు బేఖాతర్..!

- పిజిఆర్ఎస్‌లో ఇచ్చిన ఫిర్యాదులు బుట్టదాఖలేనా..?
- సబ్ డివిజన్,స్టేషన్ స్థాయి అధికారులను కలుసుకోవడం గగనమే
- పోలీస్ స్టేషన్ల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్న ఫిర్యాదుదారులు




**విశాఖ క్రైమ్, ప్రభాతవార్త**

విశాఖ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇప్పటి వరకు ఎంతో మంది పోలీస్ కమిషనర్లు పని చేసారు .. అయితే ఎవరూ కూడా ఇప్పటి సీపీ శంఖబ్రత బాగ్చి లాగా ప్రజలతో మమేకం అవ్వలేదనే చెప్పాలి .. ప్రజలు సమస్యలను తెలుసుకొని సత్వరమే పరిష్కరించడం కోసం సీపీ శంఖబ్రత బాగ్చి ప్రత్యేకించి ఒక ఫోన్ నెంబర్ ను ఏర్పాటు చేసి ఉదయం, రాత్రి అనే తేడా లేకుండా 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు.. ఎంతలా అంటే ప్రజల కష్టాలను ఎంతో ఓపికగా విని పరిష్కారం చూపుతున్నారు.. దీంతో సీపీ ప్రజల దృష్టిలో హీరోగా నిలిచారు ..అయితే పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ప్రజల సమస్యలను తీర్చడం కోసం చేస్తున్న కృషి వృధా అవుతుందనే చెప్పాలి .. సీపీ ఆదేశాలను సైతం కొందరు అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజల నుండి విమర్శలు వినిపిస్తున్నాయి. సాధారణ వేళల్లో ప్రజల నుండి తీసుకొనే ఫిర్యాదులతో పాటుగా పిజిఆర్ఎస్ కార్యక్రమాల ద్వారా తీసుకొన్న ఫిర్యాదులను పోలీస్ కమిషనర్ బాగ్చి సంభందిత అధికారులకు పంపించి పరిష్కరించాలని ఆదేశిస్తారు ..ఒక్కోసారి పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ఫిర్యాదులు ఎక్కువ ఉన్నట్టయితే ఆ రోజు రాత్రి 12 గంటలైనా ప్రజల సమస్యలను విని సంభందిత అధికారుకాలకు పరిష్కరించాలని ఆదేశిస్తారు .. ఇంత వరకు సీపీ చేస్తున్న కృషి ఎంతో అద్భుతంగా ఉన్నప్పటికీ అక్కడ నుండి ఫిర్యాదుదారులకు మాత్రం చుక్కలు కనపడుతున్నాయని పలువురు విమర్శిస్తున్నారు.సీపీ సూచనల మేరకు ఫిర్యాదుదారులు సబ్ డివిజన్ స్థాయి లేదా స్టేషన్ స్థాయి అధికారులను కలవడానికి సంభందిత కార్యలయాలకు వెళ్లినప్పుడు ఉండరు ..? ఒకవేల ఉన్నప్పటికీ ముఖ్యమైన సమావేసంలో లేదా ముఖ్యమైన కేసు విచారణలోనో ఉన్నట్టు సిబ్బంది చెప్పడంతో ఫిర్యాదుదారులు చేసేదే ఏమీ లేక వెనుదిరుగుతునట్టు పలువురు ఆరోపిస్తున్నారు. పోనీ మరుసటి రోజు కలుద్దామని వెళ్తే ప్రోటోకాల్ డ్యూటినో లేదా బందోబస్తు లో ఉన్నట్టు సిబ్బంది చెప్పడంతో మళ్ళీ వెనుదిరగడం పరిపాటిగా మారుతుందని పలువురు ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు.. ఒకవేళ ఏదో సమయానికి ఏదో రోజు అయ్యగారు లు ఫ్రీగా ఉన్నప్పుడు లక్కీగా ఫిర్యాదుదారుల పంట పండి వారి కేసుల విషయం చర్చిస్తారని పలువురు ఆరోపిస్తున్నారు. ఆ తర్వాత మళ్ళీ సదా మామూలే.. ఏసిపి స్థాయి అధికారైతే సిఐ ని కలవమని ..సీఐ స్థాయి అధికారైతే ఎస్సై ని కలవమని .. ఎస్సై స్థాయి అధికారైతే ఏఎస్సైనో లేదా ఇతర సిబ్బందిని కలవమంటూ ఫిర్యాదుదారులకు విసుగుచెందిస్తునట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.. దీంతో పోలీస్ కమిషనర్ ద్వారా వచ్చే ఫిర్యాదులు బుట్టదాఖలు అయినట్టే అని పాపం ప్రజలు బిత్తర ముఖాలతో అక్కడ నుండి వెళ్లిపోతున్నట్టు పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. పోలీస్ కమిషనర్ ని కలవడం కన్నా డైరెక్ట్ గా పోలీస్ స్టేషన్ లో సిబ్బందీని కలిసి తమ గోడు చెప్పుకొంటే సమస్యలు పరిష్కారం అవుతాయన్న నిర్ణయానికి వచ్చినట్టు పలువురు ఫిర్యాదుదారులు అభిప్రాయం వ్యక్తం చేస్తునట్టు తెలుస్తుంది.. పోలీస్ కమిషనర్ ఉదయం, రాత్రి అనే తేడా లేకుండా ప్రజలతో మమేకమై వారి సమస్యలను పరిష్కరించడానికి చేస్తున్న శ్రమ కొందరు అధికారుల నిర్లక్ష్యపు విధుల కారణంగా వృధా అవుతుందని ప్రజల నుండి అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.. ప్రజల సమస్యలను పరిష్కరించడం పై కేవలం పోలీస్ కమిషనర్ మాత్రమే కృషి చేస్తే సరిపోతూ అధికారుల నుండి సిబ్బంది వరకు సక్రమంగా విధులు నిర్వర్తించి చక్కటి పోలీసింగ్ చేస్తేనే తప్పా అది సాధ్యపడదని మేధావులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# ఆన్లైన్ క్రికెట్ బెట్టింగ్‌పై ఉక్కుపాదం



- ప్రధాన బుక్కీతో పాటు ఇద్దరు అరెస్టు బెట్టింగ్, బెట్టింగ్ ప్రిడిక్షన్
- కాల్ సెంటర్ నిర్వహిస్తున్న నేరస్తులు
- టెలిగ్రామ్ లో ఆరు చానల్స్ ద్వారా బెట్టింగ్
- పదివేల మంది ఫాలోవర్స్
- రోజుకి 500 మంది బెట్టింగ్ చేస్తున్న వైనం

8..లో

# రైతులను పీడిస్తున్న అధికారి

- ప్రదక్షిణాలే తప్ప పనులు కావు
- సర్వే డిపార్ట్మెంట్‌పై రైతుల ఆగ్రహం

**అనకాపల్లి, జూలై 20, ప్రభాతవార్త**



రైతు శ్రేయస్సు కోసం ఒకవైపు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంటే, మరో వైపు అనకాపల్లి జిల్లాలో మాత్రం కొందరు అధికారుల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెవెన్యూలో కీలకమైన సర్వే డిపార్ట్మెంట్ ను జిల్లా అధికార యంత్రాంగం ఎందుకో విస్మరించిందనే చెప్పాలి. ఎందుకంటే అనకాపల్లి జిల్లాగా ఏర్పడిన నాటినుంచి జిల్లా సర్వే అధికారి మాత్రం ఇన్చార్జి పాలనలోనే మగ్గుతుంది. 26 మండలాలు కలిగిన అనకాపల్లి జిల్లాకు పూర్తిస్థాయి జిల్లా సర్వే అధికారి లేకపోవడం, జిల్లా కలెక్టర్ మరియు స్థానిక రాజకీయ నాయకులు దీనిపై దృష్టి పెట్టకపోవడం చాలా విచారకరమని రైతులు వాపోతున్నారు. ఇక్కడ పనిచేస్తున్న జిల్లా సర్వే ఇన్చార్జ్ అధికారి, పి జి ఆర్ ఎస్ లో సమస్యల పరిష్కారం కోసం వచ్చే రైతులను, నెలల తరబడి తిప్పుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వారి నుంచి ఏమైనా ఆశిస్తున్నారా ? మరి ఎందుకు నెలల తరబడి సమస్య పరిష్కారం కావడం లేదు ? కాళ్లు అరిగేలా ఈ డిపార్ట్మెంట్ చుట్టూ తిరుగుతున్నామని, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కు ఫిర్యాదులు చేస్తున్న ఉపయోగం ఉండడం లేదని రైతులు తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు.ఇక్కడ పనిచేస్తున్న జిల్లా సర్వే ఇన్చార్జి అధికారి తన మాటల గారడీతో అనకాపల్లి జిల్లా కలెక్టర్, జిల్లా రాజకీయ నాయకులను పరిపాలన పరమైన విషయాలలో తప్పుతోవ పట్టిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. 26 మండలాలు కలిగిన అనకాపల్లి జిల్లాకి పూర్తిస్థాయి జిల్లా సర్వే అధికారి లేకపోవడం పట్ల జిల్లా ప్రజాప్రతినిధులు ఎందుకు దృష్టి సారించడం లేదు..? అలాగే ప్రస్తుత సర్వే ఇన్చార్జి అధికారి సమస్యలపై వచ్చిన రైతులతో అమర్యాదగా మాట్లాడుతున్నారంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, స్థానిక రాజకీయ నాయకుల పేర్లు చెప్పి సంబంధిత శాఖలో ఉద్యోగులను కూడా భయపెడుతు న్నట్లు భోగట్టా. ఈయన ఇన్చార్జిగా చార్జ్ తీసుకున్న తర్వాత, ఇప్పటి వరకు ఒక సమస్య కూడా పరిష్కారం కాలేదని, పీజీఆర్ఎస్‌కు వచ్చిన ఫిర్యాదులలో ఎన్నింటిని ఈ అధికారి పరిష్కరించారో ఉన్నతాధికారులు దృష్టి సారిస్తే విషయం వెలుగు చూస్తుందని రైతులు అంటున్నారు. అనకాపల్లి జిల్లాగా ఏర్పడిన తర్వాత సర్వే డిపార్ట్మెంట్లో పూర్తిస్థాయి ఏడిగా కట్టా శ్రీనివాసరావు విధులు

మిగతా 8లో..

## చంద్రబాబు నాయకత్వంలో

# నెంబర్ వన్‌గా ఆంధ్రా


**- భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు**

**విశాఖపట్నం ప్రతినిధి, జులై 20, ప్రభాతవార్త**



వైసీపీ హయాంలో అన్ని రంగాల్లో కుదేలైన రాష్ట్రాన్ని మళ్లీ నెంబర్ వన్‌గా నిలబెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఆనందపురం మండలం రామ వరంలో ఆదివారం సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిశారు. ఏడాది పాలనలో ప్రభుత్వం అందించిన అభివృద్ధిని.. సంక్షేమాన్ని వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ ఎన్నికల్లో చెప్పిన హామీలన్నీ నెరవేరుస్తున్న ప్రభుత్వానికి అండగా నిలబడాలని కోరారు. రూ.2 వేల పెన్షన్ ను రూ.3 వేలు చేయడానికి జగన్మోహన్ రెడ్డికి అయిదేళ్లు పట్టిందని.. అధికారంలోకి వచ్చిన తక్షణమే చంద్రబాబు రూ.3 వేల పెన్షన్ ను రూ.4 వేలు చేశారని గుర్తు చేశారు. అలాగే 42 లక్షల మందికి అమ్మఒడి ఇవ్వగా, కూటమి ప్రభుత్వం దానికి 60 శాతం మించి 67 లక్షల మందికి తల్లికి వందనం అందిస్తోందని వివరించారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యం, అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు రూ.20 వేల పెట్టుబడి సాయాన్ని వచ్చే నెలలో ఇవ్వనున్నట్టు చెప్పారు. ఎన్నికల హామీల్లో చెప్పినట్టు నిరుద్యోగ భృతి తొందర్లోనే అందిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తాట్రాజు అప్పారావు, రామవరం సర్పంచ్ ఎర్ర రాజు, తర్లువాడ సర్పంచ్ బి.ఆర్.బి. నాయుడు, శ్రీకాంత్ రాజు, గండ్రెడ్డి రమేష్, బలిరెడ్డి మల్లికార్జునరావు, అప్పల రాము తదితరులు పాల్గొన్నారు.

# బ్రహ్మాకుమారీస్ సేవలు భేష్




8లో

## కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను

# ఎండగట్టడమే లక్ష్యం

- విశాఖ జిల్లా అధ్యక్షుడు, విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు

**విశాఖపట్నం ప్రతినిధి, జూలై 20, ప్రభాతవార్త**



కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయించడమే బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీఖీ అనే కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అని కె.కె రాజు అన్నారు. విశాఖ ఉత్తర నియోజకవర్గ స్థాయి బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ అనే కార్యక్రమం 24 వార్డు కార్పొరేటర్ సాడి పద్మ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విశాఖ జిల్లా అధ్యక్షుడు, విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయ కర్త కె.కె.రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కె.కె రాజు మాట్లాడుతూ బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీఖీ కార్యక్రమం ద్వారా చంద్ర బాబునాయుడు పాలనలో చోటుచేసుకుంటున్న అవినీతి, ప్రజా వ్యతిరేక విధానాలను స్పష్టంగా ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని అన్నారు. వార్డులో ఉన్న ప్రతి బూత్‌లో బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ" కార్యక్రమాన్ని నిర్వహిస్తూ చంద్రబాబు పాలనలో జరిగిన మోసాలను వార్డు లో ఉన్న ప్రజలకు తెలియజేయాలని అన్నారు. 2019 నుండి 2024 వరకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడంలో జగన్మోహన్ రెడ్డి సారథ్యంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఆదర్శంగా నిలిస్తే..చంద్రబాబు పరిపాలన చేయడం లో విఫలం చెంది నిస్సిగ్గుగా సూపర్ సిక్స్ హామీలన్నీ కూడా అమలు అయిపోయాయని వారికున్న ప్రచార మాధ్యమాలు ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండి పడ్డారు. ఇచ్చిన హామీలును అమలు చేయకుండా ప్రజల ను మభ్య పెడుతున్న కూటమి ప్రభుత్వం చర్యలను ఖండిస్తూ కూటమి ప్రభుత్వ పరిపాలన ఏడాది పూర్తి అయిన సందర్భంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ రాష్ట్రంలో ఉన్న ప్రతి జిల్లాలో "వెన్నుపోటు దినం"పేరుతో

మిగతా 8లో..

Main tab page 2_2_Main tab page 2_2.qxd 7/21/2025 12:30 AM Page 1



## దుర్వాసనను భరించలేం మా గ్రామాన్ని తరలించండి

రాంబిల్లి, జులై 20, ప్రభాతవార్త



రాంబిల్లి మండలం లాలం కోడూరు గ్రామస్తులతో ఎలమంచిలి నియోజకవర్గ శాసనసభ్యుడు సుందరపు విజయ్ కుమార్ సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మా గ్రామంను ఆనుకొని ఉన్న కంపెనీల నుండి వచ్చే దుర్వాసనను భరించలేకపోతున్నాం, చెడు వ్యర్థాలు మా కాలువలు నుండి పయనిస్తున్నాయి, వీటి వలన మాకు ఆరోగ్యం క్షీణిస్తుంది, అందుకే మా గ్రామాన్ని వేరేచోటకు తరలించాలని అన్నారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముందుగా స్వర్గీయ లాలం భాస్కరరావు అంటే చాలా గౌరవం అభిమానం అని వారి కుటుంబంతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు, అనంతరం రైతులతో మాట్లాడుతూ గ్రామానికి కావలసిన రోడ్లు త్రాగునీరు డ్రైనేజీలను మరింతగా అభివృద్ధి చేసుకొని గ్రామాన్ని కాపాడుకుందామని అన్నారు, సెజ్ లో ఉన్న కంపెనీల వలన చాలా కుటుంబాలు ఉపాధి అవకాశాలు పొంది ఆనందంగా ఉన్నారన్నారు, ప్రపంచంలో మనల్ని మనం గెలిపించుకొని ఉత్తమ స్థానానికి చేరుకునేలా మన ఆలోచన జ్ఞానం ఉండాలన్నారు, గ్రామాన్ని తరలించే విషయంలో మరల ఒకసారి గ్రామస్తులంతా ఒక కమిటీ వేసుకుని తాము నిర్ణయించుకున్న అంశాలను నా దృష్టికి తేవాలని అన్నారు, ఈ గ్రామంలో ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉన్నప్పుడే స్వర్గీయ లాలం భాస్కరరావు ఆత్మ శాంతిస్తుందని అన్నారు, ఈ కార్యక్రమంలో మాజీ జెడ్. పి. చైర్ పర్సన్ లాలం భవాని, మండల కమిటీ అధ్యక్షుడు లాలం భరత్, వైస్ ఎంపీపీ కసిరెడ్డి నర్సింగరావు, మాజీ సర్పంచ్ లాలం సత్య ప్రసాద్ , డి.ఎస్.ఎన్ రాజు, వి. దినుబాబు ,పప్పల నూకన్న దొర కూటమి నాయకులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## తప్పిపోయిన బాలుడు

**- 2 గంటల వ్యవధిలోనే తల్లిదండ్రుల చెంతకు వన్ టౌన్ పోలీసుల సేవలు ప్రశంసనీయం**

విశాఖ క్రైమ్, ప్రభాతవార్త



తప్పిపోయిన బాలుడిని రెండు గంటల వ్యవధిలోనే వారి తల్లిదండ్రుల చెంతకు చేర్చిన వన్ టౌన్ పోలీసుల సేవలను ప్రజలు ప్రశంసిస్తున్నారు. చిలకపేటకు చెందిన మూడేళ్ల గౌతం తప్పిపోయి రోడ్డు మీద ఏడుస్తుండగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు వన్ టౌన్ ఇన్స్పెక్టర్ జి.డి బాబు ఆదేశాల మేరకు ఎస్ఐ లక్ష్మణ్ తన సిబ్బందితో కలిసిఎంక్వయిరీ చేసి రెండు గంటల్లో బాలునితల్లిదండ్రులను గుర్తించి అప్పగించారు.

## విదేశీ మద్యం విక్రయాలపై ఎక్సైజ్ అధికారుల ఫోకస్

**- విశాఖలో భారీగా విదేశీ మద్యం స్వాధీనం**

విశాఖ క్రైమ్, ప్రభాతవార్త



విశాఖలో నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ (ఎన్‌పిఎల్) దందా నడుస్తోంది. వాయు, రోడ్డు అనే తేడా లేకుండా వీలున్నన్ని మార్గాల్లో ఈ అక్రమ మద్యం నగరంలోకి విచ్చలవిడిగా ప్రవేశిస్తోంది. ఈ మేరకు ఎక్సైజ్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు విదేశీ మద్యం రవాణా, విక్రయాలపై దృష్టిసారించి భారీగా విదేశీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అక్కయ్యపాలెంలో నివాసం ఉంటున్నపిలై వెంకటరమణ ఇంటిలో 220 విదేశీ స్కాచ్ మద్యం బాటిల్స‌న్న గుర్తించారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ రాజశేఖర్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి వీటిని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ. 18 లక్షలు ఉంటుందని వెల్లడించారు.నిందితునిపై ఎక్సైజ్ కేసు నమోదు చేశారు.

## అమెజాన్ ఉద్యోగులకు అదనంగా 40రోజుల వేతనం

గాజువాక,జులై20,ప్రభాతవార్త



జీవీఎంసీ 68వ వార్డు పరిధిలో ఉన్న మిందిలో అమెజాన్ గోడౌన్ ను పనిచేస్తున్న ఉద్యోగులకు తెలియజేయకుండా, పెందుర్తి గుర్రంపాలెంకు మార్చడానికి ప్రయత్నించింది. దీనితో ఉద్యోగులు తమ సమస్య ను రాష్ట్ర వైకాపా సంయుక్త కార్యదర్శి గుడివాడ లతీష్ ,మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ల తీసుకెళ్లారు. దింతో లతీష్, అమరనాథ్ లు అమెజాన్ ఉన్నత యాజమాన్యం,వెండర్స్ తో మాట్లాడి, ఉద్యోగులకు అదనంగా 40 రోజుల జీతం చెల్లించాల్సిందిగా అడగగా, యాజమాన్యం ఉద్యోగుల డిమాండ్‌ను అంగీకరించింది. దీనితో సమస్య ను పరిష్కరించినందుకు ఉద్యోగులందరూ గుడివాడ అమర్నాథ్ ,గుడివాడ లతీష్ లకు కృతజ్ఞతలు తెలిపారు.

## 87వ వార్డులో సుమారు రూ.5.89 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు మేయర్ శంకుస్థాపన

విశాఖపట్నం జూలై 20 ప్రభాతవార్త



నగరంలో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం ఆయన గాజువాక జోన్ 87 వార్డు పరిధిలోని వడ్లపూడి లో పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, వార్డు కార్పొరేటర్ బొండా జగన్నాథంతో కలిసి శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ విశాఖ నగరంలో పారిశ్రామిక ప్రాంతమైన గాజువాకను అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేయడం జరుగుతుందని, అందులో భాగంగా 87 వార్డు వడ్లపూడి లో జీవీఎంసీ నిధుల నుండి సుమారు 5.89 కోట్ల రూపాయలతో వి ఆర్ సి సి కాలువలు, దోబీ ఘాటు నిర్మించేందుకు గాజువాక శాసనసభ్యులతో కలిసి శంకుస్థాపన చేశామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం విశాఖ నగర అభివృద్ధి తోపాటు సంక్షేమానికి ఎంతో కృషి చేస్తుందని పేర్కొన్నారు. గాజువాక ప్రజలకు మౌలిక వసతుల కలపనే లక్ష్యంగా ప్రతి వార్డును అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం గాజువాక శాసనసభ్యులు మాట్లాడుతూ గాజువాక నియోజవర్గం పరిధిలో ప్రతి వార్డును ఆదర్శంగా తీసుకొని ప్రజలకు అందించే సంక్షేమం, మౌలిక వసతులు కల్పించేందుకు చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని అలాగే జీవీఎంసీ నిధులనే కాకుండా ఎమ్మెల్యే నిధులను కూడా వెచ్చించి పలు అభివృద్ధి కార్యక్రమాలు నియోజవర్గం పరిధిలో చేపట్టడం జరుగుతుందని శాసనసభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు, కార్పొరేటర్లు మొల్లి ముత్యాల నాయుడు, రౌతు శ్రీనివాసరావు, జీవీఎంసీ జోనల్ కమిషనర్ బి ఆర్ ఎస్ శేషాద్రి, కార్యనిర్వాహక ఇంజనీరు అప్పారావు, ఇతర నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అరుదైన హోమియో మందుల వాడకంపై సదస్సు

విశాఖపట్నం, జూలై 20, ప్రభాతవార్త



అరుదైన హోమియో మందుల వాడకంపై "ఎల్.జె.గ్రాండ్ హోటల్ "లో ఆదివారం ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హోమియో ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన సలహాదారులు డాక్టర్.కె.వి.ఆర్.ఎల్.యన్.శర్మ అధ్వర్యంలో హోమియో వైద్యులకు ఎన్నికలు జరిగాయి. విశాఖ జిల్లా శాఖ అధ్యక్షులుగా డాక్టర్ పి. రాఘవేంద్ర రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా డా.యం.శివకాంతి, జనరల్ సెక్రటరీగా డా.రాజా శ్రీకాంత్, కన్వినర్ గా డా.ఎం.చంద్రశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డా.వి.సునీత, కోశాధికారిగా డా.ఎస్ సుధాకర్,సంయుక్త కార్యదర్శులుగా డా.ఎస్.ఆనందరావు, డా. ఆర్.శ్రీదేవి, డా.ధవళ మూర్తి, డా.వి.మల్లికార్జునరావు, మహిళా వైద్యుల ప్రతినిధి డా.జగధాత్రి ఎన్నుకున్నారు. తదుపరి నూతన అధ్యక్షులు డా.రాఘవేంద్రరావు సభ్యులందరితో ప్రమాణ స్వీకారం చేయించారు. జరిగిన సదస్సులో అరుదైన హోమియో మందుల వాడకం అనే అంశంపై వక్తలు డా.ఎం.చంద్రశేఖర్, డా.రాజేంద్ర ప్రసాద్, డా.పి.శివ రామకృష్ణ లు ప్రసంగించారు. ఈ కార్యక్రమాన్ని డా.రాజా శ్రీకాంత్ డా.వి.సునీత నిర్వహించారు.

## ఆన్లైన్ క్రికెట్ బెట్టింగ్‌పై ఉక్కుపాదం

**- ప్రధాన బుక్కీతో పాటు ఇద్దరు అరెస్టు బెట్టింగ్, బెట్టింగ్ ప్రిడిక్షన్**
**- కాల్ సెంటర్ నిర్వహిస్తున్న నేరస్తులు - టెలిగ్రామ్‌లో ఆరు చానల్స్ ద్వారా బెట్టింగ్**
**- పదివేల మంది ఫాలోవర్స్ - రోజుకి 500 మంది బెట్టింగ్ చేస్తున్న వైనం**

విశాఖ క్రైమ్, ప్రభాతవార్త



విశాఖ నగర పోలీసులు"ఆన్లైన్ క్రికెట్ బెట్టింగ్" మోసాలుపై ఉక్కుపాదం మోపి, వారి కార్యకలాపాలను నియంత్రిస్తున్నప్పటికీ సైబర్ క్రైమ్ నిందితులు అక్కడక్కడ వారి ఉనికి చాటుతూనే ఉన్నారు.. ఈ మేరకు సీపీ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు విశాఖ నగర సైబర్ క్రైమ్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు..తాజాగా క్రికెట్ బెట్టింగ్, బెట్టింగ్ ప్రిడిక్షన్, కాల్ సెంటర్ నిర్వహిస్తున్న ప్రధాన బుక్కి అనకాపల్లి జిల్లాకు చెందిన బొంద గోపి తో పాటుగా విజయనగరం జిల్లా చందన మరో ఇద్దరు వ్యక్తులను పత్యేక మైన నిఘా విభాగమును పెట్టి, సాంకేతిక పరిజ్ఞానంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.. ప్రధాన నిందితుడు బొంద గోపి సుమారు 20 బ్యాంక్ ఖాతాలను కలిగి ఉన్నట్టు విచారణలో తేలింది.. క్రికెట్ బ్రహ్మ, గోపి క్రికెట్ అనాలిస్ట్, క్లాసిక్ ప్రీడెక్షన్, విన్నర్ ఐపిఎల్, బోల్డ్ ప్రిడిక్షన్, జెన్యూన్ ప్రిడిక్షన్స్ అనే 6 చానల్స్ ను టెలిగ్రామ్ లో ప్రారంభించి వాటి ద్వారా క్రికెట్ బెట్టింగ్ మీద ఆశక్తి ఉన్నవారిని టార్గెట్ చేస్తారు. ప్రధాన నేరస్థుడు వద్ద పనిచేసే వాళ్ల ద్వారా బెట్టింగ్ మీద ఆసక్తి ఉన్న వారి దగ్గరి నుంచి వివరాలు, అమౌంట్ కలెక్ట్ చేసుకుని వారికీ లాగిన్ ఇచ్చి బెట్టింగ్ వేసే విధంగా నేరాలకు పాల్పడినట్లు విచారణలో తేలింది. నిందితుడికి పదివేల మంది టెలిగ్రామ్ ఛానల్ ఫాలోవర్స్‌గా ఉండగా, అందులో కొంతమంది పంటర్స్ ను సేకరించి వారిలో సుమారుగా రోజుకి 300 నుండి 500 వరకు పంటర్స్ ఒక మ్యాచ్ పైన బెట్టింగ్ ఆడేవిధంగా చేస్తున్నట్టు గుర్తించారు..అలానే నిందితుడు కాల్ సెంటర్ మాదిరి రన్ చేస్తున్నట్టు పోలీసుల గుర్తించారు.. నేరస్థుల ద్వారా మరికొంత మంది బెట్టింగ్ నిర్వహిస్తున్న బూకీ ల గురుంచి సమాచారం వెలుగులోకి వచ్చినట్టు పోలీసులు తెలిపారు. ఈ మేరకు వారిని బెట్టింగ్ ప్రత్యేక బృందాల ద్వారా పట్టుకుని అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు. ఆన్లైన్, ఆఫ్లైన్ బెట్టింగ్లలో తక్కువ డబ్బుల పెట్టుబడికి ఎక్కువ లాభాలు వస్తాయని ప్రజలకు ఆశ చూపించి లక్షల రూపాయలు కొల్లగొట్టడం జరుగుతుందనీ తద్వారా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. బెట్టింగ్ గేమ్స్ జోలికి వెళ్ళకుండా ఉండాలని మనవి చేశారు. ఎవరైనా ఆన్లైన్ లేదా ఆఫ్లైన్ బెట్టింగ్ నిర్వహించిన, నిర్వహిస్తున్న వారికి సహకరించిన, లేదా మీరు బెట్టింగ్ లో పాల్గున్న చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సైబర్ క్రైమ్ పిర్యాదుల కొరకు సైబర్ క్రైమ్ ఫిర్యాదుల కొరకు టోల్ ఫ్రీ నెంబర్: 1930 లేదా 7995095799 నెంబర్‌కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు.

## శాకాంబరిగా శ్రీ ఎరుకుమాంబ అమ్మవారు

విశాఖపట్నం జూలై 20, ప్రభాతవార్త



దొండపర్తిలోని శ్రీ ఎరుకుమాంబ అమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాడ మాసం నాలుగవ ఆదివారం సందర్భంగా శ్రీ అమ్మవారి దేవస్థానంను కూరగాయలతో నేత్ర పర్వముగా అలంకరించారు. ఆదివారం తెల్లవారుజాము నుండి భక్తులు పెద్ద సంఖ్యలో శ్రీ అమ్మవారిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జీవీ రమాభాయి శ్రీ అమ్మవారి తొలి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు శ్రీ అమ్మవారికి క్షీరాభిషేకాలు,కుంకుమార్చనలు, ఘనంగా జరిగాయి భక్తులు బారులు దీరి శ్రీ అమ్మవారిని దర్శించుకొన్నారు. ఈ నెల 25నుండి శ్రావణమాస ఉత్సవాలు ప్రారంభం కావడంతో శాకాంబరి అవతారానికి విశేష ప్రాచుర్యం ఏర్పడింది.

## రోటరీ క్లబ్‌చే 2వ స్వచ్ఛ దేవాలయం ప్రాజెక్ట్ ప్రారంభం

జగదాంబ, జులై 20, ప్రభాతవార్త



ఆలయాల్లో పరిశుభ్రత, స్వచ్ఛత కల్పించడం అభినందనీయమని వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ అన్నారు. ఆదివారం రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ తమ 2వ స్వచ్ఛ దేవాలయం ప్రాజెక్ట్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఈ ప్రాజెక్టును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ దేవాలయం లక్ష్యంతో రోటరీ సంస్థ దేవాలయాలు, ప్రజా ప్రదేశాలలో పరిశుభ్రత, స్థిరత్వాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఈ ప్రాజెక్ట్ వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్‌పై దృష్టి పెడు తుందన్నారు. రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ పర్యావరణంపై సానుకూల ప్రభావం చూపడానికి అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారని కొనియాడారు. కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్ రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ ప్రయత్నాలను ప్రశంసిస్తూ, "ఆలయ వ్యర్థాలను రీసైక్లింగ్ చేయడంలో రోటరీ క్లబ్ వైజాగ్ జంటలు తీసుకున్న చొరవను అభినందిస్తున్నానన్నారు. ఈ ప్రాజెక్ట్ సమాజ సేవ పర్యావరణ నిర్వహణకు గొప్ప ఉదాహరణ." మిగులుతుందన్నారు.3020 జిల్లా గవర్నర్ నామినీ శోభన్ ప్రకాష్ రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ చేస్తున్న కృషిని నేను అభినందిస్తున్నానన్నారు.

## శ్రీమన్నారాయణ యాగం కోసం భూమి పూజ

విశాఖపట్నం, జులై 20 ప్రభాతవార్త



ప్రపంచ శాంతి కోసం సనాతన ధర్మ ఫౌండేషన్ స్థాపకుడు మహా మండలేశ్వర్ అనంత విభూషిత నారాయణా నందగిరి మహారాజ్ (శ్రీ పంచాయతి తపోనిధి నిరంజని అఖాడా) ఆధ్వర్యంలో అష్టోత్తర శత కుండాత్మక శ్రీ మహాలక్ష్మి సమేత శ్రీమన్నారాయణ యాగం చేయ సంకల్పించినట్లు కశింకోట వాస్తవ్యుడు, సహస్రాదిక దేవాలయ ప్రతిస్థాపకుడు,అర్చక ఎగ్జామినర్ రేజేటి శ్రీ రామాచార్యులు తెలిపారు.ఆదివారం రామకృష్ణా బీచ్ కాళీమాత ఆలయం వెనుక ఏపీఐఐసీ గ్రౌండ్స్ లో రేజేటి శ్రీ రామాచార్యులు సారధ్యంలో యాగశాల నిర్మాణానికి భూమి పూజ చేసారు.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని కాపాడటానికి పూర్వకాలంలో ఋషులు అనేక యజ్ఞ యాగాదులు చేసేవారన్నారు.ప్రస్తుత సమాజంలో నెలకొన్న అనేక విపత్తులు నివారించడానికి విశ్వ శాంతికోసం నారాయణా నందగిరి మహారాజ్ దేశవ్యాప్తంగా 12 యాగాలు నిర్వహించాలని సంకల్పించారని అందులో మొదటిది విశాఖలో ఆగస్టు 7 నుంచి 10వ తేదీవరకు నిర్వహిచడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

## పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ మెరుపు దాడి

**- 9 మంది జూదరులు అరెస్ట్ రూ.51200 లు స్వాధీనం**

విశాఖ క్రైమ్, ప్రభాతవార్త



జూదరుల పై టాస్క్ ఫోర్స్ పోలీసులు కొరడా ఝులిపించారు. పేకాట స్థావరం పై నిఘా వేసి పేకాటరాయుళ్ళ భరతం పట్టారు. విశాఖ నగరంలోని భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలలోనీ తాళ్లవలసలో ఓ పేకాట స్థావరంలో కొందరు జూదం ఆడుతున్నట్టు టాస్కోఫ్ఫర్స్ పోలీసులకు సమాచారం అందింది.ఈ మేరకు టాస్క్ ఫోర్స్ సీఐ భాస్కరరావు నేతృత్వంలోనీ ఎస్సై భరత్ కుమార్ రాజు తన సిబ్బందితో కలిసి ఆ స్థావరం పై దాడి చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోనికి తీసుకున్నారు..వారి నుండి రూ. 51,200 లు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం వారిని భీమిలి పోలీసులకు అప్పగించారు. జూదం ఊబిలో కూరుకుపోయి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఈ సందర్భంగా టాస్కోఫ్ఫర్స్ సిఐ భాస్కరరావు జూదగాళ్లకు హితవు పలికారు.

## ప్రమాద బాధితునికి ఆర్థిక సహాయం

గాజువాక,జులై 20 ప్రభాతవార్త



జీవీఎంసీ 65వ వార్డ్ వాంబే కాలనీ లో నివాసం ఉంటున్న శివకుమార్ జీవనోపాధిగా చెరుకు రసం బండి నిర్వహిస్తున్నాడు. అందులో భాగంగానే ఈనెల జూలై 6 న చెరుకు రసం చేస్తుండగా మిషన్ లోకి తన కుడి చెయ్యి వెళ్ళిపోవడంతో పూర్తిగా నుజ్జు అయిపోయింది. వైద్యం కోసం వెంటనే కె జి హెచ్ కు తరలించారు. ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి పొందుతున్నాడు. దింతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న శివకుమార్ కు జనసేన పార్టీ సంయుక్త టిడిఎస్ ఫౌండేషన్ సంయుక్తంగా రూ 11,500 రూపాయలు ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అనిల్,శ్రీను,కార్తీక్,యశ్వంత్,హారీష్,జ్యోతి,సురేష్,బొడ్డేపల్లి సంతోష్ కుమార్,మహేష్ ,దుర్గాప్రసాద్, త్రినాథ్, రాజకుమార్, దిలీప్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

### మొదటిపేజీ తరువాయిలు

## పాడి రైతులు, ఉద్యోగుల సంక్షేమమే నా బాధ్యత



ఈ వ్యాధి కి గురైనా వారికి అది ఏ దశలో ఉందో ముందుగానే గుర్తించి ప్రాథమిక దశలోనే వైద్యం అందించే దిశగా ప్రముఖ క్యాన్సర్ హాస్పిటల్ వారితో ఒప్పందం చేసుకొని ఉద్యోగులు రైతుల కు వారి కుటుంబాలకు తగిన చికిత్స అందించే దిశగా కార్యక్రమం ఏర్పాటు చేస్తామని అన్నారు, డైరీ ఉద్యోగులు అందరికి ప్రమోషన్స్, పర్మినెంట్ విధానం లోకి తెచ్చే విధంగా మెరుగైన విధానలు అమలు చేస్తామని అన్నారు, డైరీ ప్రగతి కి ప్రతి ఉద్యోగి తమ కర్తవ్యం సమర్థవతంగా నిర్వహించాలని అన్నారు.కార్యక్రమంలో పెద్దసంఖ్యలో డైరీ ఉద్యోగులు, పాలక వర్గ సభ్యులు, డైరీ సీఈఓ ఎస్. వి. రమణ, ఇతర ఉన్నతాదికారులు పాల్గొన్నారు.

## రైతులను పీడిస్తున్న అధికారి

నిర్వహించగా విచిత్రంగా మూడు నెలలకే ఆయన ఇక్కడి నుండి రాజమండ్రి కి ట్రాన్స్ఫర్ అయ్యారు. ఆయన స్థానంలో మచిలీపట్నం నుండి అనకాపల్లి జిల్లాకు ఇన్చార్జి ఏడి గా ఎస్. గోపాలరాజు వచ్చారు. ఈయన విశాఖపట్నం కు చెందినవారు కావడంతో ఇక్కడే పాతుకుపోయే విధంగా లాబీయింగ్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అనకాపల్లి జిల్లాకు ఎవరూ పూర్తిస్థాయి ఏడి రాకుండా అడ్డుకుంటున్నారు అనే ఆరోపణలు కూడా చాలాకాలంగా వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలు నిజమే అన్నట్లుగా, ఈయన స్థానంలో పూర్తిస్థాయి ఏడిగా ప్రభుత్వం మనీషా త్రిపాఠిని నియమించింది. ఏం జరిగిందో తెలియదు ముచ్చటగా ఈమె కూడా మూడు నెలలు తిరక్కుండానే బదిలీ జరిగింది. తిరిగి ఇన్చార్జి ఏడీగా ఈయనే విధులను నిర్వహిస్తుండడం గమనార్హం. ఇటీవల జరిగిన జనరల్ ట్రాన్స్ఫర్స్ లో శ్రీకాకుళం జిల్లా ఏడిగా ఉన్న విజయ్ కుమార్ ను, అక్కడి నుండి అనకాపల్లి జిల్లాకు పూర్తిస్థాయి ఏడిగా నియమించినట్లు కొన్ని పత్రికలలో వార్తలు కూడా వచ్చాయి. కానీ ఏం జరిగిందో తెలియదు ఆయన అనకాపల్లి రాలేదు. ఎవరూ ఇక్కడకు ఎందుకు రావడం లేదు ? వచ్చిన వారు మూడు నెలలకే ఎందుకు చాప చుట్టేస్తున్నారు ? అసలు ఈ శాఖలో ఏం జరుగుతుంది ? పోనీ సమర్థుడైన అధికారి ఈ సీటులో ఉన్నారా అంటే అదీ లేదు ? ఈయన సమస్యలను వాయిదాలు వేస్తుంటారు తప్ప పరిష్కరించలేరనే అపవాదు ఉంది. ఇక్కడికి పూర్తిస్థాయి ఏడి రాకుండా ఎవరు చక్రం తిప్పుతున్నారు ? సర్వే సమస్యలపై పదే పదే పీజీఆర్ఎస్ కు ఫిర్యాదులు చేస్తుంటే సమస్య పరిష్కరించాల్సిన జిల్లా కలెక్టర్ ఏం చేస్తున్నట్లు ? జిల్లాకు చెందిన స్పీకర్, హోం మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి ఈ సమస్యపై దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

## విశాఖలో రూ.100 కోట్ల మోసం




సీతామహాలక్ష్మీ, ఉండవల్లి శ్రీనివాసరావు, ఎల్.విశ్వేశ్వరరావు, మేనేజర్ రంగారావు, ఎకౌంటెంట్ ధనలక్ష్మిలను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితులకు న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. చైర్మన్ శివభాగ్యారావు పరారీలో ఉండగా, మరో 12 మంది కోసం గాలింపు కొనసాగుతోంది.

## కూటమి ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధాలను ఎండకట్టడమే లక్ష్యం

కార్యక్రమం నిర్వహిస్తే ఆ కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చిన ఆదరణ చూసి ఈ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మీద వ్యతిరేకత ఎక్కువగా ఉందని గ్రహించి తల్లికి వందనం నిధులను అర కొరగా విడుదల చేసింది అని అన్నారు. ప్రజల పక్షాన పోరాడుతున్న వైసిపి నాయకుల మీద కార్యకర్తలు మీద కూటమీ ప్రభుత్వం లేనిపోని తప్పుడు కేసులు పెట్టీ ఇబ్బందులకు గురి చేస్తుందని, కూటమి ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టినా 2024 లో ఇచ్చిన ప్రతి హామీని అమలుపరిచే వరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, పోరాటం చేస్తూనే ఉంటారని అన్నారు. ఈ సమావేశం తరువాత వార్డు లో ఉన్న ఇంటి ఇంటికి వెళ్లి 2024 ఎన్నికల్లో కూటమి పార్టీ ఇచ్చిన హామీలు ప్రకారం అర్హత ఉన్న లబ్ధి దారులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగారు. చాలా మంది మహిళలు మాకు ఈ కూటమి ప్రభుత్వం లో ఎటువంటి సంక్షేమ పథకాలు రావడంలేదని కె . కె రాజు కి తెలియజేశారు. బాబు షూరిటీ మోసం గ్యారంటీ కరపత్రాలను ప్రజలకి చూపించి బాబు చేసిన మోసాలను ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్ కె.అనిల్ కుమార్ రాజు, 24వ వార్డు అధ్యక్షుడు గుడ్ల అశోక్ కుమార్ రెడ్డి విశాఖ జిల్లా స్టూడెంట్ యూనియన్ అధ్యక్షుడు పులగం కొండారెడ్డి , ఉత్తర నియోజకవర్గ వాణిజ్య విభాగ అధ్యక్షుడు కర్రి మురళి కృష్ణా రెడ్డి, సీనియర్ నాయకులు దల్లి రామకృష్ణ రెడ్డి, నీలిరవి, వార్డు నాయకులు లోకేష్, సీతా కుమారి, నక్కవానిపాలెం , రేసపువానిపాలెం, క్రాంతి నగర్ ,గాంధీనగర్, తులసిపేట ,వినాయక నగర్ ,గ్రామ పెద్దలు,నాయకులు, కార్యకర్తలు,బూత్ కన్వీనర్లు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## విశాఖలో మరో విషాదం

**- గోడ కూలి ఇద్దరి మృతి మల్కాపురం పోలీసుల దర్యాప్తు**

విశాఖ క్రైమ్, ప్రభాతవార్త

విశాఖ నగరంలో మరో ఘోర ప్రమాదం జరిగింది. డాక్ యార్డ్ సమీపంలోని ప్రత్యూష గోదాంలో గోడకూలి ఇద్దరు కార్మికులు మృతి చెందారు. నౌక లద్వారా పోర్టుకు వచ్చిన వ్యవసాయ ఉత్పత్తులను ఇక్కడ ప్యాకింగ్ చేస్తుంటారు. ఈ గోదాంకు ప్రహరీ గోడ నిర్మాణ పనులను కొద్దిరోజులుగా చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం నిర్మాణంలో ఉన్న గో డకూలిపోవడంతో ప్రకాశ్ నగర్ కు చెందిన ధర్మారావు, జనతా కాలనీకి చెందిన రామారావు మృతి చెందారు.ఈ మేరకు ఘటనా స్థలానికి చేరుకు న్నమల్కాపురం పోలీసులు మృతదేహాలను పోస్టమార్టం నిమిత్తం కేజీహెచ్ కు తరలించారు.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు..

## బ్రహ్మకుమారీస్ సేవలు భేష్

విశాఖపట్నం ప్రతినిధి, జూలై 20, ప్రభాతవార్త



బ్రహ్మ కుమారీస్ సామాజిక సేవా కార్యక్రమాలు భేష్ అని ప్రముఖ వైద్యులు ఎ.మురళీధర్ అన్నారు. ఆదివారం, బ్రహ్మకుమారీస్ రైల్వే న్యూ కాలనీ శాఖ ఆధ్వర్యంలో, శ్రీ శ్రీనివాస కల్యాణ మండపములో తేజావతి మాతాజీ ప్రథమ వర్ధంతి సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తేజావతి మాతాజీ బ్రహ్మకుమారీ సంస్థ అభివృద్ధికి విశాఖపట్నం లో ఎనలేని కృషి చేశారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీలు, రోటరీ బ్లడ్ సెంటర్, విశాఖపట్నం సంయుక్తంగా ఆ ప్రాంగణంలో రక్త దాన శిబిరాన్ని ఏర్పాటు చేసారు. 25 మంది సభ్యులు స్వచ్ఛందంగా దానం చేశారు. రోటరీ బ్లడ్ సెంటర్ చైర్మన్ కే.వి. శ్రీనివాస రావు, డాక్టర్ ఎ.మురళీధర్, డాక్టర్ అశోక్ వారి బృందంతో విచ్చేసారు. ఈ సందర్భంగా మురళీధర్ మాట్లాడుతూ ఒక వ్యక్తి రక్త దానం, ముగ్గురు ప్రాణాలు నిలబెడుతుంది అని, 18 సం నుండీ 65 సం వయస్సు గల వారు 4 నెలల వ్యవధిలో దానం చేస్తే మంచిది అని చక్కగా వివరించారు. బ్రహ్మ కుమారీస్ ఇలాంటి స్వచ్ఛంద సేవ కార్యక్రమాలు నిర్వహింస్తున్నదుకు హర్షం వ్యక్తం చేశారు. బ్రహ్మకుమారీస్ ఇంచార్జి రాజయోగిని బీకే శశికళ మాట్లాడుతూ ఈ కార్యక్రమం బ్రహ్మ కుమారీస్ సోషల్ సర్వీస్ వింగ్ ప్రేరణతో నిర్వహిస్తున్నారని, కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని కోరారు.

## రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల ట్రోఫీ ఆవిష్కరణ

గాజువాక,జులై 20 ప్రభాతవార్త



10వ గ్రేటర్ విశాఖ డిస్ట్రిక్ట్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్షిప్ ట్రోఫీ నీ బిజెపి గాజువాక మాజీ కన్వీనర్ కిక్ బాక్సింగ్ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కరణంరెడ్డి నరసింగరావు చేతుల మీదగా పాత కర్నవానిపాలెం ఆయన కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై నెల 27న విశాఖలో జరగబోయే ఛాంపియన్ షిప్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు అక్టోబర్ నెలలో అస్సాం రాష్ట్రంలో జరగబోయే జాతీయస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు అర్హత సాగిస్తారని అని అన్నారు. ఇటీవల ఆంధ్ర రాష్ట్రం నుండి రిఫరీలుగా, జడ్జీలుగా ఎంపికైన పలువురుకి టీ షర్టులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో న్యూ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రెసిడెంట్ గంట నూకరాజు,వైస్ ప్రెసిడెంట్ డి .ప్రేమ్ కుమార్ ,జనరల్ సెక్రెటరీ ఎన్ .సతీష్ కుమార్, చీఫ్ ఆర్గనైజరు వర్మ, కే .రాజు ,ప్రసాద్,శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## కన్యకా పరమేశ్వరి అమ్మవారికి శాఖాంబరికా అలంకరణ

పద్మనాభం, జూలై 20, ప్రభాతవార్త



పద్మనాభం గ్రామంలో మండల పరిషత్ కాంప్లెక్స్ వెనుక ఉన్న కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి ఈ నెల 22 వ తేదీన శాఖాంబరి అలంకరణ ఉంటుదని ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధి నానాజీ శ్రీను అన్నారు. ఉదయం అమ్మవారికి పంచామృత అభిషేకాలు అనంతరం అమ్మవారిని పలు రకాల కూరగాయతో అలంకరణ చేస్తారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంను విజయవంతం చేయాలని కోరారు.

Main tab page 62_Main tab page 62.qxd 7/21/2025 12:29 AM Page 1



## రాజకీయ ఎత్తుగడల ఉత్కంఠకు తెర..

- మండల టిడిపి అధ్యక్షుడిగా చంద్రరావు, ప్రధాన కార్యదర్శిగా దొరబాబు

**కొయ్యూరు, జూలై 20 ,ప్రభాతవార్త**



మండల టీడీపీ అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శి ఎవరనే ఉత్కంఠకు తెర వీడింది. మండల టిడిపి అధ్యక్షుడిగా కాకూరు చంద్రరావు, ప్రధాన కార్యదర్శిగా తోట వీర సత్యనారాయణ(దొరబాబు ) ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు పార్టీ ప్రతినిధులు తెలిపారు. ఇటీవల మండల కేంద్రంలో నాటకీయంగా జరిగిన మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్నికలు వివాదానికి దారి తీసిన విషయం తెలిసిందే. రెండు వర్గాల మధ్య హోరాహోరీ గొడవ సాగింది. ఆ సమయంలో ఎన్నికను తాత్కాలికంగా నిలిపి కల చేస్తున్నట్టు పరిశీలకులు తెలిపారు. ఒక దశలో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి డౌన్ డౌన్ అంటూ మరో వర్గం నేతలు నినాదాలు చేయడం మరింత గొడవకు దారితీసింది. ఈ నేపథ్యంలో మండల టిడిపి అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శి గా ఎవరు ఎన్నికవుతారో అంటూ కార్యకర్తల ఆసక్తిగా చర్చించుకుంటున్న సమయంలో ప్రధాన రెండు వర్గాలకు చెందిన ఇరువురు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికవ్వడం ఈ సస్పెన్స్ కు తెర తీసినట్టు అయింది. ఇదిలా ఉండగా మూడో వర్గంగా పేరొందిన మరికొంతమంది నేతలు జీరో గా మిగిలినట్టయింది అయిందని రాజకీయ విశ్లేషకులు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.

## జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ సమావేశం

**రాజవొమ్మంగి, ప్రభాతవార్త**



రాజవొమ్మంగిలో ఆదివారం జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ మండల అధ్యక్షులు లింగేటి గౌరీశివలక్ష్మి, సురేష్ కుమార్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్బంగా గౌరీ శివలక్ష్మీ మాట్లాడుతూ మహిళలు పట్ల అసభ్యకర వాఖ్యలు చేసినా వారి హక్కులను హరింప జేయాలని చూసినా సమస్యను మాదృష్టికి తేవచ్చునని అన్నారు. జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ దృష్టికి సమస్యను తీసుకొని వెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిధిగా గిరిజన సంఘ అధ్యక్షులు లోతా రామారావు హాజరైనారు. ఈ సమావేశంలో కొండపల్లి సర్పంచ్ కుంజం జగన్నాదం, బడదనాంపల్లి ఎంపిటిసి సుంద్రు లోవలక్ష్మీ, గుర్రం సాయి, బొరగా రామకృష్ణ, దాసరి సూరిబాబు, గొల్లపల్లి మంగ, మంగా పద్మావతి పాల్గొన్నారు.

## సచివాలయాల్లో చేరిన 64 మంది నూతన ఉద్యోగులు

**రాజవొమ్మంగి, జూలై 20, ప్రభాతవార్త**



సచివాలయం ఉద్యోగులు బదిలీలు ప్రక్రియ జరిగిన విషయం తెలిసిందే. మండలంలో గల 16 సచివాలయాల్లో 64 మంది విధుల్లోకి చేరగా 57 మంది బదిలీ పై వెళ్లారని ఎంపిడిఓ లోకుల యాదగిరేశ్వరరావు తెలిపారు. గ్రేడ్.. 5 కార్యదర్శులు నలుగురు, పశువైద్య సహాయకులు 5 మంది, వ్యవసాయ సహాయకులు 9 మంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ 11, డిజిటల్ అసిస్టెంట్స్ 17 మంది, ఏ. ఎన్.యం.లు నలుగురు, మహిళా పోలీసులు ముగ్గురు, వెల్ఫేర్ అసిస్టెంట్స్ 8 మంది, విలేజ్ సర్వేయ్యర్ లు ఒక్కరు, హార్టికల్చర్ ఇద్దరు నూతనంగా శనివారంకు విధుల్లోకి చేరారని ఎంపిడిఓ అన్నారు.

## ముర్లవానిపాలెంలో గ్రామదేవత పండుగ

**రాజవొమ్మంగి, జూలై 20, ప్రభాతవార్త**



రాజవొమ్మంగి పంచాయితీ ముర్లవానిపాలెం గ్రామంలో గ్రామ గొరవలు సోముల ఎర్రయ్య, సోముల పెదగంగమ్మ, గ్రామస్తులు ఐక్యంగా గ్రామ దేవత చెరుకు కొండమ్మ తల్లి పండుగను ఘనంగా చేసుకొన్నారు. తొలకరి సాగుకు ముందు ఈపండుగ చేస్తామని గొరవలు ఎర్రయ్య అన్నారు. పంటలు పుష్కలంగా పండాలని, అందరూ ఆరోగ్యంగా ఉండాలని గ్రామదేవతను కోరుకొంటామని అన్నారు. మూడు రోజుల ముందు గ్రామ సరిహద్దుల్లో పొలిమేర పూజలు చేసి అనంతరం ప్రతీ రోజులు కోళ్లు, నందరాటతో పండుగ కొనసాగింది. ఆదివారం గ్రామ సమీప అడవిలో వెలసిన గ్రామదేవతకు దీప, ధూప, నైవేద్యాలతో పూజలు చేసి మొక్కులను తీర్చుకొన్నారు. అందరూ కలిసి అక్కడే వంటలు చేసుకొని భోజనాలు తదుపరి గ్రామానికి చేరుకొన్నారు. ఈకార్యక్రమంలో సోముల పెద గంగమ్మ, ఇరటా అప్పలరాజు, సోముల ఎర్రయ్య, అప్పెల రాజేశ్వరి, మడియాల పైడితల్లి, వీదర సోమరాజు, టెంకే రాజేశ్వరి, ఇరటా భూలక్ష్మి, వెలుగుల వీరలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా పాడేరు శ్రీ మోదకొండమ్మ అమ్మవారి శాకాంబరీ మహోత్సవాలు

**పాడేరు, జూలై 20, ప్రభాతవార్త**





ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్యదేవత,మన్య ప్రజల ఇలవేల్పు పాడేరు శ్రీ మోద కొండమ్మ తల్లి అమ్మవారి శాకాంబరీ మహోత్సవాలు అత్యంత వైభవంగా.. ఘనంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగాయి. శాకాంబరి మహోత్సవాల్లో భాగంగా శ్రీ మోద కొండమ్మ తల్లి అమ్మవారిని అన్నిరకాల కూరగాయలు,కు రకాలు,నిమ్మకాయలు,వివిధ రకాల పండ్లతో శాకంబరి అమ్మవారిగా ముస్తాబు చేశారు. అలాగే అమ్మవారి ఆలయంలో కాయగూరలతో గుమ్మడి కాయలతో వినాయకుడిని అమ్మవారిని భక్తులను ప్రత్యేకంగా ఆకర్షణీయంగా ఏర్పాటు చేశారు. అలాగే ఆలయం ప్రాంగణం అంతా వివిధ రకాల కూరగాయలు,పండ్లతో అలంకరించారు. శాకాంబరి అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు ఆదివారం ఉదయం నుండే బారులు తీరారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేయగా అమ్మవారి అన్నప్రసాదాన్ని అధిక సంఖ్యలో భక్తులు హాజరై ప్రసాదాన్ని స్వీకరించారు.

## ఆమె పనితీరు విధానం.. సంధ్య సమయం..!

- బదిలీ హెచ్ఎంకు ఘన సన్మానంలో వక్తల ప్రశంసలు

**కొయ్యూరు జూలై 20 ప్రభాతవార్త**



విధి నిర్వహణలో ఆమె పనితీరు, సాయంకాల సంధ్యా సమయంలా ప్రశాంతంగా, అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుందని బదిలీ హెచ్ఎం ను ఉద్దేశించి పలువురు వక్తలు కొనియాడారు. 2025 26 విద్యా సంవత్సర ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా మండలంలోని కొమ్మిక జి.టి.డబ్ల్యు.ఆశ్రమోన్నత పాఠశాల హెచ్ఎం సుమిత్ర సంధ్య ఇటీవల మండలంలోని పెద మాకవరం ఆశ్రమోన్నత పాఠశాలకు బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆమె పాఠశాలకు చేసిన విశేషమైన సేవలను క్లస్టర్ ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు కొనియాడారు. ఈ సందర్భంగా ఆదివారం కొమ్మిక ఆశ్రమోన్నత పాఠశాలలో సత్కార సభను ఏర్పాటు చేసి ఆమెకు దుస్సాలువాలు కప్పి, జ్ఞాపికను అందించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈఓ ఎల్. రాంబాబు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. సత్యనారాయణ, సిబ్బంది, జడ్పీ ఉన్నత పాఠశాల బాలారం హెచ్ఎం వి.జె.ఎస్. ప్రసాద్, అప్పన కన్నారావు, ఇతర సిబ్బంది, పీఆర్టీయూ అధ్యక్షులు వేంపాటి తులసిరావు, గౌరవ అధ్యక్షులు కే.మురళీ, ఉపాధ్యాయులు సత్యనారాయణ తదితర ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొనడం జరిగింది. అలాగే బదిలీలో ఈ క్లస్టర్ కు నూతనంగా విచ్చేసిన ఉపాధ్యాయులకు కూడా స్వాగత కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది క్లస్టర్ లో ఆదర్శంగా పనిచేసిన ప్రతి ఉపాధ్యాయుడికి ఈ విధంగా ఘన సత్కారం లభిస్తుందని గ్రామస్తులు తెలియజేశారు.

# ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హామీని నెరవేర్చాలి

- ఐదో షెడ్యూల్డ్ ప్రాంత చట్టాలు ఆధారంగా నియామకాల చట్టం చేయాలి
- అభిప్రాయాలు, అర్జీలు స్వీకరించడానికి ప్రత్యేక అధికారిని నియమించాలి
- ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జెఎసి జిల్లా చైర్మన్ రామారావు దొర డిమాండ్

**పాడేరు, జూలై 20, ప్రభాతవార్త**



షెడ్యూల్డ్ ప్రాంత ఆదివాసులకు వంద శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి కట్టుబడి ఉన్నామని, ఏజెన్సీలో ఉద్యోగాలు స్థానిక ఆదివాసులకే ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదివాసులకు ఇచ్చిన హామీని నేవేర్చాలని, ఐదో షెడ్యూల్డ్ ప్రాంత ప్రత్యేక చట్టాల ఆధారంగా"షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం" చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జెఏసి జిల్లా చైర్మన్ రామారావు దొర ప్రభుత్వానికి డిమాండ్ చేసారు. అలాగే మెగా డిఎస్సీలో ప్రకటించిన ఏజెన్సి ప్రాంత ఉపాధ్యాయ పోస్టులను స్థానిక ఎస్టి అభ్యర్థులతో భర్తీ చేయాలనీ, ఉద్యోగ నియామకాల చట్టం చేయాలన్నది ఆదివాసుల డిమాండ్ మాత్రమే కాదని, భారత రాజ్యాంగ స్ఫూర్తి ఉందని రామారావు దొర గుర్తుచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని షెడ్యూల్డ్ ఏరియా తెగల సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి రంగాలలో ఎదుర్కొంటున్న అసమానతలను రూపుమాపడానికి 1986 లో దివంగత ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు జివో నంబర్ 275ని తీసుకువచ్చారని, ఆ తరువాత న్యాయపరమైన సవాలు ఎదుర్కొని 2000 లో అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న నారా చంద్రబాబునాయుడు జివో నంబర్ 3ని తీసుకువచ్చారని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జెఏసి ఎఎస్సార్ జిల్లా చైర్మన్ రామారావు దొర స్పష్టంచేసారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 244(1) ని అనుసరించి ఐదో షెడ్యూల్ పేరా 5(1) 5(2)ల రక్షణ ప్రమాణాలకు అనుగుణంగా షెడ్యూల్డ్ ప్రాంతాలలో ఆదివాసుల జీవనోపాధిని రక్షించడం, వారిని వృద్ధిలోకి తీసుకురావడం (ఉద్ధరించడం) ప్రభుత్వాల అత్యవసరమైన, చట్టపరమైన బాధ్యత అని గుర్తుచేశారు. జివో నంబర్ 3 స్ఫూర్తిని కాపాడటానికి"లోకల్ క్యాడర్ పోస్టుల న్నీటిని స్థానిక ఆదివాసులకు రిజర్వ్ చేస్తు, జోనల్ కెడర్ పోస్టులలో 50 శాతం, స్టేట్ కెడర్ పోస్టులలో 30 శాతం రిజర్వేషన్లతో సమగ్రమైన చట్టం చేయాలనీ కోరారు. జివో నంబర్ 3 రద్దు అనంతరం ఏజెన్సీలో ఆదివాసుల ఉద్యోగ భద్రతకు షెడ్యూల్డ్ ప్రాంతాల ఉద్యోగ నియామకాల చట్టం చేయాలని గత నాలుగున్నర ఏళ్లుగా ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జెఏసి పోరాడుతుందని, రాష్ట్ర ప్రభుత్వానికి, ఆదివాసి జెఏసికి మధ్య చర్చలలో ఉద్యోగ నియామకాల చట్టం చేయడానికి ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించిందన్నారు. అయితే, ప్రభుత్వం వంద శాతం, ఏభై శాతం, జనాభా ఆధారిత కోటాలలో ఎదో ఒక విధానాన్ని అనుసరించాలని యోచిస్తుందని, ప్రభుత్వం సూచించిన మూడు పద్దతులకు ఆదివాసి జెఏసి తమ అభిప్రాయాన్ని తెలిజేసిందన్నారు. స్థానిక షెడ్యూల్ తెగల (శీగిల) కేంద్రీకృత నమూనా, కోల్పోయిన మూలాలు, షెడ్యూల్డ్ ప్రాంత స్థితి ఆధారంగా రాజ్యాంగం అనుమతించదగిన పద్దతులు అనుసరించాలని ఇప్పటికే ప్రభుత్వానికి సూచించినట్టు రామారావు దొర మీడియాకు స్పష్టం చేసారు. దేశం మొత్తంగా రిర్జర్వేషన్లు ఏభై శాతానికి మించాకుదదన్న మార్కును ఎకనమికల్ వికర్ సెక్షన్(ఈడబ్ల్యుఎస్)కు ఇచ్చిన పది శాతంతో అరవై శాతం మార్కును దాటేసిందని, అత్యంత నష్టపోయిన ఆదివాసుల విషయంలో ప్రభుత్వం కుంటిసాకులు చెప్పడం తగదన్నారు. ఇప్పటికే అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మిజోరం, మేఘాలయ రాష్ట్రాలలో స్థానిక ఎస్టిలకు 80 శాతం రిజర్వేషన్లు అమలులో ఉండగా, లక్షద్వీప్ లో స్థానిక ఎస్టిలకు నూరు శాతం రిజర్వేషన్ అమలులో ఉందని గుర్తుచేశారు. అలాగే, ఆర్టికల్ 370 రద్దు తరువాత ఇటివలే లడఖ్ లో 85 శాతం స్థానికులకు, 10 శాతం ఆర్థిక బలహీన వర్గాలకు (ఈడబ్ల్యుఎస్), 5 శాతం ఇతరులకు ఇచ్చారన్నారు. తెలుగు రాష్ట్రాలలో మాత్రం సుప్రీంకోర్టు జడ్జిమెంట్ ను బూచిగా చూపి ఆదివాసులకు ఇక రిజర్వేషన్లే వర్తిన్చావన్నట్టు పాలకులు వ్యవహరిస్తున్నారని రామారావు దొర ఆవేదన వ్యక్తంచేశారు. సుప్రీంకోర్టు తీర్పులో ఎమున్నప్పటికి, ఐదో షెడ్యూల్ ప్రాంతంలో 1/70 భూ బదలాయింపు నిషేద చట్టం, పెసా, అటవీ హక్కుల గుర్తింపు చట్టం వంటి కఠినమైన రాజ్యంగ చట్టాలు అమలులో ఉన్నాయని, వాటిని ఉల్లంగించడానికి వీలులేదని అన్నారు. 50 శాతం క్యాప్ పాలసీ ఆంధ్రప్రదేశ్ లో ఎప్పుడో దాటిపోయాయని, రాష్ట్రంలో ప్రస్తుత రిజర్వేషన్లు 59.5 శాతంకు (ఓబీసీ 27+ఎస్సి 15,+ఎస్టీ 75+ఈ డబ్ల్యూఎస్ 10) చేరుకున్నాయి. ఈ రిజర్వేషన్ల పరిమితికి ప్రామాణికంగా పరిగణించే ఇంద్రసహని తీర్పు ఆదివాసులకు అనవసరంగా అపదించి బయపెడుతున్నారని, 50 శాతం క్యాప్ పాలసీ షెడ్యూల్ ప్రాంతాలకు వర్తించదని పేర్కొన్నారు. జనాభా ఆధారిత కోటా విషయానికి వస్తే, షెడ్యూల్ ప్రాంతంలో జనాభా ఆధారిత రిజర్వేషన్లకు తావులేదని, చట్టపరంగా ప్రమాదకరమైనదిగా పరిణమించి, సామాజిక అశాంతిని, రాజ్యాంగపరమైన సమస్యలు పుట్టిస్తాయని, ఆదివాసేతరుల వలసలను ప్రోత్సహించి, ఆదివాసుల భూముల దుర్వినియోగం, రాజకీయ దోపిడీ జరగడానికి అవకాశం కల్పిస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. జివో నంబర్ 3 రద్దు, ఏజెన్సి చట్టాలపై ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్ ప్రతిభ భారతితో అన్ని ఐటిడిఎలలో సమీక్ష సమావేశాలు నిర్వహించడాన్ని ఆహ్వానిస్తూ, ప్రభుత్వం ఇంకా తాత్సారం చేయకుండా, నియామకాల చట్టం రూపొందించే ప్రక్రియా మొదలుపెట్టాలని రామారావు దొర కోరారు. అలాగే, నియామకాల చట్టం రూపకల్పనకు అన్ని ఐటిడిఎల పరిధిలో ఆదివాసుల అభిప్రాయాలు వినడానికి, అర్జీలు స్వీకరించడానికి ఆదివాసుల సంక్షేమము, అభివృద్ధి పట్ల ఆశక్తి కలిగి, నిష్పాపాతంగా వ్యవహరించే ఐఎయస్ అధికారి ని ప్రత్యేక అధికారిగా నియమించాలని రామారావు దొర కోరారు.

## చల్లంగి కొండలరావు మాస్టారు సేవలు మరువలేనివి

- రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్

**చింతపల్లి, జూలై 20, ప్రభాతవార్త**



చల్లంగి కొండలరావు మాస్టారు సేవలు మరువలేనివని మాజీ మంత్రి అరకు పార్లమెంట్ అధ్యక్షులు రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారు శ్రావణ్ కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని లంబసింగి ఆశ్రమ పాఠశాలలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్గా పనిచేసే ఇటీవల పదవీ విరమణ చేసిన చల్లంగి కొండలరావు నివాసానికి వెళ్లి ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ కొండలరావు మాస్టారు విద్యార్థులకు అందించిన సేవలు మర్చిపోలేనివని ఒక తండ్రి స్థానంలో వీరి బాధ్యతలు నెరవేర్చి వృత్తికి వన్నెతెచ్చారన్నారు. అనేకమంది విద్యార్థినీ విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి జీవితంలో మంచి స్థానాల్లో స్థిరపడేందుకు కృషి చేశారన్నారు. అలాగే అంబేద్కర్ గౌతమ బుద్ధుని ఆశయాల కోసం ప్రజల్లో చైతన్య నింపుతూ ఉండడం ఎంతో గర్వకారణమని అన్నారు. ఉద్యోగరీత్యా పదవీ విరమణ చేసినప్పటికీ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం పట్ల గిరిజన హక్కుల పట్ల ప్రజలకు ఎప్పుడు చైతన్యం కల్పించాలని గిరిజన హక్కుల పట్ల ప్రజలకు చైతన్య పరిచే ఆలోచన ఉండటం ఎంతో గొప్ప విషయం అని ఆయన కొనియాడారు. పదవీ విరమణ చేసిన కొండలరావు మాస్టారు మరియు కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఠాకూర్ వెంకటరమణ, దారిల సర్పంచ్ పాండురంగ స్వామి, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి సుబ్బారావు, మాజీ ఎంపీపీ ఉమా మహేష్, జిసిసి చింతపల్లి డివిజనల్ అధికారి బుక్కా వెంకటేష్, మేనేజర్ సుగునాదం, పాడి రామారావు, మురళి ,మహేష్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## చింతపల్లి మండల నూతన తహసీల్దారు ఆనంద్‌కు స్వాగతం

- ఎంపీపీ అనూష దేవి, జడ్పిటిసి పోతురాజు బాలయ్య

**చింతపల్లి, జూలై 20, ప్రభాతవార్త**



మండలంలోని రెవెన్యూ శాఖ సేవలను ప్రజలకు వేగంగా సమర్థవంతంగా అందించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ అనూష దేవి, జడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య తాసిల్దార్ ఆనంద్‌ని కోరారు. ఇటీవల బదిలీల్లో భాగంగా చింతపల్లి తహసిల్దారుగా బాధ్యతలు స్వీకరించిన ఆనంద్ ను శనివారం తహసిల్దార్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో నెలకొన్న భూవివాదాలు ,మువిటేషన్లో, కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాలు మంజూరు వంటి సేవలను వేగవంతం చేసి ప్రజల మన్ననలను పొందుకోవాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు అందాలు అంటే రెవెన్యూ సిబ్బంది గ్రామస్థాయిలో పనిచేయవలసిన అవసరం ఉందన్నారు. తహసిల్దార్ ఆనందు మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమం కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేసే విధంగా అందరినీ కలుపుకొని పనిచేస్తానన్నారు. పరస్పర సమన్వయంతో పనిచేస్తూ మండలంలో నెలకొన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించడానికి సమర్థవంతంగా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దురియ పుష్పలత పాల్గొన్నారు.

## అడ్డాకుల ప్లేట్లు తయారీతో గిరిజన మహిళలకు ఉపాధి

**అరకులోయ, జులై 20, ప్రభాతవార్త**



అరకులోయ లో గిరిజన మహిళలు అడ్డాకులతో ప్లేట్లు తయారు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం రాకతో అల్లూరి సీతారామరాజు జిల్లా గిరిజన ప్రాంతాల్లో గిరిజన మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగయ్యాయి. కూటమి ప్రభుత్వ పాలనలో, పాడేరు ఐటీడీఏ ప్రోత్సాహం తో గిరిజన మహిళలు అడ్డాకులతో ప్లేట్లు తయారు చేసే శిక్షణను పొంది, వన్ ధన్ వికాస్ కేంద్రం లో అడ్డాకుల ప్లేట్లు తయారుచేసి ఉపాధి పొందుతున్నారు. ప్రస్తుతం అరకులోయ లో విడివికే ఏర్పాటుచేసిన అడ్డా లీఫ్ కేంద్రంలో 10 మంది గిరిజన మహిళలు అడ్డాకులతో ప్లేట్లు తయారుచేస్తూ ఉపాధి పొందుతున్నారు. అలాగే ఉపాధి పొందడమే కాకుండా ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టడంలో తమ వంతు సహకారాన్ని అందిస్తూ తోటి మహిళలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రత్యేకంగా శిక్షణ పొందిన గిరిజన మహిళలు కుట్టు మిషన్‌లు ద్వారా అడ్డాకుల ప్లేట్లను తయారు చేస్తున్నారు. కాగా ఆదివారం పెదలబుడు మేజర్ పంచాయతీ సర్పంచ్ పెట్టెలి దాసుబాబు మాట్లాడుతూ అరకు అనేది యావత్ ప్రపంచానికి ఒక మధురానుభూతినిచ్చే ప్రాంతంగా, రెండవ కాశ్మీర్‌గా పేరుపొందిందని, అటువంటి అరకులోయలో ప్లాస్టిక్‌భూతాన్ని తరిమికొట్టేందుకు జిల్లా ఉన్నతాధికారుల ప్రత్యేక చర్యలు తీసుకున్నారు అని తెలిపారు. దీనిలో భాగంగా తమ పంచాయతీ తరపున నిత్యం దుకాణాల్లో తనికెల్లి నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్లాస్టిక్ రహిత అరకులోయ అయిన తీర్చిదిద్దడమే తమ పంచాయతీ లక్ష్యమని స్పష్టం చేశారు. విడివికెలో పదిమంది గిరిజన మహిళలు స్వచ్ఛమైన అడ్డాకులతో ప్లేట్లు తయారుచేసి ఉపాధి పొందడం ఎంతో ఆనందించదగ్గ విషయమన్నారు. ఇదిలా ఉండగా కూటమి ప్రభుత్వం పాలనలో గిరిజన మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగయ్యాయని, ఇందుకు సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు గిరిజన మహిళల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని ఈ సందర్భంగా వీడీవీకేలో అడ్డాకులతో కంచాలు, ప్లేట్లు తయారు చేస్తున్న గిరి మహిళలు, ఆనందంగా తెలిపారు. విడివికెను సందర్శించిన వారిలో స్థానిక ఈవో రాజకుమార్, టిడిపి సీనియర్ నాయకుడు చందు పాడి, నాగరాజు, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా ఆశా కార్యకర్తల పోస్టులు భర్తీ చేయాలి

- డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్.టి.విశ్వేశ్వరనాయుడు,ఎడిఎం అండ్ హెచ్ఓకు వినతి

**పాడేరు,జూలై20, ప్రభాతవార్త**



అల్లూరి జిల్లా లో ఇటీవల కాలంలో ఆశా కార్యకర్తల నియమాలకు నోటిఫికేషన్ విడుదల చేసి ఉన్నారు. అల్లూరి జిల్లాలో మొత్తం 124 పోస్టులు విడుదల చేసి ఉన్నారనీ సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి లింగేరి.సుందరరావు,గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడా.రాధాకృష్ణ పేర్కొన్నారు. జిల్లాలో పాడేరు డివిజన్ ఉన్న 36 పీహెచ్సిల పరిధిలో 63,రంప డివిజన్ లో 61ఆశాలు మొత్తం 124 ఖాళీలుభర్తీ చెయ్యాలని,ప్రకటన చేసి ఉన్నారని, పారదర్శకంగా నియామకాలు చేపట్టాలని వారు కోరారు.ప్రకటనలో కొన్ని మండలంలో కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ (సి హెచ్ బ్ల్యూ)గా పని చేస్తున్న గ్రామాలలో ఆశా కార్యకర్తగా భర్తీ చేయాలని నోటిఫికేషన్‌లో తెలిపారన్నారు. ఆశా కార్యకర్తలుగా గుర్తించపోతే కమ్యూనిటీ హెల్త్( సిహెచ్ బ్ల్యూ) వర్కర్స్‌గా ఉన్న ఉపాధి పోయే అవకాశాలు ఉన్నాయనీ వారు ఆందోళన వ్యక్తం చేశారు.ఉదాహరణకు:కీలగాడ(పిహెచ్ సి)లో కీలగాడ పెద్దవీది,పెదబయలు(పిహెచ్ సి)లో పెదబయలు,దుంబ్రిగుడా(పీ హెచ్ సి)లో కే. జమిగూడా, అర్ వి నగర్ పిహెచ్ పీలో డౌనూరు(పిహెచ్ సి)లో చిట్టెంపాడు లాంటి తదితర గ్రామాల్లో కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌గా గ్రామాలలో క్షేత్ర స్థాయి గా ఉండి ప్రాథమిక వైద్యసేవలు అందిస్తున్నారన్నారు 2017 సంవత్సరం నుండి కొనసాగుతూ కేవలం 4000 రూపాయిలు మాత్రమే తీసుకొని,ఎటువంటి రాయితీలు లేకుండా ఆశా కార్యకర్తల తో సమానంగా పని చేస్తున్నారు.,ఆపిడమిక్ సీజన్లోను,అలాగే కోవిడ్ సమయంలో గ్రామాల్లో పర్యటించి వైద్యసేవలు అందిస్తూ ఉన్నారు.గతం లో అనేక మార్లు అధికారులను కలసి సి హెచ్ డ బ్ల్యూ లను ఆశాలుగా మార్పు చెయ్యాలని వివిధ స్థాయిలో ఆందోళనలు(పోరాటం) చేశామన్నారు. ఏళ్ల తరబడి పని చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌లను మొదటి ప్రాధాన్యత ఇచ్చి ఆశాలుగా గుర్తించాలని వారుబ్కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయి,, విస్తరణ అధికారి సింహాద్రి ,సంజీవ్ పాత్రుడు పాల్గొన్నారు.

## జీవో నెంబర్ 3పై ప్రజాభిప్రాయ సేకరణకు హాజరుకండి

- డాక్టర్ వంపూరు గంగులయ్య పిలుపు

**పాడేరు,జూలై 20, ప్రభాతవార్త**



జీవో నెంబర్ 3, గిరిజన చట్టాలపై గిరిజన సంక్షేమ సంచాలకులు సదా భార్గవి అధ్యక్షతన జరుగుతున్న ప్రజాభిప్రాయ సేకరణకు పాడేరు, అరకు నియోజకవర్గ ప్రజలు, ప్రజాప్రతినిధులు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు రావాలని జనసేన పార్టీ పాడేరు నియోజకవర్గం మరియు అరకు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ వంపూరు గంగులయ్య పిలుపునిచ్చారు. ఈనెల 22వ తేదీన పాడేరు ఐటిడిఏ సమావేశ మందిరంలో గిరిజన సంక్షేమ సంచాలకులు సదా భార్గవి అధ్యక్షతన వర్క్ షాప్ జరగనుందని ఆయన వెల్లడించారు. వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో జరిగిన నష్టాన్ని పూడ్చడం కోసం కూటమి ప్రభుత్వం సాంకేతిక అంశాలను అధిగమిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా ఈ వర్క్ షాప్ జరుగుతుందని గంగులయ్య తెలిపారు. ప్రజాసంఘాలు, ప్రజాప్రతినిధులు, ప్రజల నుంచి ప్రభుత్వం అభిప్రాయాలను సేకరిస్తుందని పేర్కొన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పాపాలను సరి చేసుకోకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని కూటమి ప్రభుత్వం ఈ ఆలోచన చేసిందని తెలిపారు. జీవో నెంబర్ 3 అమలు, గిరిజన చట్టాలు రక్షణ కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది అనేందుకు ఇదే ప్రత్యక్ష సాక్ష్యం అన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న ఈ ప్రయత్నానికి మనమంతా సహకారం అందించాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఈ అభిప్రాయ సేకరణ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మీ అభిప్రాయాలను మీ వినతి పత్రాలను సంచాలకుల గారికి అందజేయాలని తెలిపారు.

## చాపరాయిలో పర్యాటకుల తాకిడి

**డుంబ్రిగుడరూరల్, జూలై20, ప్రభాతవార్త**



ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయి జలపాతం వద్ద ఆదివారం మైదనా ప్రాంతం నుంచి పెద్ద సంఖ్య లో తరలి రావడం తో సందడి నెలకుంది. పర్యటకులు కుటుంబ సమేతంగా జలపాతం వద్ద సందడి చేస్తూ ఫోటోలు, సెల్ఫీలు తీసుకుంటూ ఎంతో ఉల్లాసంగా గడిపారు. అక్కడ వ్యాపారం చేసుకుంటున్న చిరు వ్యాపారులకు ఆర్థికంగా లాభాలు పొందుతున్నారు.

## గంజాయిపై అనుమానిత ప్రాంతాల్లో డ్రోన్‌తో తనిఖీ

**డుంబ్రిగుడరూరల్, జులై 20, ప్రభాతవార్త**



మండలంలోని పలు అనుమానిత ప్రాంతాల్లో ఆదివారం డ్రోన్ ద్వారా తనిఖీ చేసినట్లు స్థానిక ఎస్ ఐ పాపి నాయుడు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి పంట ఎవరైనా పండించిన చట్టరీత్యా నేరమని, గంజాయి పండించిన వారిపై చట్టరీత్యా జైలు పాలవుతారని చెప్పారు. గంజాయి పండించి విలువైన బంగారు భవిష్యత్తు పాడు చేసుకోవద్దని చెప్పారు. గంజాయి వద్దు వ్యవసాయమే ముద్దని ఎస్ఐ పాపి నాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

Main tab page 7_2_Main tab page 7_2.qxd 7/21/2025 12:29 AM Page 1



## మరమ్మతులకు గురైన మామిడివాక బ్రిడ్జిని
# పరిశీలించిన స్పీకర్ అయ్యన్న పాత్రుడు



**కసింకోట, జూలై 20, ప్రభాతవార్త**

పరిమితికి మించి భారీ వాహనాలు అత్యధిక లోడుతో రాకపోకలు సాగించడం వల్లే తాళ్లపాలెం నర్సీపట్నం వెళ్లే మామిడిపాక బ్రిడ్జి ప్రమాదంలో పడిందని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. గత వారం రోజుల క్రితం ఆర్ అండ్ బి అధికారులు బ్రిడ్జి పరిస్థితిని పరిశీలించిన తర్వాత నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. దీనిపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్పందించి బ్రిడ్జి స్థితిగతులను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణతో కలిసి ఆదివారం నేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. 20 టన్నులు సామర్థంతో ఈ బ్రిడ్జిపై రాకపోకలు సాగించాల్సి ఉండగా సుమారు 60 టన్నులకు పైగా ముడిసరుకు అన్రాక్ కంపెనీకి తరలించడం కారణంగానే ఈ బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుందని తెలియజేశారు. తక్షణమే బ్రిడ్జి ప్రమాదాన్ని నివారించేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఆర్ అండ్ బి ఉన్నతాధికారులతో సంప్రదింపులు చేశామని చెప్పారు. వారం రోజుల్లో సంబంధిత సాంకేతిక నిపుణులతో బ్రిడ్జిని పరిశీలించి వారి సూచనల మేరకు కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలా లేదా మరమ్మతులు చేస్తే సరిపోతుందా అనే అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. అంతేకాకుండా తాళ్లపాలెం నుంచి చింతపల్లి వరకు విశాలమైన రోడ్లు నిర్మాణం చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే కొనతాల రామకృష్ణ కోరారు. దీనివల్ల పరిశ్రమలు మన ప్రాంతానికి రావడమే కాకుండా నిరుద్యోగ సమస్య కూడా పరిష్కారం అవుతుందని చెప్పారు. రాష్ట్రంలో జాతీయ రహదారికి అనుసంధానంగా ఆర్ అండ్ బి రోడ్లన్నీ విస్తరించేందుకు ప్రణాళికలు ప్రభుత్వం సిద్ధం చేస్తుందని తెలియజేశారు. కాగా అన్రాక్ కంపెనీ 20 టన్నులకు మించి వాహనాలను రవాణా చేస్తే కంపెనీకి తాళం వేస్తానని అయ్యన్న హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు, ఆర్ అండ్ బి సూపరింటెండెంట్ ఇంజనీర్ జాన్ సుధాకర్, అనకాపల్లి ఏఈ ఎన్. సాంబశివరావు, నర్సీపట్నం డిఈఆర్ఆర్ విద్యాసాగర్, పెద్ద బొడ్డేపల్లి అసిస్టెంట్ ఇంజనీర్ కె. నారాయణరెడ్డి, నర్సీపట్నం అసిస్టెంట్ ఇంజనీర్ ఎన్ ఎల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



### 29 లక్షలుతో డ్రైవర్ల నూతన విశ్రాంతిభవనం
**- 22 తారీఖున మంత్రి రాంప్రసాద్ రెడ్డి ప్రారంభోత్సవం**

**ఎలమంచిలి, జులై 20, ప్రభాతవార్త**



పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఒకటవ అంతస్తులు నూతనంగా నిర్మించిన నైట్ హాల్ట్ ఉండే డ్రైవర్లు విశ్రాంతి భవనం 23 లక్షలు తో నిర్మాణం పూర్తిచేసి 22వ తేదీన ప్రారంభోత్సవానికి ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ భవనాన్ని పరిశీలించేందుకు ఆర్టీసీ జోన్1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బ్రహ్మానంద రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం నాడు ఈ విశ్రాంతిభవన ప్రారంభోత్సవానికి రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, స్థానిక శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ లు ప్రారంభిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో డీపీటీవో ప్రవీణ, అనకాపల్లి అసిస్టెంట్ మేనేజర్ గౌరీ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా బురదమాంబ పండగ
### దర్శించుకున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్

**ఎలమంచిలి, జులై 20, ప్రభాతవార్త**



మున్సిపాలిటీ పరిధిలో తెరువుపల్లి గ్రామంలో వెలసిన శ్రీ బురద మాంబ అమ్మవారి పండగ ఆదివారం నాడు గ్రామస్తులంతా భక్తి శ్రద్ధలతో చేసుకున్నారు. స్థానిక శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ అమ్మవారిని దర్శకంచుకునేందుకు గ్రామస్తులంతా పసుపు కుంకుమ చీర రవిక నైవేద్యాలతో ఉదయం 5 గంటల నుండి గుడి వద్ద బారుతీరి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా క్యూలైన్లు ఏర్పాటు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్థానిక జనసేన నాయకులు బోజ జయరాం, కౌన్సిలర్ శ్రీను, ఊటకూటి రమేష్ నాయుడు, కొటారు శ్రీనివాసరావు, గంధం శివ, కాశి, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికీ
### తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్న ప్రగడ

**ఎలమంచిలి జూలై 20, ప్రభాతవార్త**



నియోజకవర్గం అచ్చుతాపురం మండలం రావిపాలెం గ్రామంలో ఆదివారం సుపరిపాలన తొలి అడుగు ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఎలమంచిలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రగడ నాగేశ్వరావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో కూటమి ప్రభుత్వం సంవత్సరం కాలం పాటు సుపరిపాలన అందించిందని, రాష్ట్రంలో లో ప్రజలకు అభివృద్ధి ఏంటో ఈ ఒక్క సంవత్సరం కాలంలోనే అర్థమైందని, గత ప్రభుత్వంలో విధ్వంసం జరిగిందని, ఈ ప్రభుత్వంలో వికాసం వైపు అడుగులు పడుతున్నాయని, తల్లికి వందనం పథకం కింద చదువుకునే ప్రతి విద్యార్థికి 15 వేల రూపాయలు అందించడం జరిగిందని, దీపం పథకం కింద ప్రతి కుటుంబానికి మూడు గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని, త్వరలోనే రైతులకు అన్నదాత సుఖీభవ పథకం అందిస్తామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని, ఈ మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వం అని, నెలరోజుల పాటు సుపరిపాలన కార్యక్రమంపై ప్రతి ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేపడుతున్న కార్యక్రమాలపై ప్రచారం చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పీలా తులసిరాం, క్లస్టర్ ఇంచార్జ్ రాజాన నానాజీ, గ్రామ శాఖ అధ్యక్షులు తమరాన అప్పలనాయుడు, బంటుపల్లి అప్పారావు, రంగళి మనోహర్, గొర్లి నూకరాజు, రావి కృష్ణ, గొర్లి రమణ, లోకనాథం నాగరాజు, నియోజవర్గ ఐటీడీపీ కన్వీనర్ పతివాడ చిన్నయ్య నాయుడు, తదితరులు మరియు తెలుగుదేశం పార్టీ అభిమానులు కుటుంబ సభ్యులు భారీ స్థాయిలో పాల్గొన్నారు.

### కోహన్స్ లైఫ్ సైన్సెస్ ఆధ్వర్యంలో వాక్ ఇన్ డ్రైవ్

**అగనంపూడి, జూలై 20, ప్రభాతవార్త**



జవహర్లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో ఉన్న ప్రముఖ ఫార్మా పరిశ్రమ కోహన్స్ లైఫ్ సైన్సెస్ ఆధ్వర్యంలో ఆదివారం కూర్మన్నపాలెం హోటల్ సిగ్నట్లో వాక్ ఇన్ డ్రైవ్ నిర్వహించారు. పరవాడ, అచ్యుతాపురం, జగ్గయ్యపేట (ఆంధ్రప్రదేశ్) తదితర ప్రాంతాల్లో ఉన్న కోహన్స్ లైఫ్ సైన్సెస్ ఉత్పత్తి కేంద్రాల్లో ప్రొడక్షన్ విభాగంలో పనిచేయుటకు ప్రతిభ, అనుభవం గల తాజా బీఎస్సీ అభ్యర్థుల నుండి నేషనల్ అప్రెంటిస్షిప్ ట్రైనింగ్ స్కీం (ఎన్ఎటిఎస్) కింద దరఖాస్తులను ఆహ్వానించారు. మొత్తం 116 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వారిలో 24 మంది అభ్యర్థులు ఎంపిక చేయబడ్డారు, అందులో 6 మంది మహిళా అభ్యర్థులు కూడా ఉన్నారని యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వంశీధర్ (టాలెంట్ అక్విజిషన్ హెడ్), సురేష్ (ఏపీఐ యూనిట్1 హెచ్ఆర్ హెడ్), ఇతర టెక్నికల్, హెచ్ఆర్ టీం సభ్యులు, ఇంటర్వ్యూలకు వచ్చిన అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

### రైతు సంఘం నూతన కార్యవర్గం

**అనకాపల్లి, జూలై 20, ప్రభాతవార్త**



మునగపాక సంతబయల వినాయక కల్యాణ మండపంలో ఆదివారం ములబంద గోడి రైతు మూల సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడుగా దొడ్డి నూకరాజు, కార్యదర్శిగా దాడి శివ నాగ అప్పారావు, కోశాధికారిగా సూరిశెట్టి నాగ దుర్గనాయుడులు ఎన్నికయ్యారు. డైరెక్ట్ ర్ లుగా కుంది గంగాధర్, దొడ్డి త్రినాధ్ లు ఎన్నికయ్యారు. దాడి సూర్యనారాయణ పర్యవేక్షణలో ఎన్నికలు జరిగాయి. ఈ సమావేశంలో సంఘం సభ్యులు దాడి శివ, దొడ్డి గంగ సూరి, రామ అప్పల నాయుడు, బొడ్డేడ రాము నాయుడు, దాడి శ్రీరామూర్తి, దొడ్డి సన్యాసి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

### నేత్ర పర్వంగా సారె ఊరేగింపు..
### రేబాక గ్రామానికి పోటెత్తిన భక్తులు..

**నక్కపల్లి, ప్రభాతవార్త**





మండలంలోని రేబాక గ్రామంలో ఆషాఢమాసం చివరి ఆదివారం సందర్భంగా గూడుపమ్మ తల్లి సారె ఊరేగింపు ఘనంగా జరిగింది. సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రావికమతం, మాకవరపాలెం, నాతవరం, కోటవురట్ల, ఎస్ రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట మండలాల నుంచి, రేబాక పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు తరలి వచ్చారు. రేబాక గ్రామ రామాలయం వద్ద ముందుగా పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఆలయం వరకు సారె ఊరేగింపు చేపట్టారు. ఆలయంలో అమ్మవారికి భక్తులు తీసుకువచ్చిన సారె ను సమర్పించారు. కోటవురట్ల మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన పిల్లలు చేసిన కోలాట ప్రదర్శన విశేషంగా అలరించింది. ఎస్ఎస్ఎఫ్ జిల్లా ప్రతినిధులను ఆలయం తరఫున ఘనంగా సత్కరించారు. సారె సమర్పించిన భక్తులందరికీ భోజన ప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. ఎస్ ఎస్ ఎఫ్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు కె.లలిత అమ్మవారి గొప్పతనం గురించి వివరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గొట్టుముక్కల శ్రీహరి రాజు, సర్పంచ్ సాదిరెడ్డి శ్రీను, గ్రామ పెద్దలు సాదిరెడ్డి చిన వెంకన్న, సాదిరెడ్డి నారాయణమూర్తి ,సాదిరెడ్డి వరప్రసాద్, వెల్లంకి కాసుబాబు, ఉప సర్పంచ్ చెవ్వాకుల శ్రీనివాసరావు ,శానాపతి అప్పారావు, శానాపతి విజయ్ కుమార్, ప్రగడ బోసు, గరగ రాజేష్, సాంబమూర్తి, శానాపతి బాబ్జి, దాసరి రమణ, సాదిరెడ్డి రాజు, సాదిరెడ్డి సత్తిబాబు, మడుగుల అప్పారావు, పి.రాజు, గంట్యాడ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

### శిక్షణ కేంద్రాన్ని పరిశీలించిన ఎంపీడీవో దెందుకూరి

**నక్కపల్లి, ప్రభాతవార్త**



మండలంలోని వేంపాడు గ్రామంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఎంపీడీవో ఆ కుట్టు శిక్షణ విషయమై ఎంత మంది హాజరవుతున్నారు అనేది ఆరా తీశారు. ఇది ఇలా ఉండగా చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. తడి పొడి చెత్తను ఏ విధంగా సేకరించాలి చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రానికి ఏ విధంగా చేర్చాలి అనేది అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఆయనతోపాటు డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు, సర్పంచి ఏనుగుపల్లి రత్నం, కార్యదర్శి మజ్జి శ్రీనివాసరావు లు ఉన్నారు.

### క్లాప్ మిత్రులకు సత్కారం.!

**నక్కపల్లి, ప్రభాతవార్త**



ప్రతిష్టాత్మంగా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అన్ని మండలాల్లో ఉన్న గ్రామాల్లో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ లో బాధ్యతగా పనిచేసిన క్లాప్ మిత్రాస్ లకు మూడో శనివారం కార్యక్రమంలో భాగంగా ఎండిఓ దెందుకూరి సీతారామరాజు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. వారు చేసిన సేవలను కొనియాడారు. వారిని సత్కరించిన వారిలో డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు కార్యదర్శి పీవీపీ రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

### ఆపద్బాంధవుడు చంద్రబాబు

**చోడవరం, జులై 20, ప్రభాతవార్త**



రాష్ట్ర ప్రజలను ఆపదలో ఆదుకుంటూ నేనున్నానంటూ భరోసా ఇచ్చే నాయకుడు చంద్రబాబు నాయుడని స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ రాజు చెప్పారు. ఆదివారం చోడవరం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలో గల పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సహాయాన్ని సద్వినియోగ పరుచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా చోడవరం నియోజకవర్గ పరిధిలో సుమారు 13 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి నుంచి 9,53,869 రూపాయలు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రావికమతం మండల పార్టీ అధ్యక్షుడు శంకర్, చోడవరం గవర కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్, బమ్మిడిపాటి వారి సత్రం చైర్మన్ విస్సు, పట్నాల సంతోష్, దివ్య, పుల్లేటి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

### 17వవార్డులో సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి టిడిపి

**ఎలమంచిలి, జూలై 20, ప్రభాతవార్త**



మున్సిపాలిటీ పరిధిలోని పట్టణంలోని 17వ వార్డు లోని సుపరిపాలనలో తొలుగడుగు కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ 17వ వార్డులో నీ, క్లస్టర్ కో కన్వీనర్ కరణం రవికుమార్, యూనిట్ ఇంచార్జ్ సేనాపతి రాజా మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నియోజకవర్గ ఇన్చార్జి ప్రగడ నాగేశ్వరరావు , సీనియర్ నాయకులు పప్పల చలపతిరావు ఆదేశాల మేరకు 17వ వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి సంవత్సర కాలంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అభివృద్ధి వివరించామని రవికుమార్ తెలిపారు, ఈ కార్యక్రమంలో వార్డు ఇంచార్జ్ శ్రీమంతుల శ్రీను, సెక్రటరీ పడాల చంద్రరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### సుపరిపాలనలో తొలి అడుగు, ఇంటింటికి
### తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్న దంట్ల వెంకటస్వామి..

**ఎలమంచిలి, జూలై 20, ప్రభాతవార్త**



మున్సిపాలిటీ పరిధిలో పట్టణంలోని 20వ వార్డు లోని సుపరిపాలన లో తొలి అడుగు, ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 20 వ వార్డు లో, తెలుగుదేశం పట్టణపార్టీ వైస్ ప్రెసిడెంట్ దంట్ల వెంకటస్వామి పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ,మంత్రి నారా లోకేష్ ,సీనియర్ తెలుగుదేశం నాయకులు మాజీ ఎంపీ పప్పల చలపతిరావు , రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ,నియోజవర్గ ఇన్చార్జి ప్రగడ నాగేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు గొర్లె నానాజీ ఆదేశాలు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారంలోకి వచ్చి ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన సంక్షేమ అభివృద్ధి కోసం చేపట్టిన ప్రతి పని భవిష్యత్తులో చేయబోయే కార్యక్రమాలను ప్రతి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐటి డి పి అశోక్, స్కూల్ కమిటీ చైర్మన్ మానేశ్వర్రావు, బూత్ ఇంచార్జ్ గోపి, భాస్కర రావు, సంతోష్, రంజిత కార్యకర్తలు పాల్గొన్నారు.

### ప్రత్యేక అలంకారంతో అమ్మవారు.!

**పాయకరావుపేట, ప్రభాతవార్త**



పాయకరావుపేట మండలం పాల్తేరు గ్రామ దేవత శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆషాడ మాసం అమ్మవారిని ప్రత్యేక పువ్వులతో అలంకరణ భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారి పూజ కార్యక్రమాలు సందర్భంగా మధ్యాహ్నం మహా అన్నదానం గ్రామానికి చెందిన యువత ఆధ్వర్యంలో నిర్వహించారు. దేవవరపు వెంకట్రావు, ఎంపీటీసీ మాకినీడి చిట్టిబాబు, దేవవరపు శ్రీనివాస్, దేవవరపు నరసింహారావు, గోనెల దివాణం, గోపాల్ దాసు, కొండబాబు, దేవవరపు సత్యనారాయణ, దేవవరపు వెంకటేష్ ,పిండి దివాణం ,దేవవరపు బుజ్జి, సిద్ధ దొరబాబు ,అక్కిరెడ్డి బాబ్జి ,జీను రమణ



,కొత్తిం శివ విశ్వనాధుని, గోనెల మల్లేశ్వరరావు లు శ్రీ ముత్యాలమ్మ సేవ కమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా మహా అన్నదానం ప్రత్యేక పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు .అధిక సంఖ్యలో మహిళా భక్తులు వచ్చి అన్నప్రస్నాధ స్వీకరించారు.

### 21వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి తెలుగుదేశం

**ఎలమంచిలి, జూలై 20, ప్రభాతవార్త**



మున్సిపాలిటీ పరిధిలోని పట్టణంలోని 21వ వార్డు లోని సుపరిపాలనలో తొలి అడుగు, ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ 21వ వార్డులో తెలుగు యువత అధ్యక్షులు నమ్మి రమణ క్లస్టర్ ఇంచార్జ్ బోద్దపు శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ అనుసూరి కృష్ణ, 21 వ వార్డు ప్రెసిడెంట్ ముమ్మిన శ్రీనివాసరావు బి ఆధ్వర్యంలో నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నియోజకవర్గ ఇన్చార్జి ప్రగడ నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు పప్పల చలపతిరావు ఆదేశాల మేరకు 21వ వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి సంవత్సర కాలంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అభివృద్ధి వివరించామని రవికుమార్ తెలిపారు, కార్యక్రమంలో 21 వార్డు వైస్ ప్రెసిడెంట్ నేలపూడి రాజు, సుందరపు చిన్న, యూనిట్ ఇంచార్జ్ చేబ్రోలు శీను, మండపాక సత్తిబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటు కుభూములు ఇచ్చేది లేదు.!
**- నిరసన తెలిపిన జానకయ్యపేట గ్రామస్తులు..**

**నక్కపల్లి, ప్రభాతవార్త**



మండలం, సిహెచ్.ఎల్.పురం రెవెన్యూ పరిధిలోని జానకయ్యపేట లో రైతుల భూములను ప్రభుత్వం ఏర్పాటు చేయతలపెట్టిన బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటు కు భూములు ఇచ్చేది లేదని రైతులు స్పష్టం చేశారు. ఆదివారం జానకయ్యపేట శ్రీక్రిష్ణ దేవాలయం లో సమావేశం ఏర్పాటు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, వైయస్సార్సిపి మండల అధ్యక్షులు సీరం నరసిం హమూర్తిలు మాట్లాడుతూ జానకయ్యపేట గ్రామంలో చిన్న సన్నకారు రైతులు వ్యవసాయం, గొర్రెలు, మేకలు పెంపకం పై నే ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. ఇక్కడ భూములు అన్నీ సారవంతమైన భూములు, తోటలు ఇటువంటి భూములలో ఎటువంటి పరిశ్రమలు ఏర్పాటు చేయవద్దని 2013 భూ సేకరణ చట్టం చెబుతున్నా దానిని పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వం ఏకపక్షంగా నోటి ఫికేషన్ జారీ చేశారని అన్నారు. ఈ గ్రామంలో రైతులు బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటు కు భూములు ఇవ్వడానికి సిద్ధంగా లేరని కష్టం చేశారు. రైతులు, వ్యవసాయం కూలీలు మనోభావాలను, జీవనోపాధిని దృష్టిలో పెట్టుకుని బల్క్ డ్రగ్స్ ఏర్పాటు కొరకు భూసేకరణ కు ఇచ్చిన నోటిఫికేషన్ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులను సమీక రించి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కురందాసు సింహాచలం, కు రాందాసు అప్పలరాజు, కు రాందాసు నానాజీ, మామిడి బాబ్జీ, దేవర సత్తిబాబు, తులసీరావు, మామిడి రమణ, మామిడి క్రృష్ణ, దేవర రామకృష్ణ తదితరులు ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు.



విజయనగరం వార్త
పార్వతీపురం మన్యం

# అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట: మంత్రి 'కొండపల్లి'

**గజపతినగరం, జూలై 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని తన ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని, ఈ రెండింటికి పెద్ద పేట వేస్తుందని రాష్ట్ర ఎం.ఎస్.ఎం.ఈ, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మాత్యులు కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని తుమ్మికపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన "సుపరిపాలన తొలిఅడుగు" కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి ఏడాదిలో తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో ఏ ప్రభుత్వాలు ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి



సంక్షేమ కార్యక్రమాలు తమ ప్రభుత్వం చేసి చూపిందన్నారు కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో అడుగడుగున సంతృప్తి కనిపిస్తుందన్నారు. ఏడాదికి 33వేల కోట్లు రూపాయలు సామాజిక పెన్షన్లు రూపంలో అందజేస్తున్నామన్నారు. దేశంలోనే అత్యధికంగా పెన్షన్లు ఇస్తున్న రాష్ట్రాలలో మన రాష్ట్రం ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు రానున్న నాలుగేళ్లలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకు వెళ్తారన్నారు. ఏఎంసీ చైర్మన్ పివివి గోపాలరాజు, మాజీ ఎంపీపీలు మక్కువ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్ అయ్యన్నను కలిసిన ఎమ్మెల్యే 'కోళ్ల'



**శృంగవరపుకోట, జూలై 20, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ సభ స్పీకర్ సీహెచ్ అయ్యన్నపాత్రుడును నర్సీపట్నంలోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఈ నెల 30వ తేదీన జరగనున్న తన కుమారుడు వివాహానికి హాజరు కావాలని కోరుతూ స్పీకర్ అయ్యన్నకు కోళ్ల ఆహ్వాన పత్రికను అందజేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల రాంప్రసాద్ పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## 'భూమి సారవంతానికి నవధాన్యాల సాగు దోహదం'

**పాచిపెంట, జూలై 20,ప్రభాతవార్త:** భూమి సారవంతంగా ఉండాలంటే నవధాన్యాలు సాగు చేస్తే భూమి గొల్ల భారీ పోషకాలు తయారు చెందుతాయని మండల వ్యవసాయ అధికారి అన్నారు. నవధాన్యాలు ఎన్ని ఎక్కువగా రకాలు వేస్తే అంత ఎక్కువగా నేల సారవంతం అవుతుందని 30 నుండి 40 రకాల విత్తనాలు ఒక ఎకరానికి 25 కిలోలుకు పైగా వేసుకుంటే కలుపు మొలకెత్తదని అంతేకాకుండా అనేక రకాల పంటల విత్తన వేరు వ్యవస్థలు నేలలో ఉండడం వలన పలు రకాల సూక్ష్మజీవులు వేరు వ్యవస్థ చుట్టూ చేరి జీవ ద్రవ్యాన్ని ఏర్పరచి పంటలకు కావలసిన అన్ని



పోషకాలను అందిస్తుందని వ్యవసాయ అధికారి సూచించారు. తాడూరు గ్రామంలో సి అర్ పి తిరుపతి నాయుడు ఆధ్వర్యంలో రైతు యాసర్ల ఈశ్వరరావు క్షేత్రంలో బోను లోకేష్ అనే రైతు రెండు ఎకరాల క్షేత్రంలో నవధాన్యాల సాగు తర్వాత పొగాకు పంట వేసుకుంటే వచ్చే ఫలితాలను అంచనా వేయటానికి 32 రకాల విత్తనాలు ఎకరానికి 25 కిలోలు చొప్పున చల్లించే ప్రయోగంలో పాల్గొన్నారు. ప్రకృతి సేద్య ఎం టీ యశోదమ్మ పాల్గొన్నారు.

## జిందాల్ సంస్థకు ప్రభుత్వం దాసోహం: ఎమ్మెల్సీ రఘురాజు ఆరోపణ

**శృంగవరపుకోట,జూలై 20,ప్రభాతవార్త:** జిందాల్ సంస్థకు ప్రభుత్వం దాసోహమైందని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ఆరోపించారు.శనివారం మండలంలోని బొడ్డవరలో ఆయన నివాసంలో



విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈసందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ జిందాల్ యాజమాన్యం రైతుల సమస్యలను పరిష్కారించకుండా మోసం చేసిందని ఈవిషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళితే పట్టించుకోక పోవడం అన్యాయమన్నారు.ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడాలే గాని జిందాల్ సంస్థకు తొత్తులుగా మారకూడదన్నారు.పరిశ్రమ ఏర్పాటు చేస్తామని జిందాల్ యాజమాన్యం రైతుల భూములను కారుచౌకగా తీసుకుని ప్రభుత్వంతో చేతులు కలిపి ఎంఎస్ఎంఈ పార్కుల పేరిట రియల్ ఎస్టేట్ వ్యాపారానికి సిద్ధమవుతుందని ఆయన ఆరోపించారు.

## 'విమర్శలను వెనక్కి తీసుకోవాలి'

**కొమరాడ, జూలై 20,ప్రభాతవార్త:** కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరీపై మాజీ మంత్రి పుష్ప శ్రీవాణి చేస్తున్న వ్యక్తిగత విమర్శలు వెనుకకు తీసుకోవాలని కొమరాడ మండల టీడీపీ కన్వీనర్ శేఖర్ పాత్రుడు, ఎఎంసీ వైస్ చైర్మన్ గార గౌరీ శంకర్, జనసేన కన్వీనర్ శ్రీకర్, బీజేపీ కన్వీనర్ ద్వారపురెడ్డి సురేష్‌లు డిమాండ్ చేశారు.



శనివారం మాదలంగి గ్రామంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాజకీయాలలో వ్యక్తిగత విమర్శలుకు తావులేదన్నారు. వైకాపా ప్రభుత్వంలో మంత్రిగా వైఫల్యం చేశారన్నారు. ప్రజలను డైవర్ట్ చేయడానికి, స్థానిక శాసన సభ్యులు జగదీశ్వరీ పైన పుష్ప శ్రీవాణి చేస్తున్న అసత్య ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

## మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం బొబ్బిలి యూనిట్ నూతన కార్యవర్గం

**బొబ్బిలి,జూలై 20,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం బొబ్బిలి యూనిట్ ప్రెసిడెంట్‌గా నేతనపల్లి శ్రీనివాస్ నాయుడు. వైస్ ప్రెసిడెంట్‌గా పి.ఉమాదేవి, సెక్రట రీగా కృపాల్, జాయింట్ సెక్రెటరీగా చుక్క రామ్ నాయుడు, కే.ఉమామహేశ్వరరావు, ఎం.గోపాలకృష్ణ,



డిస్ట్రిక్ట్ కౌన్సిలర్‌గా ఎం.నారాయణరావు, సిహెచ్ శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సిహెచ్ మురళి, కార్యదర్శి ఆవు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## 'హాస్టల్‌లో మౌలిక వసతులు లేకుంటే తెలియజేయండి'

**సాలూరు, జూలై 20,ప్రభాతవార్త:** పట్టణ బంగారమ్మ కాలనీ సమీపంలో ఉన్న గిరిజన గర్ల్స్ హాస్టల్‌లో ఏఐఎస్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ ఇంకా స్ఫూర్తి మహిళా మండలి డైరెక్టర్ బలగ రాధ ఆదివారం హాస్టల్ విద్యార్థినీలకు అవగాహన కల్పిం చారు. ప్రస్తుత సమాజంలో బాలికలపై లైంగిక దాడులు అత్యా చారాలు హత్యలు ఎక్కువయ్యాయని అందువలన అప్రమత్తంగా ఉండా లన్నారు.



హాస్టల్‌లో మౌలిక వసతులు సక్రమంగా లేకపోయినా ఇంకా ఏవైనా ఇబ్బందులు ఉన్నా తెలియజేయాలన్నారు. హాస్టల్ వార్డెన్ నిర్మల ఏఐఎస్ఎఫ్ నాయకులు హరి, సునీల్ పాల్గొన్నారు.

## దబ్బగడ్డలో ఉచిత వైద్య శిబిరం



**మక్కువ, జూలై 20, ప్రభాతవార్త:** పార్వతీపురం మన్యం జిల్లా సత్యసాయి సేవా సంస్థలు ఆదివారం మండలంలోగల గొడేవలస మరియు దబ్బగడ్డ గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ శకుంతల మరియు డాక్టర్ ప్రభాకర్ పాల్గొన్నారు. సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షులు పి.నేతాజీ నాయుడు, జిల్లా సేవాదళ్ కోఆర్డినేటర్ పి.రాజశేఖర్ మరియు జోనల్ కన్వీనర్ జి సత్యనారాయణ వివిధ సేవాదళ్ కార్యకర్తలు పాల్గొన్నారు. ఉచితంగా150 మంది రోగులకు మందులు పంపిణీ చేయడం జరిగింది. వ దబ్బగడ్డలో ఎక్కువగా చికెన్ గున్యాతో బాధపడుతున్నట్టుగా గుర్తించడం జరిగింది. ఈ వైద్య శిబిరంలో వివిధ గ్రామాల సేవాదళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్డుప్రమాదంలో ఒకరికి గాయాలు



**దత్తరాజేరు, జూలై 20, ప్రభాతవార్త:** మండల పరిధిలోగల మర్రి వలస జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం కారు స్కూటీని ఢీకొనడంతో భోగి అనిల్ కుమార్ అనే వ్యక్తికి కుడి చేతికి గాయం అయిందన్నారు. ఎస్.బూర్జువలస పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి వైజాగ్ జిల్లా పీఎం పాలెం చెందిన అనిల్ కుమార్ శనివారం రాంబద్రపురం మండలం మిర్తివలస గ్రామమైన అత్తవారు ఇంటికి వెళ్లి తిరిగి పీఎంపాలెం బయలుదేరి వెళుతుండగా మర్రివలస జంక్షన్ వద్ద కారు డ్రైవర్ అతి జాగ్రత్తతో కారు నడపడం వల్ల ఈ సంఘటన జరిగిందని పోలీసులు తెలిపారు. గాయాలు అయిన అనిల్ కుమార్‌ను 108 వాహనంలో గజపతినగరం ప్రభుత్వాసుపత్రికి తరలించమన్నారు. ఎస్ బూర్జు ఏఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## 'గురుకులం' బియ్యంలో పురుగులు..! ఎమ్మెల్యే విజయ్ చంద్ర ఆగ్రహం



**పార్వతీపురం, జూలై 20, ప్రభాతవార్త :** సీతానగరం మండలం జోగింపేటలో గల అంబేద్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు నిర్వాహకులు పెడుతున్న ఆహారం సరిగా లేకపోవడం, అన్నంలో పురుగులు ఉన్నాయని ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం గురుకులంలో పర్యటించిన ఎమ్మెల్యే విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆహారం రుచిగా లేకపోవడం నాణ్యత కొరవడం పట్ల, అన్నంలో పురుగులు ఉండటంతో నిర్వాహకులపై మండిపడ్డారు. ఇలాంటి ఆహారాన్ని మీ ఇంట్లో తింటారా? అని నిలదీశారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తమ కష్టాలపై ఎమ్మెల్యే స్పందించిన తీరు పట్ల అంబేద్కర్ గురుకుల విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

## సంపద సృష్టించడమే సిఎం చంద్రబాబు ధ్యేయం : ఎమ్మెల్యే 'కోళ్ల'

**శృంగవరపుకోట,జూలై 20,ప్రభాతవార్త:** రాష్ట్రాభివృద్ధికి ముందు సంపద ముఖ్యమని సంపద సృష్టించి యువతకు ఉపాధి ఉద్యోగవకాశాలు పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. ఆదివారం మండలంలోని కొట్టాం గ్రామంలో సువరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోళ్ల పాల్గొని మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం మంచి పరిపాలన అందిస్తున్నారని ఆమె



తెలిపారు. డీసీఎంఎస్ చైర్మన్ గొంప క్రిష్ణ మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారని తెలిపారు. మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు జీఎస్ నాయుడు పలువురు టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేదల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం: టిడిపి నేత కొండయ్య

**కురుపాం, జూలై 20,ప్రభాతవార్త:** ప్రజలు అభివృద్ధి చెందే విధంగా పథకాలు రూపొందించడం తెలుగుదేశం ప్రభుత్వం లక్ష్యమని మండల తెలుగుదేశం పార్టీ కురుపాం మండల కన్వీనర్ కలిసెట్టి కొండయ్య అన్నారు. ఆదివారం మండలంలో గుజ్జుపాడు, సంగెడ్డ, గొందిలోవ, సింగుపురం



గ్రామాలలో మండల కన్వీనర్ కలిశెట్టి వెంకట కొండయ్య ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. గుజ్జుపాడు గ్రామస్తులు విద్యుత్ వీధి దీపాల సమస్య గురించి చెప్పారు. కురుపాం క్లస్టర్ ఇంఛార్జ్ సుకేష్ చంద్ర పండా,కో క్లస్టర్ సువ్వాన గోవిందరావు, మాజీ ఎంపీటీసీ శెట్టి చంద్రరావు, మాజీ సర్పంచ్ నిమ్మక మహేష్ , బూత్ ఇంఛార్జ్ భాస్కరరావు,పువ్వల గోవిందరావు,వార్డ్ మెంబర్ గెంబలి నాగరాజు, బూత్ ఇంచార్జ్ గౌడు రవి,చిలకల మురళి,గౌడు ప్రసాద్,పోలి ,మూటక లింగమూర్తి గ్రామస్తులు పాల్గొన్నారు.

## వైకాపా పాలనలో అక్రమాలపై బహిరంగ చర్చకు సిద్ధమా?: మండల తెదేపా నాయకులు

**కంచిలి, జూలై 20,ప్రభాతవార్త:** గత వైయస్సార్ పార్టీ హయాంలో అక్రమాలు జరిగిన మాట వాస్తవమేనని మండల తెలుగుదేశం పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో మండల స్థాయి తెలుగుదేశం పార్టీ నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శనివారం రాధాకృష్ణ మందిరంలో వైయస్సార్ పార్టీ మండల స్థాయి నాయకులు నిర్వహించిన కార్యక్రమంలో కంచిలి ఎంపీపీ పైల దేవదాసు రెడ్డి, ఇచ్చాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ బాబు పై చేసిన విమర్శలు ఎంపీపీ స్థాయికి తగదని అన్నారు. గతంలో వైయస్సార్ పార్టీ హయాంలో రైతులకు అందాల్సిన ఎరువులు



వైకాపా నాయకుడు అక్రమంగా నిలువ చేసుకొని ఒరిస్సా తరలించకపోవడం మర్చిపోయారా? అని అన్నారు.. అలాగే పేద రైతులు దగ్గర ప్రభుత్వ ధరకు ధాన్యం కొనుగోలు చేయకుండా డీజీపురంకు చెందిన ఒక వైయస్సార్ పార్టీ నాయకుడు 1200 రూపాయలు కొనుగోలు చేసి దీంట్లో ఎంతమంది నాయకులు పంచుకున్నారో బహిరంగంగా తెలియజేస్తామని మా సవాల్‌ను స్వీకరించి సమయం తెలియజేయాలని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు మాదిన రామారావు, మాజీ అధ్యక్షులు బంగారు కురయ్య, పిఎసిఎస్ అధ్యక్షులు పైల పురుషోత్తం రెడ్డి, ఉపాధ్యక్షులు కిషోర్ పాడి, పిలక చిన్నబాబు, టీవీ రమణ, బొడ్డ హరిబాబు, రమేష్ బాబు పైల రామారావు, పూర్ణ, శ్రీకాంత్, వోన రవి, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## 2,3 తేదీల్లో ఐఎఫ్‌టియు జిల్లాస్థాయి రాజకీయ శిక్షణా తరగతులు

**నెల్లిమర్ల,జూలై 20,ప్రభాతవార్త:** నెల్లిమర్ల అమరవీరుల స్మారక భవన్ లో ఆగస్టు 2,3 తేదీల్లో ఐ.ఎఫ్.టి.యు జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు యం.వెంకటేశ్వర్లు మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో తెలియజేశారు. ఈ




సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులతో కలిసి ఐఎఫ్‌టియు విజయనగరం జిల్లా శాఖ తరపున నిర్వహించనున్న రాజకీయ శిక్షణా తరగతుల కరపత్రాన్ని ఆదివారం ఆవిష్కరించారు. రెండు రోజులపాటు మూడు అంశాలపై రాజకీయ తరగతులు నిర్వహించ నున్నట్లు తెలియజేశారు. ఐఎఫ్టియు జిల్లా ఉపాధ్యక్షులు కాళ్ళ అప్పలసూరి, నెల్లిమర్ల జూట్ మిల్ కార్మిక సంఘం అధ్యక్షులు నామాల తిరుపతిరావు, ఐఎఫ్టియు జిల్లా కమిటీ ప్రతినిధి దూసి ఈశ్వరరావు, చింతల లక్ష్మి, పిఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షులు వి.పార్వతి, ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు వి.మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే విజయ్‌చంద్రకు కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల వినతి

**పార్వతీపురం, జూలై 20, ప్రభాతవార్త:** వేతనాలు పెంచాలని, ఆశ వర్కర్లుగా గుర్తించాలని, యూనిఫామ్ దుస్తులు అందించాలని కోరుతూ ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్రకు కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ వినతిపత్రం సమర్పించారు. ఆదివారం ఉదయం టిడిపి పార్టీ కార్యక్రమంలో ఎమ్మెల్యేని కలిసి తమ సమస్యలను విన్నవించారు. ఆశ వర్కర్ల



మాదిరిగా తాము కూడా అనేక ప్రభుత్వ సేవల్లో పాల్గొంటున్నామని, చాలీచాలని వేతనాలు మాత్రమే ఇస్తున్నారని పేర్కొన్నారు.దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ వినతిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

## 'కూటమి' ప్రభుత్వంతోనే అభివృద్ధి : ఎమ్మెల్యే రవికుమార్

**ఆమదాలవలస, జూలై 20,ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యపడుతుందని పియుసి చైర్మన్, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఆమదాలవలస మండలం అక్కివరం గ్రామంలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు.



ఇంటింటికి వెళ్లి ఏడాదిలో కూటమి ప్రభుత్వ పాలనలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటికి సూపర్ సిక్స్ పథకాలను అందించడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిపాలనలో ప్రజలందరికీ సమన్యాయం అందుతుందని వివరించారు. కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, మహిళా అధ్యక్షురాలు తమ్మినేని సుజాత, మండల నాయకులు నూకరాజు, సనపల డిల్లేశ్వరరావు, సర్పంచ్ గురుగుబెల్లి నీలరావు, స్థానిక నాయకులు తాండ్ర హరి, హనుమంతు బాలకృష్ణ, బుడుమూరు సీతారాం, బి .రామ్మోహన్,నాగళ్ళ మురళీధర్, గోండు రావణుమూర్తి, సనపల చెల్లం నాయుడు, పాల్గొన్నారు.

## ఎంపీ 'కలిశెట్టి'ని కలిసిన టిడిపి నేతలు రవిశేఖర్, రాజారావు

**నెల్లిమర్ల,జూలై 20,ప్రభాతవార్త:** నెల్లిమర్ల నియోజకవర్గం పూసపాటిరేగ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా మండలంలోని దన్నానపేట గ్రామ టిడిపి నాయకురాలు గేదెల గాయత్రి నియమితులైన సందర్భాన్ని పురస్కరించుకొని టిడిపి సీనియర్ నాయకుడు విశాఖ ఉత్తర నియోజకవర్గం పరిశీలకుడు సువ్వాడ రవి శేఖర్, గాయత్రి భర్త, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు ఆదివారం



విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడును విజయనగరంలోని అశోక్ బంగ్లాలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ కలిశెట్టిని గజమాల దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సువ్వాడ రవిశేఖర్, గేదెల రాజారావులను ప్రత్యేకంగా అభినందించారు. పార్టీ నాయకులు బొంతు వెంకటరమణ, పోతల రాజప్పన్న, తాడ్డి సత్యన్నారాయణ, చందక చిన్నమనాయుడు, పోతల రాజప్పన్న, నల్లం శ్రీనివాసరావు, రేగాన గోవింద, రేగాన రాజారావు తదితరులు పాల్గొన్నారు.

## మళ్ళీ డెప్యూటేషన్ పేరుతో పశువైద్య అధ్యాపకుల బదిలీలు!

### అధ్యాపకుల కొరత, మౌలిక సౌకర్యాలు లేమితో లభించని విసిఐ అనుమతులు

**గరివిడి,జూలై 20,ప్రభాతవార్త:** గరివిడి పశువైద్య కళాశాల పరిస్థితి దయనీయమైంది. విద్యార్థుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారుతోంది. అసలు ఇక్కడ కళాశాల కొనసాగించే అవకాశం ఉందా లేదా అన్న అనుమానాలు వ్యక్తమయ్యే పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. ఉత్తరాంధ్ర నాయకత్వం ఈ కళాశాల పరిస్థితిపై ఏమి ఆలోచిస్తుందో అని విద్యార్థులు తల్లిదండ్రులు ప్రశ్నించే పరిస్థితి ఏర్పడింది. ఉత్తరాంధ్రకు చెందిన మంత్రులు, జిల్లా మంత్రులు గరివిడి పశువైద్య కళాశాల కొనసాగించే ప్రయత్నంలో ఉన్నారా, లేరా అన్న వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. అలాగే గరివిడి కళాశాల విషయంలో ఉన్నతాధికారులు, పాలకులు దృష్టి సారించడం లేదా అన్న ఆక్షేపణలు విద్యార్థుల తల్లిదండ్రులు నుండి వినిపించడం ఎంతైనా బాధాకరం. ఉత్తరాంధ్రలో ఉన్న ఏకైక పశువైద్య కళాశాల దుస్థితి పరిశీలిస్తే గరివిడి పశువైద్య కళాశాలకి న్యూఢిల్లీకి చెందిన పశువైద్య మండలి బృందం పరిశీలనకు కళాశాలకు వస్తుందన్న సమయంలో రాష్ట్రంలో ఉన్న మరో మూడు(గన్నవరం, ప్రొద్దుటూరు, తిరుపతి) పశువైద్య కళాశాలల నుండి డెప్యూటేషన్‌పై 28 మంది అధ్యాపకులను బదిలీపై తీసుకు రావడం ఆపై ఇన్స్పెక్షన్ ముగిసిన నెలరోజులు వ్యవధిలో మళ్ళీ ఆయా కళాశాల లకు మళ్ళీ డెప్యూటేషన్‌పై బదిలీ చేయడం మామూలైంది. గరివిడి కళాశాల నుండి 28 మంది బోధకులను బదిలీ చేస్తూ ఈ నెల 19 న ఉత్తర్వులు తిరుపతి పశు విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు జారీ చేశారు. గరివిడి కళాశాలలో 84 మంది అధ్యాపకులు అవసరం.అయితే 66 మంది తో కళాశాల నడుస్తోంది. వారిలో 28 మందిని మళ్ళీ బదిలీ చేశారు.కళాశాలలో మౌలిక సదుపాయాలు లేకపోవడం,తగినంత మంది బోధకులు లేని స్థితి,ఇతర సౌకర్యాలు లేమి కారణంగా వి సి ఐ అనుమతులు రాని పరిస్థితిలో మళ్ళీ అధ్యాపకులు బదిలీ చేయడం ఏమిటో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందని విద్యార్థుల తల్లిదండ్రులు గగ్గోలు పెడుతున్నారు. ఇక్కడ ఫైనల్ ఇయర్ ఇంటర్షిప్ విద్యార్థుల భవిష్యత్తు పాడవుతున్న పరిస్థితిలో ముఖ్యమంత్రి, పశుసంవర్ధక శాఖా మంత్రి జోక్యం చేసుకొని కేంద్ర పశుసంవర్ధక శాఖామంత్రి అనుమతి ద్వారా ఫైనల్ ఇయర్‌కి చెందిన 70 మంది విద్యార్థులను వేరే కళాశాల ద్వారా ఇంటర్షిప్‌కి అనుమతులు తెప్పించారు.ఆ విద్యార్థుల సర్టిఫికెట్‌లు చెల్లుబాటుకి అవకాశం కల్పించారు. ఈ స్థితిలో ఇక్కడి అధ్యాపకులను మళ్ళీ బదిలీ చేస్తే వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అనుమతులు ఏవిదంగా మంజూరు చేస్తుందో అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మరి యూనివర్సిటీ ఉన్నతాధికారులు, పాలకులు ఏ విధంగా ఆలోచన చేసి ఇక్కడ కళాశాల నిలబెడతారో వేచి చూడాల్సిందే.

## బదిలీ అయిన ఉపాధ్యాయునికి సన్మానం

**మెరకముడిదాం, జూలై 20,ప్రభాతవార్త:** మెరకముడిదాం మండలం బాడాం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేసి బదిలీ అయిన హేమ సుందర్‌ను ఉపాధ్యాయ



సిబ్బంది,స్ఫూర్తి, శ్రీరామ్ ట్రస్టు ప్రతినిధులు,గ్రామ పెద్దలు ఆదివారం నాడు పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు. ప్రస్తుతం బాడాం నుండి పాచిపెంట మండలం పూడి గ్రామంలో గల ఎంపిపి పాఠశాలకు బదిలీ అయ్యారు ప్రధానోపాధ్యాయులు శ్రీను,ఉపాధ్యాయులు సత్యన్నారాయణ, స్ఫూర్తి, శ్రీరామ్ ట్రస్ట్ సిబ్బంది,గ్రామ పెద్దలు పూల బొకే ఇచ్చి శాలువాలతో సన్మానించారు.

# కల్తీ ఫుడ్‌కు కేరాఫ్ అడ్రాస్‌గా 'దాబా హోటల్స్'!

**ఎక్కడ చూసినా కల్తీమయం !:**
**పట్టించుకోని ఫుడ్‌సేఫ్టీ అధికారులు !**
**అనారోగ్యం కొనితెచ్చుకుంటున్న జనాలు!**

**సాలూరు, జూలై 20,ప్రభాతవార్త:** పట్టణంలో ఇటీవల హోటల్స్ అలాగే ఊరి చివర ఉన్న దాబాలలో ఆహార పదార్థాల తయారీలో విపరీతమైన ఫుడ్ కలర్ ఇంకా కల్తీ చేయడంతో ప్రజలు అనారోగ్యం కోరికొని తెచ్చుకుంటున్నారని టౌన్‌లో టాక్ గట్టిగా వినిపిస్తుంది. ఫాస్ట్ ఫుడ్ కల్చర్ పెరగడంతో చికెన్ బిర్యాని, నూడిల్స్ అలాగే తండూరి చికెన్ వంటి ఆహార పదార్థాలను ఎసెన్స్ ఇంకా కలర్స్ వాడుతూ ప్రజారోగ్యాన్ని పక్కనపెట్టి దాబా హోటల్స్‌లో విచ్చల విడిగా అక్రమాలు జరుగుతున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు నిద్రమత్తులో ఉన్నట్టుగా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంచితే పెద్ద హోటల్స్‌లో 200 నుంచి 300కు దొరికే బిర్యానీ కేవలం 100 రూపాయలకు ఆఫర్ పెట్టి ఆకట్టుకొని ప్రస్తుతం ఎటువంటి లైసెన్స్ లేకుండా పట్టణంలో బిరియాని పాయింట్లులలో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అయినా ఇది ఏమి పట్టనట్లుగా కల్తీ నియంత్రణ అధికారులు చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆఫర్‌లో వచ్చింది కదా అని ప్రజలు ఇవి తిని ఆరోగ్యం చెడిపోయి హాస్పిటల్స్ చుట్టూ తిరిగి వేలాది రూపాయలు ఖర్చు పెట్టి ఉసూరుమంటున్నారు.అలాగే దాబాలలో కనీస నియమ నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా నిల్వ ఉన్న చికెన్, రొయ్యలు, చేపలు రంగులు కలిపిన ఫుడ్ తీసుకోవడం వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని తెలిసినా అధికారులు చూసి చూడనట్టు వ్యవరించడంతో వారి దందా ఇలా కొనసాగుతుంది. ఇప్పటికైనా కల్తీ ఆహారం పదార్థాలు యథేచ్ఛగా విక్రయిస్తున్న డాబా, హోటల్స్, రెస్టారెంట్లపై అధికార యంత్రాంగం ఉక్కు పాదం మోపి చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు గట్టిగా కోరుతున్నారు.

# బాక్సింగ్‌లో నిశాంత్ క్లీన్ పంచ్‌లు

## మూడో ప్రొఫెషనల్ బౌట్ గెలుపు

**న్యూఢిల్లీ:** బాక్సింగ్‌లో టెక్నికల్ నాకౌట్ ద్వారా భారత్ బాక్సర్ నిశాంత్ దేవ్ మూడో ప్రొఫెషనల్ బౌట్‌ను గెలుచుకున్నాడు. టెక్సాస్‌లో అమెరికాకు చెందిన లాక్వాన్ ఎవాన్స్‌తో జరిగిన తన కెరీర్‌లోని మూడవ బౌట్‌లో విజయాన్ని నమోదు చేయడం ద్వారా నిశాంత్ తన ప్రొఫెషనల్ బాక్సింగ్ కెరీర్‌కు విజయ ప్రారంభాన్ని విస్తరించాడు. జెస్సీ రోడ్రిగ్జ్ ఫుమెలెలా కాఫు మధ్య జరిగిన పోరు నేపథ్యంలో, నిషాంత్ ప్రారంభం నుండే ఎవాన్స్‌పై ఆధిపత్యం చెలాయించాడు. 24 ఏళ్ల ఈ భారత ఆటగాడు



బలంగా పంచ్‌లు ప్రారంభించాడు, ఇవాన్స్ పంచ్‌లను సులభంగా తప్పించుకుంటూనే, కొన్ని క్లీన్ షాట్‌లు కూడా కొట్టాడు. అతను తరచుగా తన ప్రత్యర్థిని రింగ్ యొక్క ఒక మూలకు నెట్టి క్లీన్ పంచ్‌లు వేయడంలో విజయం సాధించాడు. ఆరవ మరియు చివరి రౌండ్ ప్రారంభమైన ఒకటిన్నర నిమిషాలకు, నిషాంత్ నుండి వచ్చిన అప్పర్ కట్ అప్పటికే అలసిపోయిన ఎవాన్స్‌ను ఆఫ్‌గార్డ్‌కు తాకింది. నిషాంత్ తన భయంకరమైన దెబ్బలతో కనికరం చూపకపోవడంతో అతను మూలలో పడిపోయాడు. బౌట్ ముగియడానికి ఇంకా 1 నిమిషం 2 సెకన్లు మిగిలి ఉండగా, రిఫరీ జోక్యం చేసుకుని నిషాంత్‌ను గిరీవీ ద్వారా విజేతగా ప్రకటించాల్సి వచ్చింది. బాక్సర్ ఏదైనా గాయం కారణంగా సురక్షితంగా పోరాటాన్ని కొనసాగించలేనప్పుడు లేదా ప్రత్యర్థుల నుండి తమను తాము సురక్షితంగా రక్షించుకోలేనప్పుడు రిఫరీ బాక్సింగ్‌లో గిరీవీ లేదా టెక్నికల్ నాకౌట్ అని పిలుస్తారు. కాగా ఈ ఏడాది జనవరిలో ప్రొఫెషనల్‌గా అరంగేట్రం చేసిన అతను తొలి రౌండ్‌లోనే తన ప్రత్యర్థి ఆల్టన్ విగ్గిన్స్‌ను ఓడించాడు. ఆ తర్వాత గత నెలలో జరిగిన తన ండో బౌట్‌లో జోసు సిల్వాపై ఏకగ్రీవ నిర్ణయాత్మక విజయాన్ని నమోదు చేశాడు.

## ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్..

# క్వార్టర్ ఫైనల్స్‌కు భారత్

**న్యూఢిల్లీ:** గ్రూప్ డిలో వరుసగా రెండు విజయాలు సాధించిన తర్వాత, భారత్ హాంకాంగ్ చైనాతో అగ్రస్థానంలో తలపడింది. ఇండోనేషియాలో జరిగిన గ్రూప్ డి పోరులో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌పై 110-83 తేడాతో ఆధిపత్య విజయం సాధించిన తర్వాత భారత్ బ్యాడ్మింటన్ ఆసియా జూనియర్ మిక్స్‌డ్ టీమ్ ఛాంపియన్‌షిప్‌లో క్వార్టర్ ఫైనల్స్‌లో స్థానం సంపాదించింది. శ్రీలంకపై భారత్ తన తొలి రోజు అద్భుతమైన విజయాన్ని సాధించిన తర్వాత రెండో రోజు ఈ విజయం సాధించింది, అక్కడ వారు 110-69 తేడాతో తమ ప్రచారాన్ని అద్భుతంగా ప్రారంభించారు. ఆ మ్యాచ్‌లో, విష్ణు కోడె మరియు రేషిక యుల మిక్స్‌డ్ డబుల్స్ కలయిక 11-5 విజయంతో భారతదేశం యొక్క ప్రస్థానం ప్రారంభించింది, ఆ తర్వాత గాయత్రి, మాన్సా రావత్ జూనియర్ ప్రపంచ నంబర్ 1 తన్వి శర్మల ప్రభావవంతమైన ప్రదర్శనలు లభించాయి. ఆ ఓపెనర్‌లో ఒక్క భారత ఆటగాడు కూడా ఓడిపోలేదు. హాంకాంగ్ చైనా కూడా రెండు మ్యాచ్‌ల్లో రెండు విజయాలు నమోదు చేయడంతో, రెండు జట్లు ఇప్పుడు నాకౌట్ దశకు చేరుకున్నాయని నిర్ధారించాయి. గ్రూప్ డి విజేతలను నిర్ణయించడానికి రెండు జట్లు నేడు పోటీపడతాయి. ఈ టోర్నమెంట్ రిలే స్కోరింగ్ ఫార్మాట్ కింద జరుగుతోంది, ఇక్కడ జట్లు 10 మ్యాచ్‌లలో 110 పాయింట్లకు పోటీపడతాయి. బాలికల సింగిల్స్ క్రీడాకారిణి రుజుల రాము 11-5 తేడాతో మైషా ఖాన్‌ను ఓడించడంతో భారతదేశం అద్భుతమైన ఆరంభాన్ని పొందింది, ఆ తర్వాత మిక్స్‌డ్ డబుల్స్‌లో సి లాల్రామ్‌సంగా మరియు తారిణి సూరి జోడీ ఆధిక్యాన్ని 22-11కి పెంచింది. కొన్ని మ్యాచ్‌ల్లో యుఎఇ నుండి తీవ్రమైన ప్రతిఘటన ఎదురైనప్పటికీ, పోటీ అంతటా భారతదేశం ఆధిక్యాన్ని కొనసాగించింది. ఆట సగం ముగిసే సమయానికి, స్కోరు బోర్డు 55-41తో భారతదేశం వైపు ఉంది. యుఎస్ ఓపెన్ ఫైనలిస్ట్ తన్వి శర్మ ఆ తర్వాత మధుమిత సుందరపాండ్యన్‌పై క్లినికల్ ప్రదర్శన ఇచ్చి ఆధిక్యాన్ని 66-46కి పెంచింది. లాల్రామ్‌సంగా తిరిగి కోర్టుకు చేరుకున్నాడు, ఈసారి రెండవ మిక్స్‌డ్ డబుల్స్ మ్యాచ్‌లో రేషికా యుతో జతకట్టాడు, అక్కడ వారు ఆదిత్య కిరణ్ మరియు మైషా ఖాన్‌లను 11-5 తేడాతో ఓడించి భారత్‌ను 77-51కి మరింత ముందుకు తీసుకెళ్లారు.




# భారత్ మహిళా రెజ్లర్ల టీమ్‌కు టైటిల్

## 6 పతకాలతో అగ్రస్థానం

**న్యూఢిల్లీ:** వాంగేర్ ర్యాంకింగ్ సిరీస్‌లో భారత మహిళా రెజ్లర్ల జట్టు టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. బుడాపెస్ట్‌లోని పాలియాక్ ఇమ్రే వర్గా జానోస్ మెమోరియల్-2025లో భారత మహిళల రెజ్లింగ్ బృందం జట్టు టైటిల్‌ను గెలుచుకోవడం ద్వారా విజయవంతమైన ప్రచారాన్ని ముగించింది. 130 పాయింట్లు మరియు, మొత్తం ఆరు పతకాలు, రెండు స్వర్ణాలు, రెండు రజతాలు, రెండు కాంస్యాలతో అగ్రస్థానంలో నిలిచింది. మహిళల పోటీ చివరి రోజున, ప్రియా మాలిక్ 76 కిలోల విభాగంలో బంగారు పతక పోరులో బెలారస్‌కు చెందిన ఫ్రయెటెస్ మార్టిన్స్ చేతిలో 3-4 తేడాతో ఓడిపోయి రజతం సాధించింది. ఈ ఫలితం జట్టు ర్యాంకుల్లో భారతదేశం బలమైన స్థానాన్ని సంపాదించడాన్ని నిర్ధారించింది. అంతకుముందు జరిగిన మ్యాచ్‌లో ఆసియా ఛాంపియన్ మనీషా భన్వాలా 62 కిలోల విభాగంలో కాంస్యం సాధించింది. ఆమె కాంస్య పతక పోరులో బెలారస్‌కు చెందిన క్రిస్టినా సజికినాను ఓడించి అంతర్జాతీయ పోడియంకు తిరిగి వచ్చింది. భారత మహిళల ప్రచారానికి ఒలింపియన్ యాంటిమ్ పంఘల్ నాయకత్వం వహించారు, ఆమె 53 కిలోల విభాగంలో రష్యాకు చెందిన నటాలియా మలిషేవాపై 7-4 తేడాతో స్వర్ణం సాధించింది. గత నెలలో మంగోలియాలో జరిగిన ఉలాన్‌బాటర్ ఓపెన్‌లో టైటిల్ గెలుచుకున్న తర్వాత, యాంటిమ్ వరుసగా రెండవ ర్యాంకింగ్ సిరీస్ స్వర్ణం సాధించింది. 72 కిలోల విభాగంలో హర్షిత నాలుగుసార్లు ఆసియా ఛాంపియన్ కజకిస్తాన్‌కు చెందిన జామిలా బకిబెర్గెనోవాపై 100 తేడాతో ఆధిపత్య విజయం సాధించి భారత్‌కు రెండో బంగారు పతకాన్ని అందించింది.

# ఇంగ్లండ్‌తో నాలుగో టెస్టు

## భారత్‌కు ఫైనల్ టీం తలనొప్పి.. ప్లేయర్ల మార్పుపై సుదీర్ఘ కసరత్తు

**న్యూఢిల్లీ:** ఇంగ్లాండ్‌తో నాలుగో టెస్టు భారత్‌కు తుది జట్టు కూర్పు పెద్ద తలనొప్పిగా మారింది. ఇంగ్లాండ్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో భారత్ ప్రస్తుతం 1-2 తేడాతో వెనుకబడి ఉంది. ఈ నెల 23 నుంచి మాంచెస్టర్ వేదికగా నాలుగో టెస్టు మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను 2-2తో సమం చేయాలని భారత్ భావిస్తోంది. అయితే ఇప్పుడు టీమ్‌ఇండియాకు తుది జట్టు కూర్పు ఓ సమస్యగా మారింది. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా బుమ్రా ఈ మ్యాచ్‌లో ఆడడని కొందరు, అయితే కీలక మ్యాచ్ కావడంతో బుమ్రాను ఖచ్చితంగా ఆడించాలని మరికొందరు భారత క్రికెట్ బోర్డులో భిన్నాభిప్రాయాలున్నాయి. అదే సమయంలో పిచ్ స్పిన్నర్లకు సహకరించే అవకాశం ఉంది. దీంతో స్పెషలిస్టు స్పిన్నర్ అయిన కుల్దీప్ యాదవ్‌ను భారత తుది జట్టులోకి తీసుకుంటుందా? లేదంటే వాషింగ్టన్ సుందర్, జడేజాతోనే ఆడుతుందా అనేది ఆసక్తికరంగా మారింది. ఇంగ్లాండ్ పర్యటనకు ఏకైక స్పెషలిస్టు స్పిన్నర్‌గా కుల్దీప్ యాదవ్ వచ్చాడు. అయితే భారత్ ఇప్పటి వరకు ఆడిన మూడు టెస్టుల్లో ఆడినప్పటికీ అతడికి తుది జట్టులో చోటు దక్కలేదు. ఆల్‌రౌండ్ కోటాలో రవీంద్ర జడేజాతో పాటు, వాషింగ్టన్ సుందర్ స్పిన్నర్‌గా ఉన్నాడు. లార్డ్స్ టెస్టులో వాషింగ్టన్ తన ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. ఇక వీడిలో జడేజాను జట్టు నుంచి తప్పించడం అన్న ఆలోచనే ఉండదు. ప్రస్తుత జట్టులో అత్యంత సీనియర్ ఆటగాడు కావడంతో పాటు లార్డ్స్‌లో జట్టును గెలిపించేందుకు జడ్డూ చేసిన పోరాటం అసమానం. కుల్దీప్‌కు జట్టులో చోటు ఇస్తే అతడి బౌలింగ్‌లో ఇంగ్లాండ్ ఆటగాళ్లు ఇబ్బంది పడే అవకాశం ఉందని, అతడు వేసే బంతులు ఏది ఎలా టర్న్ అవుతుందో ఇంగ్లిష్ బ్యాటర్లు అంచనా వేయడం కష్టమని బోర్డు భావిస్తోంది. మాంచెస్టర్ పిచ్ మూడో రోజు నుంచి స్లోగా మారి స్పిన్నర్లకు అనుకూలం అనే అంచనాలు ఉన్నాయి. దీంతో కుల్దీప్ కీలక పాత్ర పోషించే ఛాన్స్ ఉంది. కుల్దీప్‌కు జట్టులో చోటు ఇస్తే సుందర్ పక్కన పెట్టాలా? లేదంటే బుమ్రాకు విశ్రాంతి ఇచ్చి ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దింపాలా అనేదానిపై తర్జనభర్జనలు జరుగుతున్నాయి. ఇక ఎనిమిదేళ్ల తరువాత జట్టులోకి రీ ఎంట్రీ ఇచ్చిన కరుణ్ నాయర్ అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోలేకపోయాడు. మూడు టెస్టుల్లో ఆరు ఇన్నింగ్స్‌లు ఆడి 131 పరుగులు మాత్రమే చేశాడు. ఈ సిరీస్‌లో అతడి అత్యధిక స్కోరు 40 పరుగులు. దీంతో అతడిని తప్పించి సాయి సుదర్శన్‌ను తీసుకుంటే బాగుంటుందని పలువురు సూచిస్తున్నారు.



# లాంగ్ జంపర్ మురళీకి స్వర్ణం




**న్యూఢిల్లీ:** మీటింగ్ మైయా సిదాడ్ దో డెస్పోర్టో‌లో పురుషుల లాంగ్ జంప్ టైటిల్‌ను గెలుచుకోవడం ద్వారా భారత లాంగ్ జంపర్ మురళీ శ్రీశంకర్ అంతర్జాతీయ వేదికపై బలమైన పునరాగమనం చేశాడు. పోర్చుగల్‌లో చలి మరియు గాలులతో కూడిన పరిస్థితుల్లో జరిగిన ప్రపంచ అథ్లెటిక్స్ కాంటినెంటల్ టూర్ కాంస్య స్థాయి పోటీలో అతను 7.75 మీటర్ల అత్యుత్తమ జంప్‌ను నమోదు చేశాడు. 26 ఏళ్ల ఈ ఆటగాడు 7.63 మీటర్లతో ఆరంభించి రెండవ రౌండ్‌లో తన అత్యుత్తమ జంప్‌ను నమోదు చేశాడు. అతను 7.69 మీటర్లు, ఒక ఫౌల్ అటెంప్ట్, 6.12 మీటర్లు మరియు 7.58 మీటర్లు జంప్ చేసి టోర్నమెంట్‌ను అగ్రస్థానంలో ముగించాడు. పోలాండ్‌కు చెందిన పియోటర్ టార్కోవ్స్కీ మరియు ఆస్ట్రేలియాకు చెందిన క్రిస్ మిట్రెవ్స్కీ వరుసగా రెండు మరియు మూడవ స్థానాల్లో నిలిచారు. 2023లో అలసట్రమైన హాంగ్‌జౌ ఆసియా క్రీడల తర్వాత శ్రీశంకర్ ఆడుతున్న తొలి అంతర్జాతీయ పోటీ పోర్చుగల్ మీట్. గత వారం, పూణేలో జరిగిన ఇండియన్ ఓపెన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ 2025లో శ్రీశంకర్ 8.05 మీటర్ల దూరం దూకి పోటీ లాంగ్ జంప్‌లోకి తిరిగి వచ్చాడు. గత ఏడాది ఏప్రిల్‌లో శిక్షణ సమయంలో శ్రీశంకర్ మోకాలిలోని పటెల్లార్ స్నాయువు పూర్తిగా చీలిపోయింది. దీని వల్ల అతను చాలా కాలం పాటు ఆటకు దూరంగా ఉన్నాడు. గాయం కారణంగా అతను 2024 పారిస్ ఒలింపిక్స్‌కు కూడా దూరమయ్యాడు. ఈ ఏడాది చివర్లో టోక్యోలో జరగనున్న ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లతో, +6శ్రీశంకర్ రాబోయే మీట్‌లకు అర్హత సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. అతని వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శన 8.41 మీటర్లు ఇప్పటికీ భారత అథ్లెటిక్స్ చరిత్రలో అత్యుత్తమ ప్రదర్శనలలో ఒకటిగా నిలిచింది.

# కిలో వెండి రూ.1.15 లక్షలు!

**ముంబై, జూలై 20:** ఆర్గమెంట్ సెక్టార్‌లో పుత్తడికంటే ప్రయారిటీ ఎవర్‌గ్రీన్. కానీ.. ఇవాళారేపు పసిడిమాతల్లి మధ్యతరగతికి దొరక్కుండా కొండెక్కి కూర్చుంది. దేశీయంగా 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర బంగారం ధర 99 వేల 340 రూపాయలు. కొనబోతే కొరివి తలపిస్తోంది. పర్యవసానంగా కొనుక్కోవాలంటే వెండివైపే ఆశగా చూస్తున్నారు సగటు కస్టమర్. కానీ.. ఆ వెండి కూడా అంత ఈజీగా దొరకనంటోంది. ఇప్పటికిప్పుడు వెండి కిలో ఆక్షరాలా లక్షా 15 వేల 136 రూపా యలు. దేశీయ సానుకూల పరిస్థితుల కారణంగా లక్షా 14 వేల దగ్గర క్లోజైన వెండి.. తర్వాతి రోజు లక్షా పాతిక వేలను టచ్ చెయ్యడంతో బంగారమే బెత్తరపాటులు చూసింది. మళ్లీ దిగొచ్చి లక్షా పదహారు వేల దగ్గర నిలబడింది రజత మాయ. కానీ.. పెరుగుతున్న డిమాండ్‌తో పాటే ధరల్లో కూడా వెండి దూసుకుపోవడం ఖాయం. ఐదే దూకుడు కంటిన్యూ ఐతే, కిలో వెండి ధర లక్షా 40 వేల టచ్ చేసినా ఆశ్చర్యం లేదని, 2026 నాటికి కిలో వెండి రెండు లక్షలకు చేరుతుందని అంచనా కడుతోంది బులియన్ మార్కెట్. వెండి ధరలు ఈ స్థాయిలో పెరగడం చరిత్రలో ఇదే మొదటిసారి. గత ఏడాదితో పోల్చి చూస్తే వెండి ధర దాదాపు 30 నుంచి 40 శాతం పెరిగింది. ఈ ఏడాది జనవరి నుంచి బంగారానికి దీటుగా వెండి ధరలు కూడా పైపైకే చూస్తున్నాయి. వెండికి ఆభరణాల మార్కెట్‌తో పాటు పారిశ్రామిక ఉత్పత్తిలో కూడా డిమాండెక్కువ. ఎలక్ట్రిక్ వాహనాలు, సోలార్ ప్యానెల్స్, కొన్ని ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీ లోనూ వెండిని వాడతారు. ఒక్క గ్రీన్ కార్ తయారీకైనా కనీసం 80 గ్రాముల వెండి కావాలి. మామూలు కారుకు 40 గ్రాముల సిల్వర్ అవసరం. పైగా వెండి ప్రొడక్షన్ తగ్గడం కూడా ధర పెరుగుదలకు మరో కారణం. మొదట్లో వెండి మీద ఇన్వెస్ట్‌మెంట్ కోసం ఎగబడ్డా.. సిల్వర్ ఎక్స్‌ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ మార్గంలో డిజిటల్ పెట్టుబడులు కూడా వెల్లువెత్తాయి. వెండిని పెట్టుబడి మార్గంగా భావించిన కొందరైతే ఫ్యాన్సీ వైపు చూస్తున్నారు. లాంగ్‌రన్‌లో లాభాలొస్తాయన్న గ్యారంటీ లేకపోవడంతో వెండివైపు మళ్లారు. అందుకే.. అలా అందిన లాభాలు పోను దేశీయంగా ఇంట్లో ఉండే పాత వెండిని బైటికి తీస్తున్నారు. వెండి చెంబులు, గిన్నెలు, కంచాలు, పూజా సామాగ్రి.. దేన్నీ ఒదిలేదు. 80 శాతం ధర వచ్చినా చాలంటూ తెగనమ్ముకోడానికి సిద్ధమౌతున్నారు కస్టమర్లు. మరేముఖ్యంగా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారికి పాత వెండి అమ్మకం చక్కటి ఆప్షన్ అవుతోంది. గుర్తింపు పొందిన జువెలరీ షాపుల్లో అమ్మడానికి ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు.



# పసిడి 6 నెలల్లో 26% జంప్

**ముంబై, జూలై 20:** ఈ యేడాది మొదటి అర్ధభాగంలో బంగారంపై పెట్టుబడి పెట్టిన వారు హ్యాపీగా ఉండి ఉంటారు. ఎందుకంటే ఈ ఆరు నెలల్లో బంగారం ధర 26శాతం పెరిగింది. ప్రపంచవ్యాప్తంగా గోల్డ్ గత సంవత్సరంలో 40 కొత్త రికార్డులను బద్దలు కొట్టిన తర్వాత మొదటి ఆరు నెలల్లో 26 కొత్త ఆల్-టైమ్ గరిష్టాలను నమోదు చేసింది. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ (డబ్ల్యూజీసీ) ప్రకారం, బలహీన మైన యుఎస్ డాలర్, రేంజ్‌బౌండ్ రేట్లు, అత్యంత అనిశ్చిత భౌగోళిక -ఆర్థిక వాతావరణం కలయిక బలమైన పెట్టుబడి డిమాండ్‌కు దారి తీసింది.'ఆర్థికవేత్తలు, మార్కెట్ భాగస్వాముల తమ స్థూల అంచనాలలో సరైనవారైతే, బంగారం ధర ఇంకొంచెం పెరుగుతుందని మా విశ్లేషణ సూచిస్తుంది. రెండవ అర్ధభాగంలో అది నంగా 0-5శాతం పెరగవచ్చని' అని డబ్ల్యూజీసీ ఒక నివేదికలో తెలి పింది. ఆర్థిక పరిస్థితులు క్షీణించి, ద్రవ్యో ల్బణం ఒత్తిళ్లు, భౌగోళిక ఆర్థిక ఉద్రిక్తతలు తీవ్ర తరం అయితే బంగారానికి డిమాండ్ గణనీయంగా పెరుగుతుంది. ప్రస్తుత ధరకు 10-15 శాతం పెరుగుతుంది. మరోవైపు విస్తృతమైన, స్థిరమైన సంఘర్షణ పరిష్కారం-ప్రస్తుత వాతావరణం లో ఆసంభవమని కనిపించేదే-బంగారం ఈ సంవత్సరం లాభాలలో 12-17 శాతం తిరిగి ఇస్తుంది అని నివేదిక తెలిపింది. నిపుణుల పోర్ట్ ఫోలియోలో వెండితోపాటు బంగారంపై కొద్ది భాగాన్ని మాత్రమే కేటాయించాలని సిఫార్సు చేస్తున్నారు. లిస్టెడ్ ఎస్‌జీబి లు, 2015 నుంచి రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా 67 సావరిన్ గోల్డ్ బాండ్స్ ట్రాన్సెన్‌లను ప్రారంభిం చింది. 14.7కోట్ల యూనిట్లను జారీచేసింది. అవి బిఎస్ఇ, ఎన్ఎస్ఇనగదు విభాగంలో లిస్టయ్యాయి. టైటిల్ పెట్టుబడిదారులు వాటిని డీమ్యాట్ ఖాతాల ద్వారా కొను గోలు చేయవచ్చు. విక్రయించవచ్చు. సావరిన్ గోల్డ్ బాండ్ల ఆకర్షణీయమైన కానీ కొత్త బాండ్లు జారీ కావడం లేదు. ఎస్‌జీబిలు అనేవి ఎనిమిది సంవ త్సరాల సాధనాలు, ఇవి ఐదు సంవత్సరాల లాక్-ఇన్ కాలం కలిగి ఉంటాయి. అవి స్టాక్ ఎక్ఛేంజిలో జాబితా చేయబడినప్పటికీ, వాణ్యం పరిమిత ద్రవ్యత కారణంగా వర్తకం చేయ బడతాయి. అయితే ఆర్‌బిఐ ఐదవ, ఆరవ, ఏడవ సంవత్సరాల ముగింపులో బైబ్యాక్ సౌకర్యాన్ని అందిస్తుంది.



# వాణిజ్యం

# సేవింగ్స్ అకౌంట్‌కి ఎఫ్‌డి లింక్ చేస్తే అధిక వడ్డీ..

**న్యూఢిల్లీ, జూన్ 20:** కొన్ని బ్యాంకులు అందుబాటులోకి తెచ్చిన ఆ ఫీచర్ వల్ల కలిగే ప్రయోజనాలేంటో తెలుసుకుం దాం. మన సేవింగ్ అకౌంట్‌లోని మిగులు డబ్బును అలా వదిలేయకుండా వల్ల ఎలాంటి వడ్డీ రాదు. అలాగని ఎఫ్‌డి చేద్దామా అంటే, ఎప్పుడు ఏ అవసరం పడుతుందో తెలీదు. తీరా ఎఫ్‌డి చేశాక, ఏదైనా ఎమర్జెన్సీ వస్తే.. ఎఫ్‌డి రద్దు చేయాలి. దీనివల్ల వడ్డీ నష్టపోతున్నామనే బాధ తప్పదు. అందుకే.. సేవింగ్ అకౌంట్‌ను ఎఫ్‌డితో అనుసంధానం చేస్తూ.. ఆర్బీఐ.. స్వీప్ ఇన్ ఎఫ్‌డి అనే ఆప్షన్‌ను అంది స్తోంది. దీనివల్ల సాధారణ పొదుపు ఖాతాతో పోలిస్తే మీకు మెరుగైన వడ్డీ రాబడుతో పాటు.. అత్యవసర అవసరాలకు అవసరమైన డబ్బును సేవింగ్ అకౌంట్ లోకి మళ్లించుకుని వాడుకోవచ్చు. సేవింగ్స్ ఖాతా ఉన్న బ్యాంకు బ్రాంచ్ లోనే స్వీప్‌ఇన్ ఎఫ్‌డిని చేసుకోవచ్చు. స్వీప్‌ఇన్ ఎఫ్‌డి కాలపరి మితి ఒక సంవత్సరం నుండి 5 ఆర్థిక సంవత్సరాల వరకు ఉంటుంది. సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్ మీద వచ్చే దాని కంటే ఎక్కువ వడ్డీ రేటు వస్తుంది. మీ డిపాజిట్ల గడువు ముగిసినప్పుడు, బ్యాంక్ ఆటోమేటిక్‌గా అసలు మొత్తాన్ని, పెరిగిన వడ్డీని మీకు అందిస్తుంది. మీకు అకస్మాత్తుగా డబ్బు అవసర మైతే, మీరు ఈ ఎఫ్‌డి నుంచి డబ్బును విత్‌డ్రా చేసుకోవచ్చు, తర్వాత దాన్ని తిరిగి ఫిల్ చేయవచ్చు. నిర్ణీత గడువులోగా ఆ డబ్బును తిరిగి డిపాజిట్ చేయాలి. దీనివల్ల మీకు ఎలాంటి పైన్ పడదు. ఉదాహరణకి మీరు మీ సేవింగ్ అకౌంట్‌లో ఇప్పుడు ఒక లక్షరూపాయలున్నాయి. అయితే, మీ నెల వారీ ఖర్చుకు రూ.50 వేలుంటే చాలు అనుకుంటే.. ఆ మిగిలిన 50 వేలు స్వీప్‌ఇన్ ఎఫ్‌డిలో మార్చు కోవచ్చు. ఇప్పుడు.. సేవింగ్ ఖాతాలోని 50 వేల మీద మీకు 2.5 శాతం నుంచి 2.75 శాతం వడ్డీ, స్వీప్‌ఇన్ ఎఫ్‌డిలోని 50 వేల మీద 5.5 శాతం నుంచి 7.75 శాతం వరకు వడ్డీ లభిస్తుంది. ఒకవేళ.. మీకు ఏదైనా అవసరమై.. సేవింగ్ ఖాతాలోని 50 వేలలో ఓ 30 వేలు తీసి వాడుకున్నారని అనుకుందాం. అప్పుడు.. ఆటోమేటిక్‌గా మీ స్వీప్‌ఇన్ ఎఫ్‌డిలో నుంచి రూ. 20 వేలు సేవింగ్‌లోకి మారతాయి. దీనివల్ల మీ కుటుంబ అవసరాలకు తగిన మినిమం ఎమౌంట్ సేవింగ్స్‌లో రెడీ గా ఉంటుంది. ఒకవేళ.. ఏదైనా ఆదాయం వచ్చి.. మీరు బ్యాంకులో మరో 50 వేలు డిపాజిట్ చేస్తే.. వెంటనే ఆటోమేటిక్‌గా మీ సేవింగ్స్ నుంచి రూ. 50వేలకు పైన ఉన్న మొత్తమంతా స్వీప్‌ఇన్ ఎఫ్‌డిలోకి వెళ్లి ఎక్కువ వడ్డీ వస్తుంది.



# ఇప్పుడు 9 క్యారెట్ల బంగారంపై కూడా హాల్‌మార్క్

**ముంబై, జూలై 20:** బంగారికి మన దేశంలో మహిళలు అత్యంత ప్రాధాన్యత ఇస్తుం టారు. అయితే బంగారు ఆభరణాలు కొనుగోలు చేసే ముందు హాల్‌మార్క్‌ను గమనించడం తప్పనిసరి. ఇప్పుడు 9 క్యారెట్ల బంగారం కూడా హాల్‌మార్కింగ్ పరిధిలోకి వచ్చింది. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బిఐఎస్) జూలై 2025నుంచి తప్పనిసరి హాల్‌మార్కింగ్ జాబితాలో 9 క్యారెట్లు అంటే 375 పాయింట్ల చక్కని బంగారాన్ని చేర్చింది. ఇది ఎనిమిదో దారులకు మరింత పారదర్శకతను ఇస్తుంది. చౌకైన ఎంపిక లలో కూడా నాణ్యతకు హామీ ఇస్తుంది. ఇప్పటి వరకు 24కెఫ్, 24కెఎస్, 23క, 22క, 18క, 14క గ్రేడ్‌ల వరకు బంగారంపై హాల్‌మార్కింగ్ వర్తించేది. బిఐఎస్ సవరణ తర్వాత ఈ జాబితాలో 9క కూడా చేర్చబడింది. 9 క్యారెట్ల హాల్‌మార్కింగ్ నిర్ణయం వినియోగదారులకు చౌకగా, ఆధునాతన డిజైన్‌లను అందుబాటులోకి తీసుకురావడానికి సహాయపడుతుందని మార్కెట్ నిపుణులు అంటున్నారు. ఇది వజ్రం, రత్నాల ఆభరణాలను మరింత సరసమైనదిగా చేస్తుంది. భారతదేశ ఎగుమతులను కూడా పెంచు తుంది. బంగారు గడియారాలు, పెన్నులు ఇకపై కళాఖండాలు వర్గంలోకి రావని బిఐఎస్ సవరణ స్పష్టం చేస్తుంది. అదే సమయంలో 24కెఫ్ లేదా 24కెఎస్ బంగారు నాణేలు మింట్, రిఫైనరీ నుంచి మాత్రమే జారీ చేయవచ్చు.




# రియాల్టీ మార్కెట్‌పై కెకెఆర్ నజర్

**న్యూఢిల్లీ, జూలై 20:** గ్లోబల్ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ కెకెఆర్ అండ్ కో ఇంక్ భారతదేశ రియల్ ఎస్టేట్ రంగంపై దృష్టిసారించింది. అభివృద్ధి చెందుతున్న ఈ మార్కెట్లో భారత్‌ను వ్యూహాత్మక పెట్టుబడికి గమ్యస్థానంగా గుర్తించినట్లు కెకెఆర్ తెలిపింది. వేగంగా అభివృద్ధి చెందుతున్న స్థిరాస్తి రంగంలో పెరుగుతున్న ఆసక్తికి ఇది ప్రైవేట్ చేస్తుంది. ప్రస్తుత ఆస్థిరతల మధ్య కూడా దేశ ఆర్థిక అభివృద్ధి, విధానాలు, వినియోగదారుల ఆసక్తి మెరుగ్గా ఉందని ఎత్తిచూపుతూ, ఎమర్జింగ్ మార్కెట్లలో భారత్ వ్యూహాత్మకంగా నిలుస్తుందని సంస్థ పేర్కొంది. రూపాయిలో స్వల్ప క్షీణతను కెకెఆర్ అంచనా వేసిన ప్పటికీ, దీన్ని సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని తెలిపింది. మార్చి 2025 నాటికి ప్రపంచ వ్యాప్తంగా కెకెఆర్ 664 బిలియన్ డాలర్ల విలువైన ఆస్తులను నిర్వహిస్తోంది. రియల్టీ పరంగా చైనాలో కల్లోల పరిస్థితులున్నా యని, యూరప్‌లోని కొన్ని ప్రాంతాల్లో స్తబ్దత నెలకొందని కంపెనీ చెప్పింది. భారత్‌లో పరిస్థితులు అందు కు భిన్నంగా ఉన్నా యని తెలిపింది. భారత దేశం, జపాన్, ఆగ్నేయా సియాతో సహా ఆసియా రియల్ ఎస్టేట్ మార్కెట్లలో అభివృద్ధికి అవకాశాలను చూస్తున్నామని కెకెఆర్ తాజా సమీక్షలో పేర్కొంది. నిర్మాణాత్మక వృద్ధి, మార్కెట్ ఒడుదు దుకులు కలిసే ఆసియా రియల్ ఎస్టేట్‌ను అధిక రాబడికి అవకాశంగా చూస్తున్నట్లు తెలిపింది. ఇ-కామర్స్ వృద్ధి, డేటా సెంటర్ల విస్తరణ, సప్లై చెయిన్ ఆధునీకరణ వంటి విస్తృత అంశాలకు అనుగుణంగా లాజిస్టిక్స్, డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను భారత్‌లో ఆకర్షణీయ విభాగాలుగా గుర్తించినట్లు కూడా పేర్కొంది.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942-271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.